తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



**నవంబర్ 01, 2020**

సంపుటి 01 సంచిక 02

*Complimentary Copy*




***Printed and Published by : TELANGANA JAGRUTHI***
Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium
Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
E-mail : editor@thangedu.co.in

# విషయ సూచిక



15

అధో జగత్తుకు చెందిన ఒక పని అమ్మాయి కలలకు- వాస్తవానికి ఉన్న వ్యత్యాసం తెలుపుతూ అంతరాల మీద నిరసన ప్రకటన... **అయోధ్య రెడ్డి** కథ.. **పనిపిల్ల** **(నేటి కథ)**



29

తెలంగాణ ఉద్యమంలో సాహిత్యం పాత్ర మరువలేనిది. యువ పురస్కార గ్రహీత వ్యాసం **తెలంగాణ ఉద్యమపాట సిద్ధాంతీకరణ...**



37

**మోదుగు పూలు నవలలో తెలంగాణ**

ఆనాటి తెలంగాణ జనజీవన చిత్రణ ఈ వ్యాసం...



05

**గ్యారా కద్దూ బారా కొత్వాల్** **(నాటి కథ)**

తెలంగాణ వైతాళికుడు **సురవరం**. ఆనాటి తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన కలం యోధుని అక్షర దీక్ష...



41

**సాహిత్యమే ఉద్యమంగా** సాగిన రైతు హృదయం నందిని సిధారెడ్డిది. ఏ ఇజానికీ చిక్కని కవి సిధారెడ్డి తో నవీన్ ఆచారి ఈ పక్షం **ముఖాముఖి**



34

**కవన రాగాలు**

సమకాలీన సమాజ విషాదాన్ని ఆలపించిన **హిమజ** కవిత **చేదుపాట...**



09

ఆయనది తెలంగాణ గర్వించదగ్గ సాహితీ వ్యక్తిత్వం. ఆ వ్యక్తిత్వాన్ని **వర్షుల** అక్షరమాల నుంచి **పుంభావ సరస్వతి మధురకవి మామిడి పల్లి సాంబశివశర్మ...**

---

**బతుకమ్మ పండుగ సందర్భంగా వెల్లివిరిసే మానవ సంబంధాలను మార్దవంగా చిత్రించిన దోరవేటి పద్య కవిత్వం** **బిడ్డ రాక** ...33లో


**కవన రాగాలు:** స్నేహ బంధాన్ని చిత్రించిన **పోతన** పద్యం **'స్నేహ మాధురి'** ...08లో

తెలంగాణ భాషలోని నాదమాధుర్యాన్ని, సజీవ కవితా గుణాన్ని పాఠకులకు పంచిన నలిమెల భాస్కర్ వ్యాసం **తెలంగాణ భాష** ...25లో

**కొత్త కలం:** **తగుళ్ల గోపాల్** **దండ కడియం...40లో**

**వాసరచెట్టు జయంతి** **నేల విమానం...40లో**

**అభినందన:** **ఆల్ ది బెస్ట్ టు రామా చంద్రమౌళి** ...28లో

**అమాసలు సమాన** అవకాశాల కోసం కలగనే **జూపాక సుభద్ర** కవిత ...33లో

మధ్య తరగతి మందహాసం లాంటి **ఆశారాజు** కవిత **బొమ్మలు పగిలిపోయాయి** ...19లో

# తంగెడు మొదటి సంచికకు స్పందన...




సంపాదకులూ... జాగా సరిగ్గా వాడండి. మంచి ప్రయత్నం చేస్తున్నారు. శుభాకాంక్షలు.
**- చీకోలు సుందరయ్య, రచయిత**

తంగేడు అందింది. చాలా బాగుంది. ఆధ్యాత్మికతకు కూడా పేజీ కేటాయించండి. పత్రికను స్వయంపాలితం చేయండి.
**- కె.వి. రమణాచారి, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహాదారు**

వందేళ్ళయినా మీ పత్రిక దాచుకోగలుగుతాం. అంతమంచి పేపరు వాడారు. ఎంపిక బాగుంది. సంపాదకీయం, ఆళ్వారుస్వామి కథనం బాగా నచ్చాయి. పెద్ద కథను పరిమిత స్థలంలో చక్కగా పొదిగించారు.
**- నాళేశ్వరం శంకరం, కవి**

పత్రిక బాగుంది. రెండు మూడు సంచికలలో మీకు పరిణితి వస్తుంది. దోషాలుంటే తొలగిపోతాయి. శుభాకాంక్షలు.
**- ప్రొ. పిల్లలమర్రి రాములు**

తంగేడు సంపాదకవర్గానికి శుభాకాంక్షలు. మీ రచనల ఎంపిక బాగుంది. సంపాదకీయం చాలా బాగుంది. సాహిత్య పత్రికకు ఇంత విలువైన పేపర్ అవసరమా..? ఒకసారి ఆలోచించండి.
**- డా.ఎన్. గోపి, మాజీ ఉపకులపతి**

పాత కవితలు, పాత కథలు వేయడం బాగుంది. కొనసాగించండి.
**- దేవకీ దేవి, రచయిత్రి**

పత్రిక బాగా వచ్చింది. ఒక సాహిత్య పత్రిక ఇంత అందంగా నేనెప్పుడూ చూడలేదు.
**- పెద్దింటి అశోక్ కుమార్, కథారచయిత**

బతుకమ్మ బాటలో 13 ఏళ్ళ ప్రయాణం, రంగు నవీనాచారి వ్యాసం బాగా నచ్చింది. పత్రిక చాలా బాగుంది.
**- జి.ఆర్. కుర్మె, పరిశోధకుడు**

ఇప్పుడే నేను తంగేడు అందుకున్నాను. దీనిమీద నా పద్యం.
కం.
*సింగిడి నిండిన తంగే*
*డంగాంగము సుందరముగ నాంగణమందున్*
*సంగడికాంద్రను గలుపుచు*
*చెంగలి నిలిచెను తెలుగున చిత్తులబొమ్మై (పొత్తై)!*
*ఇక్కడ చిత్తు అంటే జ్ఞానము*
**- అనిల జయదీప్, కవయిత్రి**

పత్రిక బాగుంది. అభినందనలు. ఇదే పద్ధతితో కొనసాగండి.
**- అనిశెట్టి రజిత, కవయిత్రి**

సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక


01 నవంబర్, 2020

సంపుటి 01 సంచిక 02





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614



*Cover photo courtesy :*
***Gujja Naresh***

*Back cover photo courtesy :*
***Navadheer Mudusu***


సాహితీ అభిమానులకు, సృజనకారులకు నమస్తే.

తెలుగు సాహిత్య పత్రిక "తంగేడు" తొలి సంచికను స్వాగతించి ఆదరించిన సాహితీ ప్రియులకు, భాషాభిమానులకు కృతజ్ఞతలు. అనేక మంది మా ఈ ప్రయత్నాన్ని అభినందిస్తూ పంపుతున్న సందేశాలు మాకు కొత్త ఉత్తేజాన్నిస్తున్నాయి. అలాగే చాలా మంది చేసే సద్విమర్శలు, సూచనలు "తంగేడు"ను మరింతగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తున్నాయి.

తెలంగాణలో సాహిత్య వికాసం తెలంగాణ జాగృతి ముఖ్య ధ్యేయాలలో ఒకటి. అందుకే సంస్థ ఆరంభం నుండి అనేక అమూల్యమైన పుస్తకాలను ముద్రించి కవులు, రచయితల కృతులను వెలికి తీసుకు వచ్చింది. తెలంగాణ యువతరంలో సాహితీ పిపాసను పెంపొందించేందుకు కవి సమ్మేళనాలను, కవిత్వ కార్యశాలలను నిర్వహించింది. 2017లో తెలంగాణ వ్యాప్తంగా అన్ని నూతన జిల్లా కేంద్రాలలో జాగృతి నిర్వహించిన కవి సమ్మేళనంలో 2500 కు పైగా కవులు తమ కవితాగానం చేయడం చారిత్రాత్మకం. అలాగే పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచడానికి "బుక్ క్లబ్" నిర్వహణకు శ్రీకారం చుట్టి ఒక నిరంతర యజ్ఞంలా కొనసాగిస్తున్నది.

ఇదే క్రమంలో తెలుగు సాహిత్యానికి మరింత వన్నె తెచ్చేలా ఒక తెలుగు సాహితీ పత్రికను ప్రారంభించాలని, అది అనేక మంది సాహితీకారులకు, సమాజానికి ఉపయుక్తంగా ఉంటూ తెలుగు సాహితీ విస్తృతికి తోడ్పడాలన్నది చాలాకాలంగా మా ఆకాంక్ష. ఈ దిశగా అనేకమంది పెద్దల, భాషాభిమానుల ఆశిస్సులతో పురుడోసుకున్న నవజాత శిశువు "తంగేడు".

సాహితీ పత్రికంటే రెండు కథలు, రెండు వ్యాసాలు, మరో నాలుగు కవితలు అన్నట్టు మూస ధోరణిలో కాకుండా నిరంతర సాహితీ సృజనకు బాటలు వేస్తూ వివిధ ప్రక్రియలకు, ప్రయోగాలకు స్ఫూర్తినిచ్చేట్టుగా ఉండాలన్నదే మా ఆశయం. అందుకే విస్మృత తెలంగాణ సాహిత్య సంపదను పునశ్చరణ చేసుకుంటూనే నూతన సృజనకు పెద్దపీట వేయలన్న ఆలోచనతో "తంగేడు" ముందుకు సాగుతుంది. నాటి కథ, నేటి కథ, పద్యం, కవిత్వం, నాటి రచనల్లో తెలంగాణ సమాజ చిత్రణ, సమకాలీన సాహిత్యం మీద విశ్లేషణాత్మక వ్యాసాలతో పాటు అంతర్జాలం వంటి వివిధ మాధ్యమాలలో వస్తున్న నూతన ప్రక్రియలను, సాహిత్యాన్ని పాఠకులకు అందించాలన్నది ప్రాథమికంగా 'తంగేడు' ఎంచుకున్న మార్గం. వివిధ సాహితీ సంస్థలు చేస్తున్న సాహితీ సేవను, కార్యక్రమాలను పాఠకులకు చేరవేయడం, నూతన పుస్తకాల పరిచయం, ప్రతిభావంతులైన సాహితీమూర్తులను గౌరవించుకోవడం వంటివి కూడా పత్రిక విధుల్లో ఉన్నాయి. స్ఫూర్తివంతమైన సాహితీ వేత్తల అంతర్ముఖాన్ని ఆవిష్కరించే ప్రయత్నంలో భాగంగా ప్రతి పక్షం ఒక ప్రముఖ సాహితీవేత్త ఇంటర్వ్యూ ఈ సంచిక నుండి మొదలవుతుంది.

అలాగే దృశ్య సాహిత్యంగా ఆధునిక కాలంలో పరిణమించిన వివిధ ప్రపంచ, భారతీయ భాషల్లోని ఉత్తమ చిత్రాలను కూడా తెలుగు పాఠకులకు పరిచయం చేయలన్న ఆలోచన మాది. ఇందుకోసం ఈ సంచిక నుండి మొదలైన శీర్షిక "దృశ్య సాహిత్యం"అదే సమయంలో కవులు రచయితలకు వేదిక నివ్వడంతో పాటు, సాహిత్యంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి "తంగేడు" స్ఫూర్తిదాయకంగా నిలవాలనుకుంటున్నది. అందుకోసం ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఉత్తమ సాహిత్యాన్ని పరిచయం చేసే గవాక్షం లాగా "తంగేడు" ఉండాలన్నది మా అభిమతం. ఇందుకోసం "శిఖరం" అనే మరో శీర్షిక కూడా ఈ సంచిక నుండి ప్రారంభమవుతుంది. ఒక బెంగాలీ రచన భారతదేశ సాహిత్యానికి ప్రపంచ వ్యాప్తంగా ఒక గుర్తింపు తెచ్చినపుడు మరి తెలుగు భాష నుండి అటువంటి ఒక రచనలు రావడానికి జరిగే సానుకూల ప్రయత్నాలకు తంగేడు ఒక చోధకశక్తి కావాలన్నది మా ఆకాంక్ష. ఒక మాట, ఒక పాట, ఒక కవిత, ఒక సాహిత్య కారుడి సూచన, ఒక చర్చ, ఒక సద్విమర్శ ఏ కవిలో ఏ అగ్ని రగిలిస్తుందో ఎవరికెరుక. "తంగేడు" ద్వారా ఈ దిశగా ఎవరికి వీసమెత్తు ప్రేరణ దొరికినా మా ప్రయత్నం సఫలమైనట్టే భావిస్తాము.

భాష సంపద్వంతం అవడానికి విస్తృత సాహితీ సృజనతో పాటు నూతన ప్రయోగాలు, అనువాదాలు కూడా తోడ్పడతాయని మా నమ్మకం. ఒక షేక్స్పియర్ పదిహేడు వందల పైగా నూతన పదాలను సృష్టించి తన సాహిత్యంలో వాడుకున్నాడు. ఇవ్వాల ఆ పదాలన్ని ఆధునిక ఇంగ్లీషులో భాగం.

సాహిత్యం ఒక జీవనది. ఈ దిశగా దేశ, ప్రపంచ సాహిత్యంలో ఉత్తమమైనవిగా పేరొందిన గ్రంథాలను, చిత్రాలను మన యువకవులకు పరిచయం చేయడంతో పాటు సాహిత్యంలో వస్తున్న మార్పులను, జరుగుతున్న ప్రయోగాలను తెలుసుకునేందుకు ఈ పత్రిక దోహద పడాలన్నది మా ప్రయత్నం. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక రాజకీయ, సామాజిక పెను మార్పుల వెనుక ఆయా కాలాలలో వచ్చిన సాహిత్యం ప్రధాన పాత్ర పోషించదనడానికి లెక్కలేనన్ని ఉదాహరణలున్నాయి మనకు.

తెలుగు భాషాభిమానులకు మంచి సాహిత్యాన్ని అందించడం, సాహిత్యకారులకు వేదికనివ్వడంతో పాటు ప్రపంచస్థాయి సాహితీ సృజనకు మన యువకవులు, రచయితలను పురికొల్పాలనేది "తంగేడు" ప్రయత్నం. తంగేడు ఒక అక్షరాల జీవనది కావలన్నది మా ఆకాంక్ష... ఆశీర్వదించండి. జై తెలంగాణ.

కవిత కల్వకుంట్ల

## రచయితలకు సూచనలు

- సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి
- పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి
- మా పత్రిక కు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్ లో పెట్టండి.
- ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి
- వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

నాటి కథ

# గ్యారా కద్దూ బారా కోత్వాల్

**తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి. చరిత్రకారులుగా, సంస్కృతి పరిశోధకులుగా, విమర్శకులుగా, కవిగా ప్రసిద్దులు.**

**ఒక అమాయకుడు తుదకు లక్షాధికారి ఎట్లా అయినాడో చెబుతారు రచయిత. 1896-1953 లో జీవించిన సురవరం తన రచనల్ని సరళ గ్రాంథికంలో వెలయించారు. ఆనాటి రచనా సంవిధానాన్ని వస్తువును పరిచయం చేయడానికి ఈ కథ.**



సురవరం ప్రతాప రెడ్డి

ఒకనాడు ఒక పల్లెకాపు 11 సొరకాయలను కంబట్లో వేసుకొని ఒక గ్రామానికి అమ్ముకొనేదానికి వెళ్ళినాడు. గ్రామంలో అమ్మలక్కలు పదిమంది మూగి బేరం చేస్తూవున్నారు. అంతలో మాలీపటేల్ వేంచేసినాడు. "ఒరేయ్! ఈడ కూర్చో మని నీకెవరు సెలవిచ్చినారు? మంచి మాటలతో ఒక కాయ ఇచ్చిపో" అంటూ తానే ఒక పెద్ద కాయను లాగుకొని పోయినాడు. కాపువాడు గొణుకుంటూ ఉన్నాడు. అంతలోనే గోరు చుట్టుమీద రోకటి పోటన్నట్లుగా పోలీసు పటేలు హాజరైనాడు. "పట్టుకొని రారా వాన్ని. ముసాఫిర్ల లెక్కలో వాని పేరు రాయాల్సింది వుంది" అని గర్జించినాడు. తలారివచ్చి తనపాలి వక కాయ, పటేలు పాలిటి వక కాయ లాగుకొని పోయినాడు. కొంత సేపటికి పెద్ద తలారివచ్చి నాడు. "ఏయ్, మొన్న నీవంటివాడే వచ్చిండె. పొద్దు మునిగి నప్పుడు కూరగాయలమ్మనట్లు అమ్మి రాత్రి కోమటోళ్ళ యింట్లో కన్నం వేసిండు. పద! చావిట్లో నిన్ను కట్టేస్తాన్" అంటూ తానున్నూ ఒక కాయ చేతబట్టుకున్నాడు. "అయ్యా! మారాజా! నేను దొంగను దొరను కాను. పొరుగూరు వాన్ని. ఎల్లప్పటికిన్ని వచ్చి పొయ్యటోన్ని, ఇప్పటికే మూడు కాయలు ఎగిరిపోయినవి మళ్ళీ నీవెక్కడినుంచి ఊడి పడితివి అని కాపువాడు మొరపెట్టుకున్నాడు. అదే కాయతో వాని నెత్తిన పొడిచి, కాయతో చక్కాపోయినాడు పెద్ద తలారి. ఈ విధంగా పూజారి, పురోహితుడు, కమ్మరి, వడ్ల మొదలైన 11 మంది ఆయగాండ్లు ఒకరివెనుక వకరువచ్చి కాయలన్నీ లాగుకుని పోయినారు. కాపువాడు ఏడ్చు కుంటూ గొంగడి దులుపుకొని లేస్తున్నాడు. చీకట్లోనే చేనికి పోయినట్టి కర్ణమయ్య అప్పుడే వానికి ప్రత్యక్షమైనాడు. ఏమిరా ఏడుస్తున్నావు? నిన్నెవరేమన్నారు నాకు చెప్పు. నేనీవూరి కర్ణాన్ని. తప్పు చేసినోనికి శిక్ష యిప్పిస్తాను" అని అన్నాడు. న్యాయం విచారించే ప్రభువు ఒక్కడైనా ఈవూరిలో ఉన్నాడురా నారాయణా అని అనుకొని కాపువాడు తన 11 సొరకాయలు మాయమైన విధమంతా వినిపించి "అయ్యా కరణమయ్యా, నీవే నారాయణమూర్తివి. నన్నెట్లన్నా గడ్డ కేయండి" అని గొంగడి ఆయన కాళ్ళ మీద వేసి కాళ్ళు పట్టుకొన్నాడు. కర్ణం ఒక్క తన్ను జాడించి తన్ని కంబడి లాగి చంక బెట్టుకొని ఇట్లన్నాడు: "అరే లుచ్చా! అందరికీ వంతు సొరకాయ యిచ్చి నావంతు తప్పించి నావా? నేను తలారివానికంటే పనికి రానివాన్నా? వడ్లోనికంటే వ్యర్థుడనా? ఆ ఓనమాలురాని మాలీపటేలు నీకు ఎక్కువైనాడా? తే! నా వంతు సొరకాయ. అదిచ్చి యీ గొంగడి తీసుక పో" అని గుడ్లెర్రచేసుకుని కంబళి తన చంక బెట్టుకొని తన యింటికి పోయినాడు.

కాపువాడు ఎగాదిగా చూచినాడు. "నీవూ ఇంతేనా? ఈ వూరంతా ఇంతే! ఏందేశం యిది పాడు దేశం. ఇంక నావంటి దిక్కులేనివారు బదికే దెట్లా?" అని గొణుగుతూ పట్వారివెంట కొంతదూరం దీనంగా ప్రాధేయ పడుతూ వెళ్ళినాడు. "ఒరేయి! ఒక్క అడుగు ముందుకు వేస్తే నీతలకాయ పగులతంతా ఖబర్దార్? (జాగ్రత్త)" అన్నాడు పట్వారి. కాపువాడు దిక్కుతోచకుండా నిలిచిపోయినాడు. చిన్న పిల్లవానివలె కొంత సేపు ఏడ్చినాడు. ఒకరిద్దరు ఆడవారు వాన్ని చూచి "పో నాయనా! పో! పొద్దున్నే ఎవరిముఖం చూచినావో ఏమో! యీవూళ్ళో అందరూ ఇట్లాటి మారాజులే. ఇంకోమారు రావద్దు" అని బుద్ధి చెప్పినారు. కాపువాడు దీర్ఘాలోచన చేస్తూ ఇంటి బాట పట్టినాడు. "థూ. పుట్టితే పటేలు పట్వారి అయి పుట్టాలె. లేకుంటే తలారిగా అయినా పుట్టాలే. ఈ బదుకు బతికినా వకటే చచ్చినా వకటే ...... కాయలుపోతే పోయెకాని గొంగడి కూడా పోయింది. అందరికంటే ఆ కర్ణమోడు మరీ

చెడ్డవాడు. అందు కోసరమే కాటికి పోయినా కర్లంపీడ తప్ప దన్నారు. పెద్దలు... దీనికి బదలా తీయ కుంటే నేను మనిషినా? అయితే బీదోన్ని ఏమి చేయగలను? ఆ తలారికి చేరెడు చేనన్నా లేదు. నాకు చేనుంది. పెండ్లాము పైన వంకివుంది ఒక ఎద్దుంది. తలారికంటే తక్కువనానేను? ...... దేవునికై నా దెబ్బే గురువు. నేనున్నూ ఏదో మొండి తొండిచేస్తా......" ఇట్లా ఆలోచనా పరంపరలో మునిగి నడుస్తున్నాడు. తన మోటబావిని సమీపించినాడు. బావిగడ్డ పై కూర్చున్నాడు. ఇంకా దీర్ఘాలోచనలోనే ఉన్నాడు. తటాలున మెరుపు మెరసినట్లా వాని తలలో వక ఆలోచన తళుక్కుమంటూ ప్రవేశించింది. చటుక్కున లేచినాడు. ఊళ్ళోకి పోయినాడు. చక్కగా పెండ్లాం వద్దకు వెళ్ళి "ఒసేయి! నీ వంకి ఇట్లాతే. ఇయ్యమంటే! నీకేం పర్వాలేదు తే. మళ్ళీ వుగాదినాటికి ఒకటికి నూరువంకీలు చేయిస్తే నా పేరు వెంకయ్య! అనూ'' అని వంకీని లాగుకున్నాడు. పటేలుకు దాన్ని 200 రూపాయలకు అమ్మినాడు. పైకం తీసుకొని 10 మైళ్ళ దూరంలో ఉండే పట్నం చేరుకున్నాడు. షేర్వానీలు, లాగులు, మోజాలు పగిడీ, నడుముపట్టి, బిల్లలు మొదలైన పరికరాలు సిద్ధముచేసుకొన్నాడు. నలుగురు అరబ్బు జవానులను జత చేసుకున్నాడు. వారికి బిల్లులు తగిలించాడు. తానున్నూ బాగా వేషం వేసుకొన్నాడు. ఒక బగ్గిని కిరాయకు మాట్లాడుకొన్నారు.



రెండామడల దూరంలో ఒక పెద్దబస్తీ ఉండింది. అది నాలుగు బాటలు కలిసే స్థలం. గొప్ప వ్యాపారిపేట. అధికారులు, మంత్రి, నవాబు కూడా ఆ మార్గంగా షికారుకు పొయ్యే స్థలం. ఆ గ్రామంలో మన కాపు చేరినాడు. ఊర బావిగట్టున ఒక పెద్ద మఱ్ఱిమా నుండింది. దానికింద మేజు కుర్చీలు వేయించినాడు. జవానులను బావిపై

> కాపువాడు తన కథంతా వర్ణించి వర్ణించి చెప్పుకొన్నాడు. హుజూరు వారు అదేపనిగా నవ్వుతూ సాంతం విని "అరే! నీవు చాలా హుషారు మనిషివి. నీతప్పంతా మాఫ్ ఇక ముందు నీవు మాదేవిడీ రాత్రి గంటలు కొట్టూవుండుము. అదే నీకు శిక్ష" అని సెలవిచ్చినారు. కాపు వానికి కొన్నాళ్ళవరకు తిక్క లేచినట్లుండింది. ఏమిన్నీ ఆదాయం లేదు. అధికారం లేదు.

పహారా ఎక్కించినాడు. ప్రొద్దునే ఊరులోని ఆడవారు నీటికి వస్తే ఆ జవానులు "ఖబర్దార్, కడవకొక పైసాయిచ్చి నీళ్ల తీసుకోండి'' అని బెదిరించి నారు. పటేలు పట్వారీలు వచ్చినారు. "ఒరేయ్! మాకు సర్కారు హుకుం అయింది. ఇదిగో ఫర్మాన్" అని ఉర్దూ ముద్రలతో నుండే ఫర్మాను చూపించినాడు కాపు. ఉండవచ్చునని గ్రామాధికారులు ఊరకున్నారు.

దినమున్నూ పైకం బాగా వసూలు కాబట్టింది. మొదట మొదట దినం 20 రూపాయల వరకు వసూలైంది. క్రమేణ ఆదాయం ఎక్కువైంది. "మఱ్ఱిమాన్ పరిగణా సుంకం'' చుట్టూ రెండామడవరకు ప్రసిద్ధి అయిపోయింది. ఇట్లా వారాలు, నెలలు, సంవత్సరాలు గడచినవి. ఒక నాడు సుబేదారు దొరావచ్చి గుడారాలు వేయించి నాడు. అతని నౌకరు నీటికి పోతే "పైసా లావ్" అన్నారు జవానులు. వారు ఉత్త కడవలతో వాపసు పోయి "సర్కార్! నల్గురు అరబ్బీ జవానులు పైసా యియ్యంది నీళ్ళు తీసుకోనివ్వరు. అరే సుబేదార్ సర్కారు వారికిరా! అంటే జంబియాలతో పొడిచేదానికే పైబడవస్తారు సర్కార్!'' అని విన్నవించు కొన్నారు. అక్కడనే సేవలో ఉన్నట్టి పటేలు పట్వారీ లిట్లన్నరు. "హుజూర్! పదేండ్ల నుండి యీ మఱ్ఱిమాన్ పరగణా సుంకం సక్రమంగా వసూలౌతుంది. అందుకు సర్కారు ఫర్మాను వుంది. ఉంటే ఉండవచ్చును'' అనుకొని సుబేదారు కూడా పైసలిచ్చి నీరు తెప్పించుకొన్నాడు.

ఒకనాడు దీవాన్ బహద్దూర్ గారు అక్కడ డేరావేయించినాడు. అతనికిన్నీ ఇదేగతి పట్టింది. అరబ్బులు కడవకు పైసా పెట్టింది ఒక మెట్టు కూడా దిగనియ్యరు. దీవాను గారు అంతా వినుకొని ఇట్లను కొన్నారు : "మా హుజూర్ గారు ఫర్మానిచ్చి నారేమో లేకుంటే నావద్ద కూడా వసూలు చేసే గుండెవుందా వీనికి?'' దీవానుగూడా సుంకం చెల్లించు కొన్నాడు. ఇక కాపువాన్ని పట్టపగ్గాలు లేవు. సుబేదారేమిటీ దీవాను బహద్దరు కూడా కిక్కురుమనకుండా సుంకం చెల్లించుకొని పోయివుంటే అబ్బా ఏం దర్జారా వీనిది అని జనులు చాటున అను కునేవారు. ఇట్లావుండంగా నవాబు గారు షికారుకు పోతూపోతూ పొద్దుపోయిందని రాత్రికి ఆపూరు లోనే ఠికానా వేసినారు. నవాబో గివాబో ఇప్పటికి కావువాని కెవ్వరున్నూ కంటికాగే అట్లు కనబడలేదు. పైసా ఆడ పెట్టి బావిలోకి దిగూ అన్నాడు నవాబు నౌకరును. నవాబుకు షికాయతు అయింది. నవాబు గారిట్లా తమలోనే అనుకున్నారు: "మాదివాన్జీ మాఖజానా భర్తీచేసేదానికి ఈ హుకుం

ఇచ్చినాడేమో పట్నంపోయిన తర్వాత విచారించుతాను. ఇప్పుడు మాత్రం నేనున్నూ ఖానూనుకు బద్ధున్నై ఉండాల్సిందే'' అని ఆలోచించుకొని తానున్నూ నీటి సుంకం చెల్లించుకొన్నాడు.

ఈపాటికి మ(రిమాన్ పరిగణాలో రెండంతస్తుల బంగ్లా పెరిగింది. గ్రామంలో సగం భూములు కాపువానివే. 100 ఎద్దుల సేద్యం సాగించి నాడు. చుట్టూ 5 ఆమడ దూరం అప్పులిచ్చినాడు. నవాబుగారు తమ



నగరానికి వేంచేసిన తర్వాత దివాన్జీని పిలిచి "దివాన్ సాబ్, మీరెందుకు నీటికి సుంకం ఏర్పాటు చేసినారు? ఇది అన్యాయము కాదా?'' అని విచారించినాడు. అందుకు దీవానుగారిట్లు మనవి చేసుకొన్నారు: "బందగానే ఆలీ, హుజూర్! నేనున్నూ మీతో ఆలాగే గుజారిష్ (మనవి) చేసుకోవాలె అని వుంటిని. నేనుకూడా సుంకం చెల్లించు కున్నాను. హుజూర్ గారు ఫర్మానె ముబారక్ జారీచేసి వుంటారని నేనున్నూ అనుకు న్నాను.'' "అరే నీవూ హుకూం ఇయ్యలేదు. నేనూ హుకుం ఇయ్యలేదు. మరి ఈ 15 ఏండ్ల నుండి వాడు ఎట్లా వసూలు చేసినాడు? వాన్ని గిరఫ్తారీ (అరెస్టు) చేయించి తక్షణం పట్టి తెప్పించు'' అని నవాబు గారు ఉరిమినారు.

కాపువాడు ఇట్టి ఫర్మానుకొరకై 10 ఏండ్ల నుండి నిరీక్షించుతూనే వున్నాడు. 1000 అష్రఫీలు బంగారు తట్టలో పోసుకొని జర్రీ పనిచేసిన మఖ్మల్ బట్టపైన మూసుకొని కాపువాడు హుజూరి వారికి నజరానా సమర్పించుకొన్నాడు. నజరానా చూచేవరకు నవాబు గారు చల్లబడ్డారు. "క్యారే నీకీయెవ్వర్ నీటి సుంకం హుకుం ఇచ్చినార్? "అన్నారు నవాబ్ గారు. "హుజూర్! గ్యారా కద్దూ బారా కొత్వాల్ హుకుం ఎట్లా ఏర్పడిందో మ(రిమాన్ పరిగణా సుంకం కూడా అట్లే ఏర్పాటైంది'' అన్నాడు కాపు. "ఏమంటున్నావురా? నీవనే దేమిన్నీ అర్థం కాలేదు. సరిగా చెప్పు.''

"నా తప్పులంతా మాఫ్ చేస్తామని సెలవిస్తే అన్ని మనవి చేసుకుంటాను.''

"సరేలే! చెప్పుచూస్తాం.''

కాపువాడు తన కథంతా వర్ణించి వర్ణించి చెప్పుకొన్నాడు. హుజూరు వారు అదేపనిగా నవ్వుతూ సాంతం విని "అరే! నీవు చాలా హుషారు మనిషివి. నీతప్పంతా మాఫ్ ఇక ముందు నీవు మాదేవిడీ రాత్రి గంటలు కొట్టూవుండుము. అదే నీకు శిక్ష'' అని సెలవిచ్చినారు. కాపు వానికి కొన్నాళ్ళవరకు తిక్క లేచినట్లుండింది. ఏమిన్నీ ఆదాయం లేదు. అధికారం లేదు. అడిగేవారు లేరు. రాత్రులంతా నిద్రకాయవలెను. ఒకనాడు నిద్రమబ్బులో రాత్రి 11 గంటలు కొట్టేది మరచిపోయినాడు. 12 గంటలకు లేచి 12 కొట్టినాడు. ఈ చిన్న పొరపాటుకు దేవిడీ అంతా తలక్రిందయ్యింది.

హుజూరు వారు 8 గంటలనుండి గంట కొక బేగం గారి గదికి పొయ్యేవారు. 11 గంటలు కొట్టలేదు. 11 గంటల బేగం వద్దకి హుజూరు పోలేదు. మర్నాడు 11 గంటల బేగంగారు గంటలకాపును పిలిపించి "అరేయ్! నా గంట మరచిపోకుండా కొట్టూ వుండుము. నెలకు 50 రూపాయిలిస్తాను'' అని అన్నది. "చిత్తం, చిత్తం హుజూర్!'' అని కాపు వాడు తత్తరపాటుతో అన్నాడు. "ఈ గంటలలో ఏమోరహస్యం ఉందిరా'' అని కాపువానికి స్ఫురించింది. ఒక నాడు 9 తప్పించినాడు. ఒకనాడు 10 తప్పించి నాడు. ఒకనాడు 12 తప్పించినాడు. ఏ గంట తప్పితే మరునాడే ఆ గంట బేగంగారు కాపువానికి జీతం ఏర్పాటు చేసుకొన్నది. ఈ విధంగా నెలకు 400 రూపాయిల జీతం ఏర్పాటైంది కాపువానికి. కొన్ని యేండ్ల తర్వాత నవాబుగారికీ సంగతి కూడా తెలిసింది. వీడు చాలాకీ వాడు అని మెచ్చుకొని వాడు సుంకం వసూలు చేసిన గ్రామమే వానికి ఇనాముగా ఇచ్చి పంపి వేసినాడు. చూచినారా సొరకాయ మహిమ! సొరకాయ నరుకుట అంటే ఇట్లాంటి కథలు చెప్పేదానికే అంటారు.

**దినమున్నూ పైకం బాగా వసూలు కాబట్టింది. మొదట మొదట దినం 20 రూపాయల వరకు వసూలైంది. క్రమేణ ఆదాయం ఎక్కువైంది. "మ(రిమాన్ పరిగణా సుంకం" చుట్టూ రెండామడవరకు ప్రసిద్ధి అయిపోయింది. ఇట్లా వారాలు, నెలలు, సంవత్సరాలు గడచినవి. ఒక నాడు సుబేదారు దౌరావచ్చి గుడారాలు వేయించినాడు. అతని నౌకరు నీటికి పోతే "పైసా లావ్" అన్నారు జవానులు. వారు ఉత్త కడవలతో వాపసు పోయి "సర్కార్! నల్గురు అరబ్బీ జవానులు పైసా యియ్యంది నీళ్ళు తీసుకోనివ్వరు. అరే సుబేదార్ సర్కారు వారికిరా!**

# స్నేహ మాధురి

లౌకిక, వేదాంత విషయాలు మేళవించి రచించిన గాథ కుచేలోపాఖ్యానం. ఇది ఆంధ్ర మహాభాగవతం దశమ స్కంధంలో ఉంది. బాల్యమిత్రుడైన కుచేలున్ని కృష్ణుడు ఆదరించిన సందర్భం లోనిది. భాగవతం 15 వ శతాబ్ది పూర్వ భాగంలో జీవించిన పోతనామాత్య విరచితం. పోతన వరంగల్లు జిల్లాలోని బమ్మెర గ్రామ వాసి. పోతన పద్య కవిత్వం లోని ప్రాసాద గుణం, పదగుంఫనం, శైలీ నైగనిగ్యం, ఈ నాటికీ నిత్య నూతనం. తెలంగాణ గర్వించదగ్గ ఈ మహాకవి ఒక చిరు ఖండిక ఈ తరం పాఠకుల కోసం..



## బమ్మెర పోతన

మ. కని డాయం జనినంతఁ గృష్ణుఁడు దళత్కంజాక్షుఁ డప్పేదవి
ప్రుని నశ్రాంతదరిద్రపీడితుఁ గృశీభూతాంగు జీర్ణాంబరున్
ఘన తృష్ణాతురచిత్తు హాస్యనిలయున్ ఖండోత్తరీయున్ గుచే
లుని నల్లంతనె చూచి సంభ్రమవిలోలుం డై దిగెన్ దల్పమున్..

క. కరమర్థి నెదురుగాఁ జని
పరిరంభణ మాచరించి బంధు స్నేహ
స్ఫురణన్ దోడ్తెచ్చి సమా
దరమునఁ గూర్చుండఁ బెట్టెఁ దన తల్పమునన్..

తే. అట్లు గూర్చుండఁబెట్టి నెయ్యమునఁ గనక
కలశసలిలంబుచేఁ గాళ్లు గడిగి భక్తిఁ
దజ్జలంబులు దనదు మస్తకమునఁ దాల్చి
లలిత మృగమద ఘనసార మిళితమైన.

తే. మలయజము మేన జొబ్బిల్ల నలఁది యంత
శ్రమము వాయంగఁ దాళవృంతముల విసరి
బంధు రామోద కలిత ధూపంబు లొసగి
మించు మణిదీపముల నివాళించి మఱియు.

ఉ. ఏమితపంబు చేసె నొకొ యీ ధరణీ దివిజోత్తముండు దొల్
బాముస యోగివిస్ఫురదుపాస్యకుఁడై తనరారు నీ జగత్
స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించియున్న వాఁ
డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్.

*చ. తన మృదుతల్పమందు వనితామణి యైన రమాలలామ పొం
దును నెడగాఁ దలంపక యదుప్రవరుం డెదురేఁగి మోదమున్
దనుకఁగఁ గౌఁగిలించి యుచితక్రియలన్ బరితుష్టుఁ జేయుచున్
వినయమునన్ భజించె ధరణీసురుఁ డెంతటి భాగ్యవంతుఁడో.

# పుంభావ సరస్వతి, మధురకవి మామిడిపల్లి సాంబశివశర్మ

**అశేష శేముషితో కవిగా, గాయకునిగా, ఉద్యమకారునిగా ఖ్యాతి పొందిన మామిడిపల్లి సాంబశివశర్మ గురించి దాశరథి అవార్డు గ్రహీత వర్ఝుల శివ కుమార్ వివరిస్తున్నారు. 'తంగేడు' పాఠకుల కోసం ప్రత్యేకంగా ఈ వ్యాసం.**



వర్ఝుల శివకుమార్

దక్షిణ కాశిగా ప్రసిద్ధి గాంచిన పుణ్య క్షేత్రం వేములవాడ. చారిత్రకంగా లేంబాళవాటికగా విఖ్యాతినొందింది. యుగాల నుండి శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంగా భాసమానమై ఉన్నది. కృత యుగం లోనే ఈ క్షేత్రం రాజేశ్వరం అనే పేరుతో ప్రసిద్ధమై ఉన్నది భవిష్యోత్తర పురాణం రాజేశ్వర ఖండంలో "రాజేశ్వరంతు లోకేషు, క్షేత్రానము త్తమోత్తమం /తీర్థం పరంపరం, యం వేద సారమ కల్మషం, ప్రఖ్యాతం త్రిషులోకేశు, రాజేశ్వర మితిస్థిమితం / యత్ర వై ధర్మ కుండాఖ్యం, తత్ర తీర్థం మహాత్తమం" అని ఈ మహా క్షేత్రం యొక్క ప్రఖ్యాతి పేర్కొనబడినది. ఈ క్షేత్రంలో స్వామివారి లింగమూర్తి నవనాథ సిద్ధులచే స్థాపించబడి, నీలోత్పల ఛాయతో భక్తులను కటాక్షించు చున్నది. దీనికి లేములవాడయని మరొక పేరు వ్యవహారములో నున్నది. శాసనాలను బట్టి ఇది ఇది లేంబుల వాటిక అని తెలుస్తోంది. కన్నడ కవులలో ప్రముఖుడగు పంపన మహాకవి విక్రమార్జున విజయాన్ని రచించి వేములవాడ చాళుక్య రాజయిన రెండవ అరికేసరికి అంకిత మిచ్చాడు. కవిజనాశ్రయాన్ని రచించిన వేములవాడ భీమ కవికి, యశస్తిలక చంపు వంటి ప్రసిద్ధ ఆలంకారిక గ్రంధాన్ని రచించిన సోమదేవ సూరి వంటి మహా కవులకు పండితులకు ఈ వేములవాడ క్షేత్రమే దివ్య స్ఫూర్తి స్థలి. సుప్రసిద్ధ కవి, సినీ గీత రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి గారు, మధుర కవిగా కొనియాడబడి, తెలంగాణ సాహిత్య వైతాళికుడుగా ఖ్యాతి వహించిన,మామిడిపల్లి సాంబశివశర్మ గారు ,ప్రసిద్ధ కథా రచయిత సురమౌళి, అభ్యుదయ కవి చొప్పకట్ల చంద్రమౌళి, వంటి మరెందరో ఆధునికులు కూడా ఈ ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం.

కీర్తిశేషులు మధురకవి మామిడిపల్లి సాంబశివశర్మ గారు స్మృతిలో మెదిలిన ప్పుడల్లా వేములవాడ వీధుల్లో పసిమి వన్నెతో, మోకాళ్ల దాకా ధోవతి ఉత్తరీయంతో సంకలో వెదురు దండంతో చేతిలో కాగితాలు కలమున్న సంచితో నిరాడంబరంగా దారి పొడుగునా ఏదో ఒక పద్యానికో లేదా పాటకో ప్రాణం పోసుకుంటూ కదిలిపోతున్న ఒక నిరాడంబర పుంభావ సరస్వతి మనస్సులో మెదులుతాడు.

**మామిడిపల్లి సాంబశివశర్మ జనన విశేషాలు - బాల్యం...**

ఒకప్పటి ఉమ్మడి కరీంనగర్ ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఈ వేములవాడలోనే తెలంగాణ రాష్ట్రంలోని సుప్రసిద్ధ కవి పండితులు మహా విద్వాంసులలో ఒకరైన మధురకవి మామిడిపల్లి సాంబశివశర్మ గారు తేదీ28 జూన్1920 న మృత్యుంజయ శర్మ సత్యమ్మ దంపతులకు ఏకైక సంతానం గా జన్మించినారు. పుట్టిన పదమూడునెలల వయసులోనే తండ్రిని పోగొట్టుకొని తల్లి సత్యమ్మ మరియు మేనమామ మంగళంపల్లి సత్యనారాయణరావు (వడ్లూరు మండలం బెజ్జంకి) గార్ల పెంపకం లో పెరిగినాడు. అందుకే మామిడిపల్లి సాంబకవి తన 'మా దేవర శతకం'లో "పుట్టితి తండ్రి జచ్చె, పదమూడునెలల్కడ ముట్టకుండనే / చెట్టలు ముట్టకుండ మన జేసిరి తల్లియు మేనమామ నన్ / బెట్టిరి నీ కరాబ్జమున నీతిని నేర్పెదో బూతు నేర్పెదో / కట్టడి పంతులయ్య ! స్మరఘుస్మర ! లేములవాడ దేవరా ! అంటాడు. నాలుగవ తరగతి వరకే పాఠశాల విద్యను అభ్యసించి కాలక్రమంలో భగవదనుగ్రహం వల్ల తనకు తానుగా విద్య యందు శ్రద్ధ ఏర్పరచుకొని తెలుగు సంస్కృతం హిందీ ఉర్దూ భాషలలో ప్రావీణ్యతను సంపాదించు కున్నారు.

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు పిన్న వయసులోనే త్రికాండ అమరం, అలంకార శాస్త్రం పురాణేతిహాసాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి సహజ పాండితీ ప్రకర్షతో తన కళాభిజ్ఞతకు మెరుగులు దిద్దుకున్నారు. సంస్కారవశంగా బాల్యంనుండే వారిలోని కళా సాహిత్య కౌశలం దిన దిన ప్రవర్ధమాన మైంది. అనంత ధారణాశక్తితో బహు

ముఖీనమైన ప్రతిభతో సరస కవిత్వాన్ని, శ్రావ్యమైన గాన కౌశలాన్ని, నటనా వైదుష్యాన్ని సొంతం చేసుకున్నారు. ఏ రంగంలోనైనా అతని మూర్తిమత్వం మాటలతో కొలువలేనంతగా ఎదిగింది.

**విభిన్న సాహిత్య సాంస్కృతిక ప్రక్రియలతో అనుబంధం...**

1940-50 లలో తెలంగాణ ప్రాంతంలో ప్రజలు రోజువారీ పనులనుంచి కాస్త సేద తీరడానికి హరికథలు నాటకాలు బుర్రకథలే ఆధారం. వారిని ఆనందింపజేయడానికి సాంస్కృతిక కళా రూపాలలో బుర్రకథ కున్న వైశిష్ట్యాన్ని గుర్తించి, శర్మగారు ఆనాటి సమాజంలో ఆసక్తికరమైన పౌరాణిక జానపద కథాంశాలతో దక్షయజ్ఞం, ముగ్గురు మరాఠీలు వంటి బుర్ర కథలను రచించి ప్రదర్శిస్తూ ఆ కథల మాధ్యమంగా ప్రజలలో జాతీయతా భావాలను ప్రోది చేసేవారు . కథా కథన వైచిత్రితో ఆ బుర్రకథలు వందలాది ప్రదర్శనలుగా ఆకట్టుకున్నాయి. తర్వాతి కాలంలో ఆయన రచించిన ముగ్గురు మరాఠీలు బుర్రకథను 16/7/ 1953 నుండి ఆలిండియా రేడియో హైదరాబాద్ లో పలుమార్లు ప్రసారితమైంది.

రంగస్థల నటులుగా, రచయితగా, ప్రయోక్తగా మామిడిపల్లి సాంబశివశర్మ గారు కవి రచయిత మాత్రమే కాక స్వయంగా గొప్ప రంగస్థల నటులు కూడా. వారు రచించిన ప్రదర్శింప చేసిన త్యాగయ్య ,భద్రావతి, నరకాసుర, భక్త ప్రహ్లాద, గయోపాఖ్యానము, భీమ ప్రతిజ్ఞ వంటి మరెన్నో నాటకాలు వందలాదిగా ప్రదర్శితమై సినిమాలు లేని కాలంలో ప్రజలకు వినోదాన్ని విజ్ఞానాన్ని విశేషంగా అందించాయి. శర్మగారి సాహచర్యంలో ఎందరో స్థానిక విద్వాంసులు, మరెందరో పండితులు ఆ నాటకాలలో ముఖ్య పాత్రలను ధరించి అశేష అభిమానాన్ని చూరగొన్నారు. భద్రావతి నాటకం చక్కని రసమయ ధారాశుద్ధి తో ప్రసన్న కథా కల్పనా కలితమైన నాటకంగా జనరంజకమై ఆదరించ బడింది.

**ప్రసిద్ధ హరికథా విద్వాంసులుగా...**

ప్రసిద్ధ హరికథా పితామహులు శ్రీమద జ్జాడ ఆదిభట్ల నారాయణదాసు వలెనే శర్మ గారుకూడా పలు హరికథలను రస రమ్యంగా సంగీతప్రధానంగా రచించినారు. స్వతహాగా వారు ప్రసిద్ధ హరికథా విద్వాంసులు కూడా. వీరు రాజరాజేశ్వర క్షేత్ర మహత్యం హరి కథా రూపంలో రచించి క్షేత్రము యొక్క చారిత్రక పౌరాణిక సంబంధమైన విషయాలు ఎన్నింటినో జగద్విదితం చేశారు. రాగ తాళ యుక్తంగా సంగీత రస ప్రధానంగా, భావ బంధురంగా తాను స్వయంగా రచించి ప్రదర్శించిన కర్ణ ప్రతాపం, భక్త ప్రహ్లాద, వంటి ఎన్నో హరికథలు బహుళ జనాదరణను పొందాయి. నర్మగర్భ వచో వ్యవహారంతో మధురస్వరంతో శ్రావ్యంగా సాగే అతని హరి కథాకథనం అశేష జన వాహినిని ఆకట్టుకునేది. బాహ్య ఆడంబరాలకు దూరంగా ఆయన గడిపిన ఏకాంత జీవితం వల్ల అతన్ని ప్రపంచం పట్టించుకోవలసి నంతగా పట్టించు కోలేదు.

**రచయితల సంఘ అధ్యక్షునిగా...**

మామిడిపల్లి సాంబశివశర్మ గారు బహుముఖ ప్రజ్ఞా దురంధరులు. ఏ మార్గమును అవలంబించినా దాన్ని చివరి దాకా సాధించనిదే వదిలిపెట్టని స్వభావం ఆయనది. వివాహానికి పూర్వం మంచి కవిగా పండితుడిగా నటుడిగా పేరు గడించిన శర్మ గారు కరీంనగర్ జిల్లా రచయితల సంఘానికి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1953 లో ఏర్పడిన తెలంగాణ రచయితల సంఘం లక్ష్యాలను భుజాలకెత్తుకొని కరీంనగర్ జిల్లా విభాగంలో క్రియాశీలక పాత్రను నిర్వహించారు. పలు ప్రాంతాలలో సభలు కవిసమ్మేళనాలు నిర్వహించారు. ఆనాటి కవి పండితులు రేమిళ్ళ సూర్య ప్రకాశ శాస్త్రి, సరి పెల్లి విశ్వనాథశాస్త్రి, ఆచి వేంకట నరసింహాచార్యులు, ఉత్పల సత్యనారాయణాచార్య విశ్వనాథ సత్యనారాయణ వంటి ఎందరో దిగ్దంతులు సాంబ కవి ప్రతిభను ఎంతో శ్లాఘించారు.

**స్వాతంత్ర్య సమర యోధులుగా...**

స్వాతంత్ర పోరాట సమయంలో స్వరాజ్య స్థాపన అవసరాన్ని, సంస్థానాధీశుల పాలనలో సాగుతున్న అణచివేతను గురించి ప్రచారం చేసి జాగృతపరిచారు. స్వామి రామానంద తీర్థ వంటి వారి పిలుపు నందుకుని నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం గురించి పలు ప్రసంగాలు చేశారు. తాను రచించి ప్రదర్శించే బుర్రకథల్లో అంతర్భాగంగా ఆనాటి వర్తమాన స్థితి గతులను ఆర్ద్రంగా వివరించి, ప్రజలను చైతన్యపరిచే వారు.

**మాజీ ప్రధాని, స్వర్గీయ పీవీ నరసింహారావు గారితో అనుబంధం...**

'సాంబశివ శర్మగారు పీవీ నరసింహారావు గారు స్థాపించిన ఆనాటి కాకతీయ పత్రిక కు విలేఖరిగా కూడా పనిచేసి స్వాతంత్ర సమరయోధులు గా తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారు. పలు సభలు సమావేశాలలో స్వర్గీయ పి.వి. నరసింహారావు గారు సాంబ కవి రచనా వైశిష్ట్యాన్ని, దీక్షను, అనుపమాన ప్రసంగ ప్రతిభను, గాన కౌశలాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు .శర్మ గారు పివి గారి అసమాన దీక్షా దక్షతల గురించి ఒక సభలో

"వంగర రంగరాయ నికి వాసిగ సత్యవతీమతల్లియం / దంగజ సౌకుమార్య దరహాస లసన్ముఖుడు ధృవించె నుప్పొంగె త్రిలింగ మాంధ్రము ప్రమోదదమునందె, / విదేశ దాస్యము - క్రింగను ఛాయలేర్పడెను ధీజనముల్ తలలెత్తి రత్తరిన్.

గడచెన్ శైశవమాట పాటల సనెం
కౌమారమారీతియే
నడచెన్ జవ్వనమందు కొన్ని దినముల్
నానా కళా భిజ్ఞతన్
గడియింపన్ పర దాస్య
బంధనములన్ ఖండింప పంతమ్ముతో
నడుముంగట్టి కలమ్మువట్టి
యడుగున్ సాగించె మున్ముందుకున్..
కాకతీయ పత్రికను సంకలన జేసి
నడిపి నూత్న చైతన్యమ్ము నిడె జనులకు
ఢిల్లీ పీఠమ్ము దిగెరల్ల తెల్లదొరలు
వచ్చి చేరె స్వరాజ్యమ్ము వసుధ వొగడ.

ఎనిమిది మూర్తులన్ వెలయు నిందువతంసుని ప్రేమ దృష్టిచే ఎనిమిది భాషలన్ దెలిసి ఎల్లర నాత్మ సరస్వతీ ప్రచోదనమున స్థిలన్ సలిపి తన్నెదిరించిన వారితో జయంబు గాంచిన రక్షడ పీవి నృసింహరాయుడా." అంటూ తన పద్య రచనతో కీర్తించారు.

**వేములవాడ దేవస్థానం ఆస్థాన కవిగా...**

ఆ తర్వాతి కాలంలో శర్మ గారి పైనున్న సాహిత్య గౌరవం తో,1964 లో అప్పటి దేవాదాయ శాఖా మంత్రిగా ఉన్న స్వర్గీయ పీ.వీ నరసింహారావుగారు , సాంబశివశర్మ గారు అవిశ్రాంతంగా కొనసాగిస్తున్నసాహిత్య కృషిని , అసంఖ్యాక భక్తి సంకీర్తనల సృజననూ, పలు క్షేత్రాల సుప్రభాత రచనలను, భగవత్ సాహిత్య దృష్టి పట్ల వారికున్న తాదాత్మ్య భావాన్ని గుర్తించి , ఆయనను వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆస్థానకవిగా నియమించినారు. వారి కుటుంబ నిత్య పోషణా బాధ్యతలను ఆలయ నిర్వాహకులకు అప్పగించారు . స్వాతంత్రోద్యమ సమయంలో భారత మాత భాగ్య విభవాన్ని కీర్తిస్తూ తాను రచించిన రాజేశ్వర సుప్రభాతంలో తొలి స్తుతిగా

"యస్యామూర్ధ్ని హిమాల యస్య శిఖర శ్చంచత్కిరీటాయతే /యస్యాశ్రోణితే సరిత్సము దయాస్స్వర్ణ వాసాయతే / యస్యావక్షతి పుష్పితక్షితిజరా జిస్తారహారాయతే/ సాపాయాద్భర తాంబికా నిజజన స్వారాజ్య లక్ష్మీపదం / అంటూ సహజ సంపదల తో అలరారే ఆ భారతమాతకు లక్ష్మీప్రదమైన స్వరాజ్యం చేకూరాలని తన మనోభీష్టాన్ని నివేదించాడు..

"దేవునిమీద భక్తి యును తెల్వి యు తాల్మియు ధైర్య సాహసా /ల్పావనమైన నర్తనము భావ విశుద్ధి ప్రజాహితంబు సం / జీవ రసార్ద్ర సూక్తులు విశృంఖల నిశ్చల సత్య దీక్షయున్ కావలె భారతీయునకు" అంటూ ప్రబోధించాడు.

సమాజంలోని అసమానతలను చూసి తల్లడిల్లి " బాపురే భారత వాస సౌఖ్యమిదియా బొంపెది బల్వేదకున్" అంటూ తన పద్య రచన లో వ్యథ చెందాడు. ఆయన రచనల్లో భగవద్భక్తికి, ఎంత ప్రాధాన్యం ఇచ్చారో దేశభక్తి కూడా అంతే గౌరవాన్ని ఇచ్చారు. సమాజంలో కనిపించిన అవకతవకలను నిర్మొహ మాటంగా కుండ బద్దలు కొట్టినట్లు చెప్పటం ఆయన నైజం.సహజంగా ఆయన వాక్కులో ఉన్నవ్యంగ్యశక్తి అక్రమార్కులకు వెన్నులో వణుకుపుట్టించేది . ఇజాలకు అతీతమైన నిజాలను ఎండగట్టే ఆయన స్వభావం కుటిల రాజకీయాలకు మింగుడుపడలేదు. కాబట్టే అతని జీవితం కడు పేదరికంలో నడిచింది , ఎంతో అనాదరణ కు అవమానాలకు కూడా గురైంది . సమాజ విమర్శను ఎంత పదునైన వాక్యాలలో చెప్పేవారో అంతే తాదాత్మ్యతతో రాజరాజేశ్వర స్వామి వారి , సత్యనారాయణ స్వామి వారి, జగన్మాత స్తుతులను రస



రమ్యంగా రాగయుక్తంగా కూర్చి పాడేవారు కూడా.

**1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో...**

తొలి దశ తెలంగాణ ఉద్యమంలో యువకులను విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రత్యేకంగా ఆయన రచించి గానంచేసిన "ప్రత్యేక తెలంగాణా పరిపాలన కావాలోయ్, / ప్రజలను పట్టించుకోని పరపాలన తొలగాలోయ్, వివక్షతల వికారాలు ఇక దూరం కావాలోయ్"/ అంటూ సాగే ఈ గీతం వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేటలలో జరిగిన ఉద్యమ సదస్సులలో మార్మోగింది.

"అదిగో మోగినదాంధ్ర వీణ, కపట వ్యాపార పారీణతా/భ్యుదయంబున్ నిజతంతునాళముల నుద్బోధించె నాంధ్రీయతా /నదముప్పొంగె నశాంతిహింస కలహోన్మాదం బు రేకెత్తె మి/న్నదరన్ లోకము కంటనీర్విడిచె" అంటూ ఆ కాలపు అసహనాన్ని వ్యక్తీకరించాడు. తాను కలలుగంటున్న తెలంగాణ ఎలా ఉండాలో చెబుతూ

"మా తెలంగాణ మందు గల మానవు లెల్లరు నీతిమంతులై / పూత చరిత్రులై పలికి బొంకనివారై ధర్మబద్ధులై/ఖ్యాతిగలారలై పరుల కష్టములన్నిటి దీర్చువారలై/ భూత హితాత్ములై భువన పూజితులై విలసిల్ల గావలెన్" అని ఆశంసిస్తాడు.

**సంస్కృతాంధ్ర భాషలలో అవధానిగా...**

అసాధారణ పటిమ, అనుపమాన ఆశురచనా శక్తి, సమయోచిత ప్రజ్ఞ, విస్తృత అధ్యయనశీలత, శ్రావ్య కంఠ స్వరం ముప్పిరిగొన్న విశేషాలు గా మామిడిపల్లి సాంబ శివ శర్మ గారి అవధానాలు పండిత ప్రకాండులను, రసజ్ఞ శ్రోతల ను విశేషంగా ఆకట్టు కునేవి. ఆయన సహజ హాస్యప్రియుడు కాబట్టి అవధానము ఆద్యంతము నవ్వులతో నిండిపోయేది. చమత్కార భాషణము ఆయన భూషణం.

కీర్తిశేషులు గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మ, ప్రస్తుత కాలంలో అష్టావధాని తిగుళ్ల శ్రీహరి శర్మ, అష్టకాలు నరసింహ రామ శర్మ వంటి ప్రసిద్ద అవధానులచే, గణపతి రామచంద్ర రావు, పారు వెళ్ళ గోపాలకృష్ణ, నల్లగొండ పురుషోత్తమ శర్మ వంటి పండితులచే శ్లాఘింపబడి పలు సభలలో అవధాన ప్రజ్ఞను చాటినారు. శతాధిక అవధానాలలో పూర్తి చేసిన ద్విభాషా అవధాని తిగుళ్ల శ్రీహరి శర్మ గారు సాంబ కవి అవధానాల ప్రేరణతో రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో అద్భుతంగా అవధానాలు చేస్తూ మన్ననలు పొందుతున్నారు. వారు సాంబ కవి గారిని తనకు అవధాన మార్గదర్శకులుగా

పేర్కొంటూ ఉంటారు. ఎలా అవధాన విశేషాల గురించి ఇంకా వివరించడమంటే అదొక సుదీర్ఘ గ్రంథమే కాగలదు.

**శ్రీ రాజరాజేశ్వర భక్తి పారమ్యత.**

సాంబ కవి తనకు తల్లి తండ్రి గురువు సర్వము ఆ రాజరాజేశ్వర స్వామి అని తలంచి తన రచనలలో ఆ స్వామి పై భక్తిని పరిపూర్ణంగా వ్యక్తం చేశారు "సదా రాజ రాజేశ్వరం పూజయామి/హృదా రాజరాజేశ్వరం భావయామి/ వినా రాజరాజేశ్వరా దన్య దైవం/ నమామి స్వమస్తేన నస్తౌమివాచా" అంటారు. శివుడే తానై తానే శివుడై, ఆ స్వామికి సహచరుడై, దాసుడై తన రచనలలో శివ సాన్నిధ్యాన్ని సామీప్యాన్ని సదా కోరుకుంటూ ఉండేవాడు. ఆయన శివభక్తితో రచించిన అసంఖ్యాక కీర్తనలు, ముక్తాహారం, వేములవాడ దేవర, రాజేశ్వర క్షేత్ర మహత్మ్యం హరికథ, రాజరాజేశ్వర సుప్రభాతం, రాజేశ్వర తారావళి, వంటి మరెన్నో శివ భక్తి పూరిత రచనలే.

> **అసాధారణ పటిమ, అనుపమాన ఆశురచనా శక్తి, సమయోచిత ప్రజ్ఞ, విస్తృత అధ్యయనశీలత, శ్రావ్య కంఠస్వరం ముప్పిరిగొన్న విశేషాలు గా మామిడిపల్లి సాంబ శివ శర్మ గారి అవధానాలు పండిత ప్రకాండులను, రసజ్ఞ శ్రోతల ను విశేషంగా ఆకట్టుకునేవి. ఆయన సహజ హాస్యప్రియుడు కాబట్టి అవధానము ఆద్యంతము నవ్వులతో నిండిపోయేది. చమత్కార భాషణము ఆయన భూషణం.**

**సుప్రభాత రచనలు...**

శ్రీ మామిడిపల్లి సాంబశివశర్మ గారు మధుర కవితాధార తో "లేంబాళవాటిక విభో తవ సుప్రభాతం" అంటూ సాగే శ్రావ్యమైన ఈ సుప్రభాతం ఆకాశవాణి ద్వారా ప్రతి సోమవారం, మరియు వేములవాడ క్షేత్రంలో ప్రతిదినం పఠించబడుతుంది. స్వర్గీయ పీవీ నరసింహారావు గారి కోరిక మేరకు రచించి ఆ ఈశ్వరునికి సమర్పించిన కాళేశ్వర ముక్తేశ్వర సుప్రభాతం, శృంగేరీ జగద్గురువుల ఆదేశానుసారం గంగా సుప్రభాతం, గౌరీ శంకర సుప్రభాతం, కొమురవెల్లి మల్లన్న సుప్రభాతం, రచించారు. ఇంతేకాక ఇతర దేవతలపై భక్తిభావంతో సికింద్రాబాద్ మహంకాళి సుప్రభాతం, బాసర సరస్వతి సుప్రభాతం రచించారు. ఆయన ఒక్క శివ సంబంధి రచనలే కాకుండా ఆది శంకర సుప్రభాతం, బెల్లంపల్లి శ్రీ రామచంద్ర సుప్రభాతం, లక్ష్మీ నృసింహ సుప్రభాతం, మహంకాళి సుప్రభాతం, బాసర సరస్వతి సుప్రభాతం, శ్రీ కృష్ణ భజనలు శ్రీ రామ భజనలు, మంగళ హారతులు మరెన్నో రచించి సమర్పించారు.

**ఇతర కృతులు...**

మధురకవి బిరుదును పొందిన మామిడిపల్లి సాంబశివశర్మ గారు రామదాసు త్యాగరాజు అన్నమయ్య మొదలగు వాగ్గేయ కారుల మార్గంలో సంస్కృతంలో తెలుగులో అసంఖ్యాక కీర్తనలను కర్ణాటక సంగీత రాగాలలో జనబాహుళ్యానికి ఆసక్తిని కలిగించే రాగాలలో గాన యోగ్యంగా రచించి భక్తప్రపంచానికి అందించి ఒక వాగ్గేయ కారుడిగా కూడా గణుతి కెక్కినారు. ఇంకా వారి సృజన వైభవాన్ని చాటుతూ ఖండ కావ్యము, కుంజవిహారము, మధుర ఝంకారము, మాదేవర, లోభ సంహారము మంగళ హారతులు, వంటి మరెన్నో అసంఖ్యాక రచనలు బహుళ జనాదరణను పొందినవి.

సమాజంలోని అస్తవ్యస్త స్థితి పట్ల బాధను,అసహనాన్నే స్వామికి నిరంతరం నివేదించే వాడు . మానవ స్వభావాన్ని లోంగ తీసుకుంటున్న లోభం మీద కొరడా ఝళిపించి, అట్టి లోభ సంహారంకోసమే నడుముకట్టిన కవి ఆయన. ఎన్నిఅభివృద్ధులు జరుగుతున్నా "దండుగయే కాదే చేతికందని ఫలంబు / నిష్ప్రయోజనమే కాదే నిర్జన వని" అంటూ వీటన్నిటికీ కారణమయిన లోభము సమాజంలో ఎక్కడ ఎక్కడ ఉందో రెడ్ హ్యాండెడ్ గా పట్టి చూపించాడు.

ఈ కావ్యంలో కవి "పండినవి సస్యములా / మహా పాతకములా / నిండినవి చెరువులా / అవినీతి తతులా / పెరిగినవి విభవమ్ములా /విప్లవముల / తలచినది విశ్వ హితమా / నిర్దయుల మతమా? అంటూ పదునుగా ప్రశ్నించాడు.

మహాకవి తులసీదాసు ప్రజల భాషలో రాసిన రామచరిత మానస్ గ్రంథాన్ని పండిత రాధేశ్యాం సరళమైన హిందీలోనికి అనువదించగా అట్టి రాధేశ్యాంరామాయణాన్ని గాన యోగ్యమైన మంజరీ ద్విపదలోనికి మామిడిపల్లి సాంబశివశర్మ గారు స్వేచ్ఛానువాదం చేశారు. శర్మ గారు సంపూర్ణంగా అనువదించిన ఈ ద్విపద రామాయణంలో బాలకాండ, సుందర కాండలు మాత్రమే ముద్రితమైనవి. మిగిలిన భాగాల వ్రాత ప్రతులు పూర్తిగా లభించలేదు. అనర్గళంగా సాగిపోతూ అలంకార యుక్తంగా, ఛందోబద్ధంగా, రాగయుక్తంగా రచింపబడిన ఇతని రామాయణాలు పేరెన్నికగన్న రామాయణాల సరసన పేర్కొనదగిన గ్రంథాలుగా నిలబడగలవని చెప్పుట అతిశయోక్తి కాదు. ఆయన రచనలు శబ్దసౌష్ఠవాన్ని, అర్థ గౌరవాన్ని అలంకార వైచిత్రిని, రస స్ఫూర్తిని, వ్యంగ్య వైభవాన్ని, భావ గాంభీర్యాన్ని పొదుగుకొని సాహిత్య ప్రపంచానికి రసానందాన్ని కలిగించే రసవద్ఘంగలుగా మరియు ఆలోచనలను రగిలించే సాక్షర సత్యాలుగా సమాజంలో గౌరవింపబడగలవు. తన అనుపమాన కవితా వైభవంతో శృంగేరి పీఠాధిపతులచే, జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలైన కవిసామ్రాట్ విశ్వనాథ, పద్మశ్రీ డాక్టర్ సి.నారాయణ రెడ్డి గార్లచే ఘనంగా సత్కరించబడినారు.

బతికినంతకాలం స్వస్థానంలో సామాజిక వాతావరణం తగినంత అనుకూలంగా లేకున్నా, ఎన్నో సందర్భాలలో పలు రంగాల్లో మోసాలకు గురి అయినా కళా సాహిత్య సాంస్కృతిక రంగాలలో నటుడిగా కవిగా విద్వాంసుడిగా సఫలుడైనాడు .

చివరి రోజుల్లో ఆర్థికంగా అస్తవ్యస్తమైన స్థితిలో పక్షవాతముతో మంచముపట్టి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 9వ జనవరి 1988 వ తేదీ పుష్య బహుళ పంచమి రోజున స్వర్గస్తులైనారు. సాహితీ సాంస్కృతిక రంగాలకు ప్రేరణా స్రోతమైన ఈ మహా జ్ఞాన వృక్షం మధురకవి స్వర్గీయ మామిడిపల్లి సాంబశివ శర్మ గారి శతజయంతి సంవత్సరం ఇది.

# రవీంద్రనాథ్ ఠాగూర్ - గీతాంజలి



విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'గీతాంజలి: ది సాంగ్ ఆఫరింగ్స్'కి 1913వ సంవత్సరంలో సాహిత్యంలో నోబెల్ పురస్కారం దక్కింది. బెంగాలీ భాషలో రవీంద్రుడు చేసిన ఈ రచన ఆ తర్వాత కాలంలో చాలా ప్రపంచ భాషల్లోకి అనువ దించబడింది. మానవుని కృంగదీసే నిరాశ నిస్పృహలు, సకల సృష్టిని ప్రేమ భావంతో చూసి శ్రమ గొప్పదనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశం. అంతేకాదు నోబెల్ పొందిన తొలి భారతీయుడిగానే కాదు ఆసియాలోనే తొలి వ్యక్తిగా రికార్డులకు ఎక్కారు. ఈ గీతాంజలి 103 కవితా ఖండికల సమాహారం, దీని మాతృక బెంగాలీలో ఉంది. రవీంద్రుడే ఆంగ్లంలోకి అనువాదం చేసాడు.

గీతాంజలిలోకి ఎక్కువ కవితలను కవికి, దేవుడికి మధ్య సంభాషణల రూపంలో రవీంద్రనాథ్ ఠాగూర్ రూపొందించారు. ఆ రోజుల్లో (1900-1913) భక్తి మార్గం బలంగా ఉండేది. అలాంటి సమయంలో ప్రకృతి ఆరాధన ద్వారా దేవుణ్ణి చేరుకోవడానికి మార్గం ఈ కావ్యం ద్వారా చూపించాడు రచయిత. భక్తితో కూడిన దేశప్రేమ మనకు ఈ పద్యాలలో కనిపిస్తుంది. మరోవైపు ప్రకృతి గీతాంజలి కావ్య రచనకు రవీంద్రనాథ్ ఠాగూరుకు ప్రేరణగా నిలిచింది. ప్రేమభావాన్ని, మార్మికతను నింపుకున్న ఆ కవిత్వం చాలా మంది కవులను ప్రభావితం చేసింది.

గీతాంజలిలోని కవితలు, ఆంగ్ల భాషలోకి అనువదించాక, ప్రపంచ దేశాలను ఆకర్షించాయి. గీతాంజలి కవితలు భారతీయ సంస్కృతిని ప్రపంచానికి మరింతగా చేరువ చేశాయి. 'జనులందరిలోను నిన్ను నీవు, నీలో జనులందరినీ దర్శించు కుంటే నీవు ఎవరినీ ద్వేషించవు' అని అర్థం చెప్పే ఒక ఉపనిషత్ శ్లోకంతో కూడిన ఉపన్యాసాన్ని ఠాగూర్ నోబెల్ కమిటీకి పంపారు. సర్వ మానవ సౌభ్రాతృత్వ భావనకు ప్రాణం పోసిన గీతాంజలి ద్వారా, సాహిత్యంలో నోబెల్ బహుమతి సాధించిన తొలి ఆసియా వ్యక్తిగా చరిత్ర పుటల్లో నిలిచారు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్.

**'ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో అక్కడ దేశాన్ని నిలుపు ఎక్కడ జ్ఞానం విరాజిల్లుతుందో అక్కడ దేశాన్ని నిలుపు..'**

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 'గీతాంజలి'లోని ప్రముఖ వాక్యాలివి.

కవిత్వమనే ఎల్లలు లేని హృదయభాషతో ఒక దార్శనికుడిలా నిలబడ్డవాడు రవీంద్రనాథ్ ఠాగూర్.



# అక్కితమ్ అచ్యుతన్ - 'జ్ఞాన్ పీఠ్' గ్రహీత

మనదేశంలో అత్యున్నత సాహితీ పురస్కారం.. జ్ఞాన్‌పీఠ్. దీన్ని ఏటా భారతీయ జ్ఞాన్‌పీఠ్ సంస్థ ప్రదానం చేస్తోంది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో పేర్కొన్న 22 భాషలకు సంబంధించిన సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన వారికి ఈ అవార్డును అందిస్తారు. కేరళకు చెందిన ప్రముఖ సాహితీవేత్త అక్కితమ్ అచ్యుతన్ నంబూద్రి 2019 జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 93 ఏళ్ల మలయాళ కవిత్వంలో ఆధునికతను తీసుకువచ్చిన 'అక్కితం' ను జ్ఞాన్ పీఠ్ అవార్డు వరించింది. జి శంకర కురుప్, ఠాఖాజి, ఎస్కె పొట్టెకట్, ఎంటీ వాసుదేవన్ నాయర్ మరియు ఒఎన్వి కురుప్ తర్వాత ఈ అవార్డును గెలుపొందిన 6 వ మలయాళ రచయిత అక్కితం.

**నేపథ్యం...**

మలయాళ సాహితీవేత్తల్లో ప్రముఖుడైన అక్కితమ్, కుమారనెల్లూర్‌లో 1926, మార్చి 18న జన్మించారు. మలయాళ కవిత్వంలో తనకంటూ గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకున్న అచ్యుతన్... కవిత్వంతో పాటు సాహిత్యం, నాటక రంగం, విమర్శనాత్మక వ్యాసాలు, పిల్లల సాహిత్యం, అనువాదం తదితర రంగాల్లో తనదైన ముద్ర వేశారు. అతని రచనలలో "ఇరుపతం నూట్టండింటె ఇతిహాసం" (20వ శతాబ్దపు గొప్పపురాణం) ఒక మైలురాయి.

అచ్యుతన్ ఇప్పటి వరకు 55 పుస్తకాలు రాశారు. వాటిలో 45 పద్యాలతో కూడిన 'ఖండ కావ్యాలు', 'కథా కావ్యాలు', 'చరిత కావ్యాలు', పాటలు ఉన్నాయి. ఆయన రచించిన వాటిలో 'వీరవదమ్', 'బలిదర్శనమ్', 'నిమిష క్షేత్రమ్', 'అమృత ఖటిక', 'అక్కితమ్ కవితక', 'ఎపిక్ ఆఫ్ ట్వంటీయత్ సెంచరీ', 'అంతిమహాకలమ్' బాగా ప్రాచుర్యం పొందాయి.

అక్కితమ్ కవిత్వం కరుణను ప్రతిబింబిస్తుంది. భారతీయ తాత్విక, నైతిక విలువల ముద్రలు కనిపిస్తాయి. సంప్రదాయ, ఆధునికతకు మధ్య వంతెనలా ఉంటూ.. వేగంగా మారుతున్న సమాజంలోని మానవ భావోద్వేగాలను లోతుగా వివరిస్తాయి. ఆయన రచనలు అనేక భారతీయ, విదేశీ భాషల్లోనూ అనువాదమయ్యాయి.

మలయాళీ సాహిత్యంలో ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2017లో పద్మశ్రీ అవార్డు అందించింది. సాహిత్య అకాడమీ అవార్డు, కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, కబీర్ సమ్మాన్ వంటి పురస్కారాలను అక్కితమ్ అందుకున్నారు.




## GIRL POWER
### INDIAN WOMEN WHO BROKE THE RULES

కలకత్తాకు చెందిన అసిమా ఛటర్జీ గురించి మీకు తెలుసా? 1930లో మలేరియా మరియు మూర్ఛ వంటి వ్యాధులను నయం చేయడానికి వాడే మందులలో ఇప్పటికీ ఉపయోగించే మొక్కలను ఏ సూక్ష్మదర్శిని లేదా శాస్త్రీయ పరికరం లేకుండా కనుగొన్నారు. భారతదేశం మరియు ఇంగ్లాండ్లలో న్యాయశాస్త్రం అభ్యసించిన మొట్టమొదటి మహిళగా అవతరించిన న్యాయవాది కార్నెలియా సోరాబ్జీ గురించి మీరు ఎప్పుడైనా విన్నారా? ఇటువంటి 50 మంది భారతీయ మహిళల విజయాలను, రచయిత నేహా జె హిరానందాని ఈ పుస్తకంలో వివరించారు.

నేహా యొక్క పుస్తకం, వారందరూ తమ విజయ మార్గాన్ని ఎలా ఏర్పరచుకున్నారో వివరిస్తుంది.




## THE INDIA WAY
### STRATEGIES FOR AN UNCERTAIN WORLD

విశ్వ యవనికపై అనేక మార్పులు జరుగుతున్నాయి. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో ప్రపంచం ఎక్కువగా రెండు ధృవాలుగా ఉండి, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తరువాత క్లుప్తంగా ఏక ధ్రువంగా ఉంటే..ప్రస్తుతం బహుళ ధృవాలు ఏర్పడే సంకేతాలు వెలువడుతున్నాయి. చైనా ఇప్పటికే ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ మరియు ప్రధాన సైనిక శక్తి. మారుతున్న కాలంలో భారతదేశ విదేశాంగ విధానం యొక్క దిశ ఏమిటి? అనే అంశంపై భారతదేశ విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ పుస్తకంలో వివరించారు.

ఈ పుస్తకంలో, దేశానికి ఎదురయ్యే సవాళ్లు, లభించే అవకాశాల నుండి, భారతదేశం యొక్క విదేశాంగ విధాన పరిణామ క్రమాలను జై శంకర్ వివరించారు.




## AND WE CAME OUTSIDE AND SAW THE STARS AGAIN

కరోనా మహమ్మారి ప్రపంచమంతటా విస్తరిస్తున్న వేళ, రచయితలు 'పదాల కూర్పు' ద్వారా స్పందించారు. వీటన్నిటినీ ఒకచోట పేర్చారు రచయిత ఇలాన్ స్టవాన్స్. 35 దేశాలకు చెందిన 50 మంది రచయితలు ఈ సంకలనంలో భాగస్వామ్యులయ్యారు. ఈ పుస్తకం 12 భాషలలో అందుబాటులో ఉంది. కరోనా మహమ్మారి ద్వారా ప్రజల్లో కలిగిన అన్ని అంశాలను రచయితలు పరిగణనలోకి తీసుకున్నారు.

నరకపు అంచుల నుండి పయనించి, స్వర్గం యొక్క సుందర దృశ్యాలను ఎలా చూడగలిగారు అనే అంశాలను రచయిత ప్రాతిపదికగా తీసుకున్నారు. వైరస్ యొక్క విస్ఫోటనం మరియు భవిష్యత్తుకు కావాల్సిన రోడ్మ్యాప్ యొక్క అవసరాన్ని కొందరు రచయితలు ఇందులో చర్చించారు.




## NAOROJI (PIONEER OF INDIAN NATIONALISM)

దీన్ యార్ పటేల్ రచించిన NAOROJI - Pioneer of Indian nationalism పుస్తకం, 'గ్రాండ్ ఓల్డ్ మేన్ ఆఫ్ ఇండియా' అందించినట్లుగా, అంతకుముందటి జాతీయవాదుల సహకారాన్ని పునఃసమీక్షించడంలో సమయానుకూలంగా, బోధనాత్మకంగా ఉంటుంది. ఈ పుస్తకం దాదాభాయి నౌరోజీ వ్యవస్థాపక సభ్యుడిగా ఉన్న భారత జాతీయ కాంగ్రెస్( ఐఎన్ సీ) పాత్రపై మరొక వివరణలా కాకుండా.. నౌరోజీ గొప్ప వ్యక్తిగత జీవితం మరియు 19వ శతాబ్దం చివరిలో, 20వ శతాబ్దం ప్రారంభంలో జాతీయవాద ఉద్యమానికి మెరుగులు దిద్దిన అతని సమకాలికుల గురించి తెలియజేస్తుంది.

1920 గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమం తరువాత నుండి 19 వ శతాబ్దం చివరి నాటికి... 'కఠినమైన రాజ్యాంగం, నిరసన, సహనం' అనే నిర్వచనాల నుండి జాతీయవాద రాజకీయాలు ఏవిధంగా ఉద్భవించాయో అర్థం చేసుకోవడానికి అధిక సమాచారం, వివిధ రకాల ప్రస్తావనలతో కూడిన ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగ పడుతుంది.

# పనిపిల్ల

**ధనవంతుల డాబు, దర్పం మధ్య నిట్టూర్చే**
**ఒక పసిదైన పేద బతుకు, పేదవాళ్ల కలలు, వాస్తవ లోకం...**
**రోజూ మన కళ్లముందున్న వేలాది కథలను మనం చూడలేకపోతాం.**
**అలాంటి ఒక కథ, ప్రముఖ కథా రచయిత**
**అయోధ్యా రెడ్డి కలం నుండి...**



డా॥ ఎ.యం. అయోధ్యా రెడ్డి

ఉలికిపడి లేచిందామె. చుక్క తెగి రాలినట్టు. ఎవరో కొరడాతో కొట్టినట్టు. నిజానికి అమెనెవరూ లేపలేదు. అలారమేదీ మోగలేదు. తండ్రి పెద్దగా పెట్టే గురక ఆవేళ వినిపించనే లేదు. పెరట్లోని కోళ్ళగూడులో అప్పుడే కన్ను తెరిచిన కోడిపుంజు ఒకసారైనా కూయలేదు. కొండ మైసమ్మ బురుజు దగ్గరి పెద్ద మసీదు మీది మైకులోంచి మొదటి నమాజ్ చదవనే లేదు. రాత్రంతా మబ్బుల వెనుక తిరిగిన చందమామ అప్పుడే వెళ్లిపోయే యోచన చేస్తున్నాడు. మొగులు భూమిని ముద్దాడే చోట వెలుగురేఖలు చాటుగా పొంచి పొంచి చూస్తున్నయి. ఆ వెలుగుల వెనుకే నెమ్మదిగా కదిలివొచ్చే బాలసూర్యుడు ఇంకా ఒక్క అడుగైనా వెయ్యలేదు. ఆమె నిద్రమబ్బుతో కొద్దిసేపు అట్లాగే చాపమీద కూర్చుంది. అలవాటుగా కళ్లు రెండూ నలుపుకుంది. చిందర వందరైన చింపిరి జుట్టును సవరించుకొని రబ్బరు బాండుతో గట్టిగా బిగించుకుంది. పెద్దగా ఆవలిస్తూ నెమ్మదిగా లేచింది. చాపను చుట్టి నిలువుగా గోడకు ఆనించి నిలబెట్టింది. తమ్ముణ్ణి పక్కలేసుకొని వెళ్ళేకిలా పడుకునివున్న తల్లి ఆదమరిచి నిద్ర పోతున్నది. నులక మంచం మీద తండ్రి తప్పతాగిన మొద్దునిద్రలో ఉన్నాడు. ఆమెకు తల్లిని నిద్రలేపి తను పనికి పోతున్నట్టు చెప్పాలనిపించలేదు. చప్పుడు కాకుండా తలుపు దగ్గరకు వేసి బయటపడింది. గబగబా అడుగులేస్తూ తను పోవాల్సిన కాలనీలోకి అడుగుపెట్టింది. రోడ్ నెంబర్ మూడులో ఉన్న ఇంటికి పోవాలి. అటువైపు నడిచింది. వీధి దీపాలు ఇంకా వెలుగుతున్నయి. మాఘమాసం మధ్యకాలం. చలి గజగజ వొణికిస్తుంది. చీకటి క్రమంగా పల్చనవుతూ, వెలుగు శత్రువును పసిగట్టినట్టు మెల్లగా తప్పుకుంటున్నది. వీధుల్లో ఇంకా జనసంచారం మొదలుకాలేదు. దాదాపు నిర్మానుష్యంగా ఉన్నాయి. అక్కడక్కడ జట్లుగా విడిపోయిన ఊరకుక్కలు గుంపులుగా తమ వర్గ స్పృహను చాటుకుంటూ తిరుగుతున్నాయి. మార్నింగ్ వాక్ కోసం ఇంటి నుంచి బయటికొచ్చిన ఇద్దరు మహిళలు తామెందు కొచ్చిందీ మరిచి ముచ్చట్లు చెప్పుకుంటూ తాపీగా పోతున్నరు. తెల్ల టీషర్టు, గళ్ళ షార్టు వేసుకున్న సీనియర్ సిటిజన్ ఒకరు చెవులకు హియర్ ఫోన్లు తగిలించుకొని పాటలు వింటూ శక్తి కొద్దీ అంగలు వేస్తున్నాడు. రోడ్డు మలుపులో తోపుడు బండి పెట్టుకున్న ఛాయ్ రాములు, రాత్రి మిగిలిపోయిన ఛాయిని మరుగబెట్టి చిన్న ప్లాస్టిక్ గ్లాసుల్లో పోస్తూ తులసి తీర్థంలా అందిస్తున్నాడు. ఆ పక్కనే కొందరు వీధుల్లో దొరికే చిత్తు కాగితాలను పోగుజేసి చలిమంట వేశారు. ఇంకా పనుల్లోకి దిగని సఫాయివాళ్ళు చీపుర్లు పక్కన పెట్టుకొని ముచ్చట్లు చెప్పుకుంటూ చలి కాగుతున్నరు. ఎదురుగా మెరుస్తున్న రెండు చిరుతపులి కళ్ళతో పరుగుతీస్తున్న కారు ఒకటి ఆమె పక్క నుంచి సర్రున దూసుక పోయింది. ఆమె అట్లా నడుచుకుంటూ ఒక పెద్ద బంగళా ముందు ఆగింది. గేటు తీసుకొని లోపలికి వెళ్ళి కాలింగ్ బెల్ కొట్టింది. దూరంగా లోపల ఎక్కడో "ట్రంగ్.. ట్రంగ్" మని చప్పుడు. తర్వాత నిశ్శబ్దం.

బెల్లు మరోసారి.. ఇంకోసారి.. కొంచెం సేపు ఆగి మరోసారి నొక్కింది. ఇది ప్రతి రోజూ జరిగేదే. లోపలి నుంచి ఎవరో పెద్దగా విసుక్కుంటూ వొచ్చి తలుపు తెరిచారు. వచ్చిన వ్యక్తి విసుగును ఆమె ఎంతమాత్రం పట్టించుకోలేదు. వెనుకనుంచి అతని గొణుగుడు కూడా వినిపించుకోలేదు. బిరబిరా లోపలికి పోయింది.

మరో అయిదు నిముషాల తర్వాత ఆమె చేతిలో ఒక చీపురు ప్రత్యక్షమైంది. ఆ రోజుకు ఆమె ఉద్యోగం మొదలైంది. నెమ్మదిగా అడుగులు వేస్తూ.. మధ్య మధ్య ఆగుతూ.. వొంగి వొంగి ఊడుస్తూ, అరగంటలో బంగాళా ఆవరణ అంతా ఊడ్చేసి చెత్త ఎత్తి బయట

పడేసింది. తర్వాత లోపలికి వెళ్ళి వేరే ఇంకో చీపురు పట్టుకుంది. అట్లాగే ఎడమ చేతిలో డస్ట్ పాన్. భవనం లోపల విశాలమైన గదులు. కింద అందమైన ఫ్లోరింగ్. హార్డువుడ్, మార్బుల్ టైల్సు వివిధ డిజైన్లలో పరిచివున్నయి. ఆమె నడుస్తుంటే పాదాల కింద చల్లటి సున్నితమైన స్పర్శ. దువ్వెనతో మృదువుగా తల దువ్వినట్టు మెత్తగా ఊడుస్తుంది. చీపురు ఆమె చేతిలో తనకు అలవాటైన ధనుస్సులా కదులుతుంది. నిత్యం చూస్తున్నదే అయినా ఆ బంగాళా ఆమెకు మరోలోకంలా కనిపిస్తుంది. వెంటనే తమ గుడిసె గుర్తొచ్చింది. ఏమాత్రం పొంతనలేని దృశ్యం. లోపలా, బయటా పొక్కిలైన బరుకు నేల. ఎక్కడికక్కడ పేరుకపోయిన చెత్త. బురద బురదగా వాకిలి. తను ఇల్లుగా భావించుకునే తమ కొంప. ఎంత తేడా..? గురిజంత పోలిక లేదు. అసలు పొంతనే లేదు.

ఈ బంగాళా తనకేమీ కాదు. కనీసం నాలుగు రోజులు ఉండగలిగే చుట్టమో, స్నేహితుల ఇల్లో కాదు. తానిక్కడ పూర్తిగా పరాయి. అపరిచితురాలు. కూలికొచ్చిన పనిమనిషి ఇది నిజం.. ఎప్పటికీ మారని నిజం. ఆమె చీపురు కదిలిస్తున్నది. కాసేపటికి ముందు హాల్లో ఊడ్చటం పూర్తయింది. తర్వాత పిల్లల గదిలోకి పోయింది.

పిల్లలు ఇంకా పడుకొని నిద్రపోతున్నరు. గందరగోళంగా ఉన్నదా గది. నేలమీద అడ్డదిడ్డంగా పడివున్న పుస్తకాలు. పిల్లలు ఆడుకునే ఖరీదైన బొమ్మలు. ఆటవస్తువులు. పెన్నులు.. పెన్సిళ్లు.. రంగురంగుల క్రెయాన్లు. మంచాల మీది నుంచి నేలమీదికి జారిపడిన దుప్పట్లు. ఆమె ఓపిగ్గా అన్నీ సర్దిపెట్టి

పిల్లలు ఇంకా పడుకొని నిద్రపోతున్నరు. గందరగోళంగా ఉన్నదా గది. నేలమీద అడ్డదిడ్డంగా పడివున్న పుస్తకాలు. పిల్లలు ఆడుకునే ఖరీదైన బొమ్మలు. ఆటవస్తువులు. పెన్నులు.. పెన్సిళ్లు.. రంగురంగుల క్రెయాన్లు. మంచాల మీది నుంచి నేలమీదికి జారిపడిన దుప్పట్లు. ఆమె ఓపిగ్గా అన్నీ సర్దిపెట్టి ఊడువసాగింది. ఆమె చదువుకోలేదు. ఏనాడూ బడికి పోలేదు. అక్షరమే దిద్దలేదు. అసలు చదువుకునే అవకాశం ఏరకంగానూ రాలేదు. ఇంట్లో పనులు, బయట ఇండ్లలో పనులతో చిన్నప్పటి నుంచీ బడికి దూరం. స్కూళ్ళు, కాన్వెంట్లు, శుభ్రమైన బట్టలు, పుస్తకాలు, హోంవర్కులు, ఆటలు, పాటలు ఇవన్నీ ఆమెకు అంటరాని పదాలు. ఆమె ఎరుకలో లేనివి. ఆమె పొందలేనివి.

ఊడువసాగింది. ఆమె చదువుకోలేదు. ఏనాడూ బడికి పోలేదు. అక్షరమే దిద్దలేదు. అసలు చదువుకునే అవకాశం ఏరకంగానూ రాలేదు. ఇంట్లో పనులు, బయట ఇండ్లలో పనులతో చిన్నప్పటి నుంచీ బడికి దూరం. స్కూళ్ళు, కాన్వెంట్లు, శుభ్రమైన బట్టలు, పుస్తకాలు, హోంవర్కులు, ఆటలు, పాటలు ఇవన్నీ ఆమెకు అంటరాని పదాలు. ఆమె ఎరుకలో లేనివి. ఆమె పొందలేనివి.

మెత్తటి పరుపుల మీద అడ్డదిడ్డంగా పడుకొని ఆదమరిచి నిద్రపోతున్నారు పిల్లలు. దీనికి పక్కగదిలో పెద్ద మంచం మీద అయ్యగారు పెడుతున్న గురక. స్పాంజీ దిండులో మూడొంతుల ముఖాన్ని దాచేసి గాఢ నిద్రలో ఊపిరాడనట్టు దమ్ము తీస్తున్న అమ్మ గారు. ఆ ఇంట్లో అందరికన్నా ముందు నిద్రలేచేది ఆవిడే. అమ్మ గారు మరికొద్ది సేపట్లో లేవొచ్చు. ఆమె లేస్తూనే కేకలు వేస్తుంది. హడావిడి చేస్తుంది. అందరినీ ఉరుకులు పెట్టిస్తుంది. తనను పరుగెత్తిస్తుంది. తర్వాత ఒక్కొక్కరుగా ఇంట్లో సభ్యులు అందరూ లేస్తారు. ఈలోగా వంటమనిషి వస్తాడు. ఇంట్లో వాళ్ళ అభిరుచుల మేరకు చెప్పిన టిఫిన్లన్నీ తయారుచేస్తాడు. కూరలు వొండుతాడు. తర్వాత పిల్లలు స్కూలుకు రెడీయైపోతారు. స్కూలు బస్సు రాగానే హడావిడిగా వెళ్లిపోతారు. మరికొంతసేపటికి అయ్యగారు, అమ్మ గారు కూడా తయారై పోయి ఆఫీసులకు పోతారు. వాళ్ళు ఎక్కిన కారు, పెద్ద గేటులోంచి రయ్యిమని బయటికి దూసుకెళుతుంది. అంతటితో బంగాళా నిశ్శబ్దమైపోతుంది. ఇంట్లో పనివాళ్ళు ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటారు.

అప్పుడిక బంగాళాలో ఆమెకు చెరువుకు గండి పడినంత స్వేచ్ఛ సొంతమవుతుంది. ఈ పువ్వు నుంచి ఆ పువ్వుకు విచ్చలవిడిగా తిరుగుతూ వాలిపోయే తుమ్మెదకు ఉన్నంత స్వాతంత్ర్యం వొస్తుంది. ఆమెను అడిగేవారు లేరు. అడ్డుకునేవారూ.. గద్దించేవారూ ఉండరు. అప్పుడామె బంగాళా మూలమూలలా తిరుగగలదు. మెత్తటి సోఫాలపైన గెంత గలదు. మంచాల మీద హాయిగా దొర్లగలదు. ముందుహాల్లో కొచ్చి ఏ జంకూ లేకుండా





నేటి కథ

రిమోట్ చేతిలోకి తీసుకోగలదు. టీవీ ఆన్ చేసి తనకు ఇష్టమైన ఛానెల్ పెట్టుకోగలదు. కావాలంటే ఇంట్లో రెండు ముద్దొచ్చే కుక్క పిల్లలున్నాయి. కొంతసేపు వాటితో ఆడుకోగలదు. ఫ్రిజ్ తెరిచి అందులోంచి తనకు ఇష్టమైనవి తీసుకోగలదు. అమ్మగారు పిల్లల కోసం దాచిపెట్టిన పదార్థాలు కొన్ని తినెయ్యగలదు. తిక్కలేస్తే ఏదైనా వస్తువును దొంగలించి తమ గుడిసెకు తీసుకొనిపోయే అవకాశం కూడా ఉంది. కానీ ఆమె అంత ధైర్యం చేయలేదు. అది చాలా ప్రమాదం. వాళ్ళకి తెలిసిపోతుంది. తనను దారుణంగా కొడతారు. చిత్రహింసలు పెడతారు. అందుకే అటువంటి ఆలోచన మనసులోకి కూడా రానీయదు. తనముందు ఇన్ని సౌకర్యాలు ఉన్నా , ఇందులో ఏ ఒక్కటీ తనకోసం కాదని, తనకు చెందినవి కాదని ఆమెకు తెలుసు. ఆ ఇంట్లో గుండుసూది మీద కూడా తనకెలాంటి హక్కులేదు. అసలీ ఇల్లే పూర్తిగా పరాయిది. వీళ్ళెవరూ తనవాళ్ళు కారు. ఇదే కళ్ల ముందున్న అసలు వాస్తవం. కేవలం ఊహల్లో తెలిపోయినంత మాత్రాన ఈ వాస్తవాలు మారిపోవు. గుడిసె జాతకం గుడిసెదే.. బంగాళా దర్పం బంగాళాదే. పుట్టుకతో పుట్టిన పుట్టుమచ్చలు చచ్చేదాక చెరగవు. అమ్మ గారి పిల్లలు అందంగా, ఆరోగ్యంగా వుంటారు. మంచి తిండి తింటరు. ఖరీదైన బట్టలు వేసుకుంటరు. రోజు చక్కగా కాన్వెంట్లకు పోయి ఇంగ్లీషులో చదువు కుంటరు. పెద్ద చదువులు చదివి గొప్ప వాళ్ళు అవుతరు. ఇవేవీ తనకు లేవు. ఎప్పటికీ రావు. ఇంట్లో తినడానికి తిండి దొరుకుడే కష్టం. అందులోనూ మంచి తిండి, మంచి బట్టలు ఊహకు కూడా అందనివి. తనకు బడికి పోవాలని వున్నా పోలేదు. అక్షరాలనే అందుకోలేనిదానికి ఇంక పెద్ద చదువులెక్కడ? అవును.. ఇదే నిజం. మార్చ లేని వాస్తవం. ఈ తేడాలు పూడ్చవు. ఈ రాతలు చెరగవు. వాళ్ళ అమ్మని పిల్లలు ముద్దుగా "మమ్మీ" అని పిలుస్తారు. తానూ పిలుస్తుంది. కానీ మరోకలా "అమ్మ గారూ" అని అంటుంది. మాటలు వేరే కానీ అర్థం అదేగదా. వాళ్ల తండ్రిని "డాడీ" అని అంటారు. అవసరమైనప్పుడు తను "అయ్యగారూ" అని పిలుస్తూ వుంటుంది. ఏదైనా అర్థం ఒక్కటే గదా..! కానీ వాళ్ళె వరు.. తనెవరు? వాళ్ళెక్కడ.. తనెక్కడ? అన్నీ వేర్వేరే. వర్గాలు వేరు, దారులు వేరు, గమ్యాలు వేరు. దగ్గరగా అనిపించినా మధ్యన తరతరాల అగాధం. అందుకే ఊహలెప్పుడూ నిజాలు కావు. ఈ సమాజం దూరపు కొండంత నునుపు.

కానీ మనుషుల నడుమ వ్యత్యాసాలు ఎగుడు దిగుడు బండరాళ్ళు. ఈ దృశ్యం మారదు. మచ్చ మాయదు. ఇది వ్యవస్థ మీది చెరిగిపోని పుట్టుమచ్చ. ఇందుకు కళ్ళెదుట కనబడే మరో సాక్ష్యం ఆమెకు తల్లి జ్ఞాపకమొచ్చింది. . కష్టాలు మోస్తూ నలభై ఏళ్లకే ముసలిదైన ఆకారం. ఇక్కడ అమ్మ గారు ఖరీదైన కారులో ఆఫీసుకు పోతుంది. వంటిమీద నిక్కరు కూడాలేని తమ్ముణ్ణి చంకలో యెత్తుకొని తన తల్లి కూలిపనికి పోతుంది. అమ్మగారు ఆఫీసు నుంచి ఇంటికొచ్చిన తర్వాత హాయిగా విశ్రాంతి తీసుకుంటుంది. సెలవు రోజైతే కుటుంబంతో కలిసి బయటికి పోతారు. సినిమాలు, షికార్లు, హోటల్లో భోజనాలు. తరచుగా ఫంక్షన్లు, పండుగలు, విందులు వినోదాలు.

తన తల్లి కూడా పొద్దంతా చాకిరిచేసి అలిసిపోయి ఇంటి కొస్తుంది.

కానీ వచ్చిన తర్వాత కూడా నిముషం

> **అతడు జీవితమంతా ఎట్లాంటి బరువు బాధ్యతలు లేకుండా బేఫికర్ గా బతికేసిండు. ఇప్పుడిక ఏదైనా అద్భుతం జరిగి బాధ్యతలు తెలిసొచ్చినా అతని వొంట్లో ఓపికలేదు. దాని ఫలితంగానే కూతురు బాల్యాన్ని తొక్కేస్తూ ఇండ్లల్లో పనిపిల్లగా కుదిర్చాడు. అట్లా చీకటిపడే వరకూ ఆమె ఒక యంత్రంగా మారింది. బిడ్డ పనిచేసే ఇండ్లలో అందినకాడికి డబ్బులు ముందే అడిగి తీసుకొని పెళ్ళానికి తెలియకుండా ఖుషీ చేస్తుంటడు.**

విశ్రాంతిగా కూర్చునే అవకాశం లేదు. మళ్ళా ఇంటి పనిలో పడుతుంది. అందరికీ వండి పెడుతుంది. చివరికి తప్పతాగి ఏ రాత్రికో ఇంటికొచ్చే మొగుడి చేతిలో దెబ్బలు తిని ఎప్పటికో నిద్రపోతుంది. ఈ బంగాళాలో ఉండే అయ్యగారు తనకేమీ కారు. ఈ ఇంటికి యజమాని. బయట సమాజంలో పెద్దమనిషి. అమ్మగారికి భర్త. చక్కటి ఇద్దరు పిల్లలకు తండ్రి. వ్యాపారం చేస్తాడు. రెండు చేతులా సంపాదిస్తాడు.

డాబుగా బతుకుతాడు. అక్కడ తన తండ్రి వేరు. పూర్తిగా భిన్నం. వాస్తవానికి అతడు మనిషే కాదు. ఒక్క మంచి గుణమూ, మనిషి లక్షణమూ లేదు. రాత్రి బొండిగె వరకూ తాగింది దిగిపోతే, తెల్లారి ఎప్పటికో నిద్ర

లేస్తాడు. మురికి కాలువల మాదిరి అతని నరాల నిండా మందు ప్రవహిస్తుంటది. అందుకే ఎప్పుడూ మత్తుగా వుంటాడు. ఆ మందు పవరు దిగిపోయిందంటే, అతని వొంట్లో అప్పటివరకూ అణిగిమణిగి వున్న రోగాలన్నీ ఒక్కసారిగా నిద్రలేస్తుంటయి. అస్తమానం దగ్గుతూ, ఆయాసంగా దమ్ము తీస్తూ, వికారంగా ఉమ్ముతూ, బీడీలు కాలుస్తూ.. ఊరికెనే సోమరిగా తిరుగుతుంటాడు. తల్లిని అస్తమానం బండ బూతులు తిడుతడు. ఎక్కడా పనికి పోడు. పెళ్ళాం పొద్దున్నే ఏదయినా వండిపెట్టి పోతే కంచంలో పెట్టుకొని మింగుతడు. జేబులో క్వార్టరు మందుకు సరిపడిన పైసలుంటే గాలిలో ఎగురుకుంటూ పోతాడు. టైము పది గంటలు ఎప్పుడవుతుందా, వైన్ షాపుల సెట్టర్లు ఎప్పుడు ఎత్తుతారా అని ఏ షాపు ముందో నిలబడి ఎదురుచూస్తాడు. పైసలు లేకుంటే పనికి వెళ్ళిన కూతురు జీతం డబ్బులు ఏమైనా తెస్తుందా, పెళ్ళానికి తెలియకుండా లాగేసుకొని పోదామా అని చూస్తుంటడు. తన తండ్రి ఏనాడూ

ఆమె రోజూ గంటలు గంటలు అలిసిపోయేలా చీపురుతో ఊడుస్తుంది. ముఖానికి మట్టిని, మురికిని పూసుకుంటూ వొంగి వొంగి చెత్తనంతా పోగుజేస్తుంది. ఎత్తుకెళ్ళి చెత్త కుండీలో వేస్తుంది. ఇల్లంతా తుడుస్తుంది. టాయిలెట్లు శుభ్రంగా కడిగేస్తుంది. చేతులు అరిగిపోయేలా బోల్లు తోముతుంది. మెరిసిపోయేలా శుభ్రంగా కడిగేస్తుంది. అమ్మగారికి సంతృప్తి కలిగేలా మరింత శుభ్రంగా. బట్టలు ఉతుకుతుంది. శుభ్రంగా ఆరేస్తుంది. ఒక ఇంట్లో పనిమొత్తం పూర్తయితే తర్వాత మరో ఇంటికి. అక్కడి నుంచి ఇంకో ఇంటికి. అన్ని చోట్లా ఊడుస్తుంది ఎంతో శుభ్రంగా. గచ్చులు తుడుస్తుంది మెరిసేలా. అంట్లు తోముతుంది చేతులు నొప్పెడుతున్నా.




పనిచేయడు. గుడిసె నిండా దరిద్రం నిండిపోయి, ఇంకెక్కడా జాగ దొరక్క రోగాలన్నీ కట్టగట్టుకొని అతని ఒంట్లో చేరిపోయినయి. అతడు జీవితమంతా ఎట్లాంటి బరువు బాధ్యతలు లేకుండా బేఫికర్ గా బతికేసిండు. ఇప్పుడిక ఏదైనా అద్భుతం జరిగి బాధ్యతలు తెలిసొచ్చినా అతని వొంట్లో ఓపికలేదు. దాని ఫలితంగానే కూతురు బాల్యాన్ని తొక్కేస్తూ ఇండ్లల్లో పనిపిల్లగా కుదిర్చాడు. అట్లా చీకటిపడే వరకూ ఆమె ఒక యంత్రంగా మారింది. బిడ్డ పనిచేసే ఇండ్లలో అందినకాడికి డబ్బులు ముందే అడిగి తీసుకొని పెళ్ళానికి తెలియకుండా ఖుషీ చేస్తుంటడు. అతడే తన తండ్రి. అదే అసలు వాస్తవం. ఏవేవో ఊహించుకుంటే వాస్తవాలు మారుతయా? ఎట్లా మారుతయి? పెద్దోళ్ళ ఇండ్లల్లో పనిచేయడం పైకి మామూలుగా కనిపించినా అది తెరమరుగున కొనసాగే బానిసత్వం. ఈ బానిసత్వమే చాలాసార్లు ఆమెకు తన కుటుంబం కోసం తాను చేస్తున్న త్యాగమని అనిపిస్తూ ఏకాంచెమో ఊరట కలిగిస్తుంది. పేదరికపు శూన్యమైన ఆకాశంలో కొన్ని సార్లు చిన్న చిన్న ఆశల మెరుపై మెరుస్తుంది. చాలాసార్లు కఠిన కారాగారమై బుగులు రేపుతూ ఉంటుంది. మొత్తం మీద ఆ బానిసత్వమే అందరూ ఆమోదించిన ఒక సామాజిక అవసరంగా రూపు మార్చుకుని యధేచ్ఛగా చెలామణి అవుతూ ఉంటది. కానీ, ఎంత రూపం మార్చుకున్నా, నాడూ.. నేడూ.. ఏనాడైనా బానిసత్వమంటే సాటి మనిషిని బానిసగా చెప్పే పదం. ఎప్పటికీ తన నైజాన్ని పోగొట్టుకోలేని పలుకుబడుల్లో ఒకటి. ఆమె రోజూ గంటలు గంటలు అలిసిపోయేలా చీపురుతో ఊడుస్తుంది. ముఖానికి మట్టిని, మురికిని పూసుకుంటూ వొంగి వొంగి చెత్తనంతా పోగుజేస్తుంది. ఎత్తుకెళ్ళి చెత్త కుండీలో వేస్తుంది. ఇల్లంతా తుడుస్తుంది. టాయిలెట్లు శుభ్రంగా కడిగేస్తుంది. చేతులు అరిగిపోయేలా బోల్లు తోముతుంది. మెరిసిపోయేలా శుభ్రంగా కడిగేస్తుంది. అమ్మగారికి సంతృప్తి కలిగేలా మరింత శుభ్రంగా బట్టలు ఉతుకుతుంది. శుభ్రంగా ఆరేస్తుంది. ఒక ఇంట్లో పనిమొత్తం పూర్తయితే తర్వాత మరో ఇంటికి. అక్కడి నుంచి ఇంకో ఇంటికి. అన్ని చోట్లా ఊడుస్తుంది ఎంతో శుభ్రంగా. గచ్చులు తుడుస్తుంది మెరిసేలా. అంట్లు తోముతుంది చేతులు నొప్పెడుతున్నా.

బట్టలు ఉతుకుతుంది చెమటలు కారిపోతున్నా. కళ్ళు మండుతున్నా. నిప్పులురాలుతున్నా. ఆమె పేరు అంజమ్మ. పన్నెండేళ్ల పనిపిల్ల. వేలవేల కళ్ళతో ప్రతి నిత్యం చూస్తూనే వున్నా కనిపించలేని 'బాల్య' కార్మిక వ్యవస్థలో గడువంటూ లేని నిశ్శబ్ద ప్రవాహం.

క
వి
త

# బొమ్మలు పగిలిపోయాయి



ఆశారాజు

ఇంట్లోంచి బయలుదేరే ముందు
పిల్లలు బొమ్మలకోసం యేడ్చారు
వచ్చేనెలలో చాలా కొందామని
ఎప్పటిలా అబద్ధ మాడాను

దారివెంట లెక్కలు వేసుకొంటూ
తొందర తొందరగాచేరి, షాపు తెరిచాను
యజమానితో సహా
తోటి నౌకర్లు వచ్చే లోగా
లోపలా బయటా
అద్దంలా శుభ్రంచేసి,
అందాలు పరిచాను

మనసంతా అలలు కదలుతుంటే
ఒక్కొక్క బొమ్మను తుడిచి
ప్రతిబింబించే, బాక్సుల్లో అమర్చాను
అటూ ఇటూ ఆతృతగా తిప్పి
వాటిమీద ధరలు చూశాను

ఇన్నాళ్ళు యాంత్రికంగా పనిచేస్తూ
బొమ్మల ఖరీదులను కూడా,
బొమ్మలుగానే చూశాను

ఆలోచనల అలజడిలో
ఆ అంకెలు కొన్ని అర్థంగాక
సాటి మిత్రులను 'రేటు' అడిగాను
వాళ్ళు బదులు చెప్పిన జవాబు బరువుకు,
చందమామ జారి కింద పడిపోయి నట్టు
పసి పసి ఆశలన్నీ, తలమీద పగిలి,
చెల్లాచెదురయ్యాయి

కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే
పిల్లల తీరని కలలను
వేళ్ళతో తుడుచుకొన్నాను
పెద్ద బొమ్మల దుకాణంలో పనిచేసినా
చిన్న బొమ్మ కొనడానికి కూడా
దమ్మిడీ మిగలని సంపాదనని తిట్టుకొన్నాను

# వద్దంటే వాన



అరుణ నారదభట్ల

ఉన్నట్టుండి
ఎవరోతరిమినట్టే పడుతుందీ వాన!

ఈ ఇరుకు సందుల్లో దీనికేం పనో
బండలపై మొక్కలు కూడా
మొలవని మరిచిపోయినట్టుంది
రోజుకో నాలుగు గట్టిచినుకులు చాలిక్కడ
ఈ కాలుష్యపు నేలపై
అలుకుచల్లడమే పెనుతుఫాను!

వర్షమా
నువ్వెందుకు కురుస్తున్నావో గానీ
ఇక్కడిక్కడే కట్టివేయబడుతున్నావ్

అప్పుడబ్బాలాడినట్టు
మ్యాన్ హోల్స్ లో దుంకుతావ్
సందుల్లో తోచకుండా పరుగు తీసి

ఆటోల్లో.... కారుల్లో...
బస్సుల్లోకీ దూరి పోతుంటావ్

నిశ్శబ్దంగా నిద్రిస్తున్న ఇళ్లల్లోకి
అతిథిలా చొరబడి
నీ ప్రేమతో అన్నిటిని అందరినీ
ముంచి పడవలను చేసి ఆడుకుంటావ్

ఇది నీ స్థావరం కాదనితెలిసినా
మళ్ళీ ఇక్కడిక్కడే తిరుగుతున్నావ్
నిన్నని ఏంలాభం....
ఆ వేడి మేఘాలకే చెప్పాలి
మా పల్లెల పొలిమేరల్లో తిరగమని

ఐనా....
నాకు పది చేతులుంటే బాగుండును
ఈ వర్షపు మేఘాలను ఎత్తుకుపోయి
వానలేనిచోట స్వేచ్ఛగా తిరగమని
వదిలేసి వచ్చేదాన్ని!

పిచ్చివాన మురికిలో మునిగిపోతుందిక్కడ
మట్టిలేదని తెలియదనుకుంటా!

మా పల్లెల నేలన్నా రమ్మనదీ వానను
చల్లగ తడిసేందుకు!!

# సామాజిక మాధ్యమాల్లో సామాన్య సాహిత్యం....

**లక్షలాది ప్రజలకు గ్రామీణ జీవితపు మధురిమలను గుర్తుకు చేస్తున్న బతుకమ్మ పాటలు...**

## మైక్ టీవీ బతుకమ్మ పాట 2020




**వీక్షకులు:** 36 లక్షలు
**రచన:** కాసర్ల శ్యాం
**గానం:** కనకవ్వ, లక్ష్మీ

## మంగ్లీ బతుకమ్మ పాట 2020




**వీక్షకులు:** 32 లక్షలు
**రచన:** కాసర్ల శ్యామ్
**గానం:** మంగ్లీ

## జ్యోతక్క బతుకమ్మ పాట 2020




**వీక్షకులు:** 15 లక్షలు
**రచన:** మానుకోట ప్రసాద్
**గానం:** రేలారే గంగ, హనుమంత్ యాదవ్

## తెలంగాణ జాగృతి బతుకమ్మ పాట 2020




**రేపల్లె వాడలోన...**
**వీక్షకులు:** 15 లక్షలు
**సేకరణ:** కోదారి శ్రీను
**గానం:** స్ఫూర్తి, వరం

## 6 టీవీ బతుకమ్మ పాట 2020




**వీక్షకులు:** 10 లక్షలు
**రచన:** సాయి సిరి
**గానం:** నందన్ రాజ్ బొబ్బిలి

## కోలు కోలు బతుకమ్మ పాట




**వీక్షకులు:** 8.2 లక్షలు
**రచన:** భోలే శావలి
**గానం:** కనకవ్వ

## గంగవ్వ బతుకమ్మ పాట 2020




**వీక్షకులు:** 8.2 లక్షలు
**రచన:** రవితేజ గార
**గానం:** వెన్నెల శివపురం, కనకవ్వ,
బేబి సంహిత

## విలేజ్ ఫోక్స్ బతుకమ్మ పాట




**వీక్షకులు:** 8.2 లక్షలు
**రచన:** రవితేజ గార
**గానం:** వెన్నెల శివపురం, కనకవ్వ,
బేబి సంహిత

## తెలంగాణ జాగృతి బతుకమ్మ పాట 2020




**వీక్షకులు:** 7.1 లక్షలు
**రచన:** కోదారి శ్రీను
**గానం:** తేలు విజయ, గజ్వేల్ వేణు

# సాహిత్యప్రేమి, సంస్కరణశీలి... పీవీ



కల్లూరి భాస్కరం

*(గత సంచిక తరువాయి)*

అమ్మనుడిని ఆదరించడం, తెలుగులోనే బోధన జరగడం, పరిపాలనలో తెలుగును అమలు చేయడం, ఇంగ్లీష్ మాటలు లేకుండా తెలుగులోనే మాట్లాడడం లాంటి విషయాలను మనలో చాలామంది ఉద్వేగస్థాయిలో నొక్కి చెబుతూ ఉంటారు. ఆచరణ కోణం నుంచి కూడా వాటిని చూసి ఆలోచించే వారు తక్కువ. పీవీగారి ఆలోచనాశైలిలోని ప్రత్యేకత అదే. తెలుగును బోధనామాధ్యమంగానూ, అధికారభాషగానూ అమలు చేయడానికి అంత కృషి చేసిన ఆయన, వాటిని అంటిపెట్టుకుని వచ్చే సమస్యల గురించీ ఆలోచించారు. ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్నవారికి ఉద్యోగాలలో ఉన్నన్ని విస్తృత అవకాశాలు తెలుగు మాధ్యమంలో చదువుకున్నవారికి ఉంటాయా అన్న సందేహాన్నికూడా ఆయనే లేవనెత్తి దానికి పరిష్కారం కనుగొనాలంటారు. ఆవిధంగా బోధన (instruction), పరిపాలన (administration) లకు ఉద్యోగానియమకాలు (recruitment)ను కూడా ఆయన జోడించారు. ఆచరణ సమస్యలు ఉంటాయి కనుకనే, "భాషావిధానాన్ని ఏవో ఒకటి రెండు రాష్ట్రాలలో మాత్రమే అమలు చేయలేం. జాతీయవిధానం అవసరం. అఖిల భారత స్థాయిలో విధానాన్ని అమలుచేస్తే తప్ప మనం విజయం సాధించలేం" అంటారు ఒక ప్రసంగంలో. బోధన, పరిపాలన, ఉద్యోగ నియామకాలే కాకుండా భాషకు సంబంధించి ఒక స్థాయి, లేదా అంతస్తు (స్టేటస్) అనేది కూడా ఒకటి ఉంటుందని, అది ఉన్నప్పుడు భాషకు తనంత తానే ఒక శక్తి వస్తుందని, తెలుగుకు ఇతర భాషలతో సమానమైన అలాంటి అంతస్తును కల్పించ గలిగినప్పుడు భాషావిధానం అమలులో అది ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుందని ఆయన అంటారు. ఇలా ఆలోచనాశీలితో పోటీ పడే ఆచరణశీలి కూడా కావడం పీవీ ప్రత్యేకతలలో ఒకటి. కోర్టులో డిక్రీ పొందిన తర్వాతే అసలు కష్టాలు మొదలవుతాయనీ, అలాగే విధాననిర్ణయం తీసుకున్న తర్వాతే అమలు ఎలా అన్న అసలు సమస్య మొదలవుతుందనీ, మనలో చాలా మంది దీనికి తలకిందులుగా భావిస్తారని ఆయన అంటారు. కేంద్రంలో మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి కావడానికి ముందే జాతీయవిద్యావిధానం రూపకల్పనలో కీలకపాత్ర పోషించినదీ, ఆ తర్వాత మానవ వనరుల మంత్రిగా నవోదయ పాఠశాలల ఏర్పాటు రూపంలో నాణ్యమైన విద్యను అందుబాటులో తెచ్చినదీ ఆయనే. అంతకుముందు సర్వేల్ పాఠశాలల ఏర్పాటు ఆయన ఆలోచనే. నవోదయపాఠశాలల్లానే ఇవి కూడా పెద్దగా ఆర్థికస్తోమత లేని విద్యార్థులకు భవిష్యజీవితంలో ఉన్నత స్థాయిని అందుకోడానికి తోడ్పడే విద్యను అందించాయి.

**బుద్ధిలో బృహస్పతి**

కాసు బ్రహ్మానందరెడ్డి తన మంత్రివర్గ సహచరుడైన పీవీని బృహస్పతి అని పిలిచేవారట. 'లోపలి మనిషి'లో ముఖ్యమంత్రి చౌదరి, మంత్రి ఆనంద్ ను అలాగే పరిగణించేవాడు. ఆలోచనాశీలి అనే మాటకు ముందు 'మౌలిక' అనే విశేషణాన్ని జోడించుకుంటే తప్ప పీవీ గురించిన చిత్రణ

పూర్తి కాదు. ఆయన ఏ మంత్రిత్వశాఖలో ఉన్నా మౌలిక ఆలోచనలు చేశారు, వాటిని అమలు చేశారు. ఏడు, పది తరగతులు మినహా, మిగతా తరగతుల్లో తప్పనిసరి ఉత్తీర్ణతను(డిటెన్షన్ పద్ధతిని)రద్దు చేసిన సాహసి పీవీగారే నంటారు నాటి ప్రముఖ పత్రికా సంపాదకులు కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం. నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో స్టేట్ మంత్రిగా తనకు జైళ్ల శాఖ అప్పగించినప్పుడు జైలు సంస్కరణలకు ఆయన ఎలాంటి ప్రయత్నాలు చేశారో స్వాతంత్ర్య సమరయోధుడు ఎం. ఎల్. నరసింహారావు రాస్తారు. విదేశాలలో జైళ్ల సంస్కరణ విధానాన్ని పీవీ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఇతర రాష్ట్రాలలోని జైళ్ల పరిస్థితిని, కేంద్రప్రభుత్వ విధానాన్ని బాగా పరిశీలించి రాష్ట్రంలో జైళ్ల సంస్కరణ చర్యలకు పూనుకున్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఆ విషయమై ఒక సదస్సును నిర్వహించారు (ఎందులోనైనా కొత్త ఆలోచనల అమలుకు సంకల్పించినప్పుడు సదస్సులు ఏర్పాటు చేసి, నిపుణుల అభిప్రాయాలను ఆహ్వానించడం పీవీ మొదటినుంచి చివరివరకు అనుసరించిన ప్రజాస్వామిక విధానం). ఆ సదస్సులో వచ్చిన సూచనల ప్రకారం, 1965లో మొదటిసారి అనంతపురం వద్ద ఆరు బయలు జైలును ఏర్పాటు చేశారు. బాల నేరస్థులకు, మహిళా ఖైదీలకు ఎన్నో సౌకర్యాలు కల్పించారు. ఆ తర్వాత వైద్య ఆరోగ్య మంత్రిగా, విడివిడిగా ఉన్న ఆ రెండు శాఖలనూ విలీనం చేశారు. ప్రభుత్వ వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్ ను నిషేధిస్తూ బిల్లు ప్రవేశపెట్టారు.

**రాజకీయాలలో సోషల్ ఇంజనీరింగ్**

రాజకీయరంగంలో పీవీ చేసిన మౌలిక ఆలోచనలు ఇంకో ముఖ్యమైన అధ్యాయం. అంతవరకు పెద్దగా రాజకీయప్రాతినిధ్యం లేని ఆయా సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించి కొత్త సమీకరణలను నిర్మించడం 'సోషల్ ఇంజనీరింగ్' పేరుతో ఇటీవలి కాలంలో ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చింది. రాష్ట్రంలో 1972 ఎన్నికలలోనే ఇలాంటి 'ఇంజనీరింగ్' ను అమలు చేసిన కీర్తి పీవీకి దక్కుతుంది. ఆ ఎన్నికలలో ఆయన



వెనుకబడిన తరగతులకు, మహిళలకు, మైనారిటీలకు ఎక్కువ సీట్లు కేటాయించారు. ఆయన ముఖ్యమంత్రి అయినప్పటినుంచే 'బలహీనవర్గాలు' అనే మాట ప్రాచుర్యంలోకి వచ్చిందంటారు పాత్రికేయకురువృద్ధులు తుర్లపాటి కుటుంబరావు. పీవీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు కూడా, రాష్ట్రంలో అప్పటికి రాజకీయప్రాబల్యం విశేషంగా ఉన్న సామాజికవర్గాలకు అదనంగా మరో సామాజికవర్గాన్ని కూడా బరిలోకి దింపి తద్వారా రాజకీయసమతూకాన్ని తేవడానికి ఆలోచన చేయడం నాకు తెలుసు.

**భూసంస్కరణలపై పేటెంట్**

భారతదేశ చరిత్రలో, రాష్ట్ర చరిత్రలో కొందరు సాంఘిక, మతసంస్కర్తలుగా ప్రసిద్ధులైనట్టుగా రాజకీయ, పరిపాలనా రంగంలో వారితో సమానమైన గుర్తింపును రేపటి తరాలు పీవీగారికి మరింతగా ఇవ్వవచ్చు. ఆయన రాజకీయ, పరిపాలనా జీవితంలో అతిముఖ్య సంస్కరణలుగా రెండు ప్రధానంగా పైకి తేలతాయి. ఒకటి, ముఖ్యమంత్రిగా ఆయన తలపెట్టిన భూసంస్కరణలు రెండు, కేంద్రమంత్రిగా ఆర్థికసంస్కరణలు. నిజం చెప్పాలంటే, దేశం మొత్తం మీద భూసంస్కరణలపై పేటెంట్ పీవీగారిదే. భూపోరాటాలలో ఎంతో అనుభవం ఉన్న కమ్యూనిస్టులు కూడా భూసంస్కరణలపై పీవీగారి మార్గదర్శనం కోరుకున్నారంటే దానిపై ఆయన ఆరాట, అధ్యయనాల లోతు అర్థమవుతుంది. అప్పట్లో కేరళ ముఖ్యమంత్రిగా ఉన్న అచ్యుత మీనన్ కూడా భూసంస్కరణలపై తన సూచనలు, సలహాలు కోరారని పీవీ స్వయంగా నాతో అన్నమాట.

మొదటే చెప్పినట్టు భిన్నతరానికి చెందిన నేను పీవీని సానుకూల దృష్టినుంచి అర్థం చేసుకునే దిశగా బలమైన అడుగులు వేసింది భూమి గురించి, భూసంస్కరణల గురించి 'ఇన్ సైడర్' లో ఆయన రాసినది చదువుతున్నప్పుడే. అంతకన్నా ముందు నన్ను ఆకర్షించిన ఘట్టం ఇంకొకటి ఉంది అది, 'లోపలి మనిషి'లో ఆనంద్ మొదటిసారి మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత, 'అసలు అధికారం ఎందుకు, తన మీద దాని ప్రభావం ఎలా ఉంటుం'దని ప్రశ్నించుకుని ఆత్మ విమర్శ చేసుకోవడం. ఇవి చాలా అవసరమైన, మౌలికమైన ప్రశ్నలు. ఈ ప్రశ్నలు ముందుకు తెచ్చిన మరో రాజకీయ నాయకుణ్ణి నేను అంతవరకు చూడలేదు. శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు, రకరకాల కోరికలతో, విజ్ఞాపనలతో తన దగ్గరికి వచ్చే ఆర్తుల మధ్య గడుపుతున్నకొద్దీ తనొక వ్యక్తినన్న భావననుంచి బయటపడి పూర్తిగా విభిన్నమైన జీవిగా పరివర్తన చెందినట్టు అతనికి (ఆనంద్ కి) అనిపిస్తుంది. తన వ్యక్తిగత అస్తిత్వానికి ఇప్పుడు ప్రాముఖ్యం

లేదనీ, తన ఆనందవిషాదాలు, తన బంధుమిత్రులు, తన ఇష్టాయిష్టాలు అన్నీ అంతకంటె ఎంతో విస్తృతమైన ఆవరణలో లయమైపోయాయనీ, అది విశ్వజనీనమైన మానవాళి అస్తిత్వం మొత్తాన్ని తనలో పొదవుకున్న ఆవరణమనీ ఊహ చేస్తాడు. ఈ అతీతస్థితిలో ప్రజాస్వామ్యపు ఆధ్యాత్మిక రూపాన్ని అతడు దర్శిస్తాడు! శాసనసభ్యుడిగా తనొక లక్షమందికి ప్రాతినిధ్యం వహిస్తే, ఇప్పుడు మంత్రిగా కొన్ని కోట్లమంది ప్రజల శ్రేయస్సుకు బాధ్యత వహించవలసివస్తుందని, ప్రాతినిధ్యం నుంచి బాధ్యతకు పరివర్తన దానికదే పెద్ద మార్పని అనుకుంటాడు. "మంత్రికీ, మామూలు మనిషికీ మధ్య వ్యత్యాసమేమిటి? స్వార్థపరార్థాల క్రమాన్ని తలకిందులు చేయలేనప్పుడు మంత్రి చేతిలో అదనంగా అధికారమనేది ఎందుకుండాలి, అందుకు ఎలాంటి కారణమూ లే"దని ఆనంద్ నిర్ధారణకు వస్తాడు.

అధికారం గురించిన ఈ వివేచనే 'లోపలి మనిషి'లో మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఆనంద్ వ్యవహారణలో అడుగడుగునా ప్రతిఫలిస్తుంది. తీవ్ర ఆక్షేపణలను, విమర్శలను, శత్రుత్వాలను, చివరికి పదవీభద్రతను ఎదురొడ్డి ఆనంద్ భూసంస్కరణల అమలుకు పూనుకునేలా చేసింది. అధికారం గురించి తర్కించుకున్నట్టే భూమి గురించి, భూసంస్కరణల గురించి ఆనంద్ సుదీర్ఘంగా తర్కించుకుంటాడు. సాహిత్యపరంగానూ లోతైన, గాఢమైన అభివ్యక్తిని తెచ్చుకున్న ఘట్టాలలో అది కూడా ఒకటి.

**అతని ఆలోచనలు ఇలా సాగుతాయి**

"భూమి అంటే అధికారం. గ్రామ జీవనంలో అదే సర్వస్వం. గ్రామీణ చైతన్యంలో భూమి సర్వశక్తిమంతం, సర్వవ్యాప్తం, సర్వసాక్షి. భూమి ఎవరూ ఢీకొనలేని సర్వోన్నత శక్తి, ఎవరూ నిరాకరించ లేని మహా సత్యం, ఎవరూ విచ్ఛిన్నం చేయలేని జటిల నిర్మాణం. శతాబ్దాలుగా ఇది మళ్ళీ మళ్ళీ రుజువవుతూనే ఉన్న నిజం.

"భారతదేశంలో భూమికథ హింసతో రక్తపాతంతో, కన్నీటి మరకలతో నిండి అనంతంగా విస్తరించింది. అధికారిక పత్రాలు, ముఖ్యంగా భూమి సమస్య గురించి నిపుణులు రాసిన గ్రంథాలు లోతుగా అధ్యయనం చేసి తెలుసుకున్న ఎన్నో కీలకాంశాలతో ఆనంద్ మెదడు కిక్కిరిసిపోయింది. వాటిలో ఒకటి, పందొమ్మిదో శతాబ్దంలో బ్రిటిష్ పాలకుల ప్రోత్సాహంతో ఒక వ్యవస్థగా ఎదిగిన భూస్వామ్యం పుట్టుకకు సంబంధించినది.... ఆ రోజుల్లో బందిపోటు, రాజు, భూస్వామి వీరందరూ ఒకే వ్యక్తి ధరించే మూడు రూపాలుగా పరిణమించిన ఆశ్చర్యకర సన్నివేశం విశేషంగా చెప్పుకోదగినది....

"భూమి, తన మీద జీవించే ప్రతి ఒకరికీ సొంతం చెట్టు తన మీద గూడు కట్టుకున్న ప్రతి పిట్టకీ సొంతం అలాగే నీరు... అప్రయత్నంగా, అవ్యాజంగా కలిగే సృష్టికర్త చలవతో తనలోకి ఎగిరి దూకుతూ, ఈదుతూ, జారుతూ, పిల్లిమొగ్గలు వేస్తూ స్వేచ్ఛగా సంచరించే ప్రతి చేపపిల్లకీ సొంతం. ప్రతిదీ ప్రతి ఒకరికీ చెందుతుంది. 'చెందడం' అన్నదే సర్వత్రా వ్యాపించిన స్వాభావికస్థితి. అక్కడ ఎటువంటి రికార్డులూ లేవు, రిజిస్ట్రేషన్లు లేవు, ఎవరికీ ప్రత్యేకమైన స్వామ్యం లేదు, ఎవరికీ వ్యక్తిగతమైన హక్కు లేదు. ఇటువంటి అద్భుతమైన సుందరమైన వ్యవస్థనుంచి నేటి వ్యవస్థకు చేరుకోవడంలో అభ్యుదయం అనదగినదేమీ లేదని ఆనంద్ విచారంగా అనుకున్నాడు...

భూమి గురించి ఇలా తలపోస్తున్నప్పుడే ఆనంద్ కు గతించిన తండ్రి గుర్తుకొస్తాడు. అతని ఆలోచనలు తండ్రి అవసానదశవైపు మళ్లుతాయి. 'లోపలి మనిషి'లో ఎంతో ఆర్ద్రతతోపాటు గాంభీర్యాన్ని సంతరించుకున్న విశిష్టఘట్టాలలో ఇది ఒకటి. ఈ చిత్రణలో వెనుకటికాలపు దాంపత్యసరళిని, తండ్రీ-కొడుకుల బంధాన్ని పీవీ అద్భుతంగా చిత్రీకరిస్తారు:

"తన అనారోగ్యం విషమిస్తోందని బహుశా నాన్నకి తెలుసు. కానీ అప్పుడే లా పరీక్షకు కూర్చోబోతున్న తనకు పరీక్షకు వెళ్లలేని పరిస్థితి కలిగించకూడదనుకున్నాడు. పరీక్ష పూర్తి కాగానే ఇంటికి రమ్మని చిన్న ఉత్తరం రాసి ఊరుకున్నాడు. ఆఖరిపరీక్ష కూడా రాసి ఇంటికొచ్చి నాన్న పరిస్థితిని చూసిన మీదట కానీ ఆయన తన క్షేమం కోసం ఎంత ప్రమాదాన్ని స్వీకరించాడో అతనికి అర్థం కాలేదు. గంట గంటకీ పరిస్థితి క్షీణిస్తున్నా అదృష్టవశాత్తూ నాన్న స్పృహలోనే ఉన్నాడు. 'నువ్వు వచ్చావు, చాలా సంతోషం' అన్నాడు భావగర్భితంగా. ..

"నాన్న త్వరత్వరగా మాట్లాడుతున్నాడు. ఆ మాటల్లో కూడా ఆశ్చర్యం గొలిపేంత స్పష్టత ఉట్టిపడుతోంది. తనకు మిగిలిన ఆ కాస్త సమయంలోనే చెప్పదలచుకున్నవన్నీ చెప్పాలన్న తహతహతో కాబోలు, అన్న మాట మళ్ళీ అనకుండా చెప్పుకుంటూ వెడుతున్నాడు. ఆనంద్ ఒక్కసారిగా ఘొల్లుమనేసరికి నాన్న కోపంగా అతనివైపు చూసి కనుబొమలు ముడిచి, క్షీణస్వరంతో అన్నాడు...'చూడు నాయనా, మనకు లక్ష్మి ఏనాడూ లేదు, ఉన్నదల్లా ధైర్యలక్ష్మి మాత్రమే. ఆమెను దూరం చేసుకోకు, లేకపోతే బతకడానికి నీకు మరే ఆధారమూ ఉండదు...'

"ఓ వైపున నాన్న అమ్మను చూసి కంటతడి పెడుతూనే, పెద్దగా శోకాలు పెడుతున్న అమ్మపై అంతిమక్షణాలలో కూడా కేకలు వేయబోవడం ఆనంద్ కు జ్ఞాపకమొచ్చింది. భూదేవంత ఓరిమితో ఆయన సంతానాన్ని కని పెంచి, ఆయన కోపతాపాలను గుర్తెరిగి మసలుకుంటూ పల్లెత్తు మాట అనకుండా నలభై ఏళ్ళు కాపురం చేసిందామె. అందుకు కన్నీళ్లతో కృతజ్ఞతలు చెప్పుకున్నాడు కాబోలు. ఆ కృతజ్ఞతను ఆయన మాటల్లో వ్యక్తం చేయాలనుకోలేదు. అనుభూతి చెందడమే కానీ మాటల్లో వాళ్ళు ఏనాడూ ఏదీ వ్యక్తం చేయరు. వాళ్ళ జీవనసరళి అలాంటిది. ఒకరి మీద ఒకరికి ఎంతో అపేక్ష. కానీ దానిని ఏనాడూ ప్రకటించి ఎరుగరు.

"చివరిసారిగా నాన్న రామనామస్మరణ ప్రారంభించారు, తన చుట్టూ ఉన్నవారిని కూడా రామనామం జపించమని సైగ చేశారు. ఆ పెదవుల మీద ధ్వనించే నామస్మరణ ఒక్కొక్క ఆవృత్తి గడిచిన కొద్దీ క్షీణించి... మరింత క్షీణించి... చివరికి ఆ పెదవులపై నిశ్శబ్దస్పందనగా పరిణమించింది. మెల్లగా... ఇంకా మెల్లగా... ఆ కదలిక కూడా ఆగిపోయింది... అయిపోయింది... అంతా అయిపోయింది...

వ్యాసం

### కుంగదీసిన నెహ్రూ అస్తమయం

తరాల అంతరం ఉన్న పీవీగారితో 'లోపలి మనిషి' అనువాదకుడిగా ఏదో ఒక స్థాయిలో నేను 'కనెక్ట్' కావడం చాలా ముఖ్యం. లేకపోతే అనువాదం కేవలం అనువాదం కోసమే అన్నట్టు చాలా యాంత్రికంగా మారుతుంది. అదృష్టం కొద్దీ అలా 'కనెక్టు' అయ్యే అవకాశం పైన చెప్పుకున్న ఘట్టాల రూపంలో చాలా తొందరగానే వచ్చింది. ఉండి ఉండి తర్వాత కూడా వస్తూనే ఉంది. నెహ్రూ అస్తమయంపై ఆనంద్ తలపోత అలాంటి మరో ఘట్టం. 'లోపలి మనిషి'లోని ఆనంద్ లో పీవీని దర్శించగలిగినప్పుడు, నెహ్రూ ప్రభావవర్షంలో ఆయన నిలువునా ఎలా తడిసిపోయారో ఈ ఘట్టం వెల్లడిస్తుంది. ఆయన మరణవార్త ఆయనలో కలిగించిన దుఃఖోద్వేగపు అభివ్యక్తి కూడా గొప్ప ప్రవాహగుణాన్ని తెచ్చుకుని వరద కడుతుంది. ఆ రోజు మధ్యాహ్నం ఆనంద్ ఒక జాయింట్ సెలెక్ట్ కమిటీ సమావేశంలో ఉన్నప్పుడు ఆ దుర్వార్త తెలుస్తుంది. అరచేతుల మధ్య తల ఉంచుకుని ఆనంద్ చాలాసేపు అలాగే కూర్చుండిపోయాడు. ఎన్నో సంవత్సరాల క్రితం తండ్రి మరణించినప్పుడు కూడా కలగనంత దుఃఖం ఇప్పుడతన్ని ముంచెత్తింది. జవహర్లాల్‌లోని ఆకర్షణీయ పార్శ్వాలు ఒకొటొకటిగా అతని కళ్ళముందు కదిలి పోసాగాయి. గుజరాత్ ప్రాంతంలోని హరిపురాలో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సదస్సుకు వెళ్లినప్పటి తన అనుభవాన్ని పీవీ (ఆనంద్ ముఖతా) చెప్పుకుంటూవచ్చారు. అంత జనసందోహాన్ని తను ఎప్పుడూ చూడలేదు. జనసమ్మర్దంలో చిక్కుకుని ముందుకూ వెళ్లలేకపోయాడు, వెనక్కీ రాలేకపోయాడు. ఊపిరాడక చనిపోతానేమోనని కూడా అనుకున్నాడు. ఆ తోపులాటలో తన ప్రయత్నం లేకుండానే సభాస్థలికి చేరుకున్నాడు. అంతవరకూ కలిగిన అసౌకర్యాన్ని మరచి పోయి అక్కడున్న ఇతర గ్రామీణులల్లానే జాతీయనాయకుల్ని ఒక్కొక్కరినే గుర్తు పట్టడంలో మునిగి పోయాడు... జవహర్లాల్, బోస్, పటేల్, ఆజాద్, పట్టాభి సీతారామయ్య, గఫార్ ఖాన్ (అందరి కంటే ఎత్తుగా).... ముంచెత్తిన భావావేశంతో ఒక్కొక్కసారి



ఆగుతూ, ఒక్కొక్కసారి ఝరీవేగంతో ముందుకు దూకుతూ నిజాయితీ ఉట్టిపడే నెహ్రూ అభిభాషణను మొదటిసారి విన్నాడు. ఆ తర్వాత త్రిపుర ప్లీనరీకి వెళ్లినప్పుడు, పూణేలో ఒక విద్యార్థుల సమావేశానికి వెళ్లినప్పుడు నెహ్రూలోని శీఘ్రకోపాన్ని చూసిన సంగతిని ఎంతో మురిపెంగా ఆనంద్ గుర్తు చేసుకున్నాడు. త్రిపురలో బహిరంగసభలో ఆయన మాట్లాడు తున్నప్పుడు ఒక విమానం పెద్దశబ్దంతో చుట్టూ తిరుగుతూ, శ్రోతల ఏకాగ్రతకు భంగం కలిగించింది. జవహర్లాల్ ఆగ్రహంతో ఊగిపోతూ, ఈ సమీపంలోకి ఏ విమానం రావడానికి వీల్లేదని గట్టిగా కేకపెట్టారు. ఆయన ఆదేశాన్ని పాటించేది ఎవరా అనుకుంటూ ఆనంద్ ఆశ్చర్య పోతుంటే, నిజంగానే ఆ విమానం మళ్ళీ ఆ దరిదాపులకు రాలేదు.

పూణే సమావేశంలో నెహ్రూ సభాస్థలికి రాగానే విద్యార్థులు పండిట్ జీ జిందాబాద్ అంటూ నినాదాలు ప్రారంభించేసరికి నెహ్రూవారిపై కోపంతో విరుచుకుపడ్డారు. యుద్ధంతో ధ్వంసమైన ఒక దేశాన్ని అప్పుడప్పుడే చూసివచ్చిన ఆయనలో ఆ జ్ఞాపకాలు ఇంకా పచ్చి పచ్చిగా ఉన్నాయి. బయటి ప్రపంచంలో ఏ జరుగుతోందో పట్టని బాధ్యతారాహిత్యం విద్యార్థుల ప్రవర్తనలో కనిపించడమే ఆయన కోపానికి కారణం.

మృతప్రాయమైన జాతీయోత్పత్తి అంకెల కంటె, జాతి గౌరవానికే ప్రాముఖ్యం ఇచ్చుకున్న ఆ సందర్భంలో నెహ్రూ అంతర్జాతీయంగా దేశం ప్రతిష్ఠను ఇనుమడింప జేయడం గురించి ఆనంద్ తలపోశాడు. ఒక్కమాటలో చెప్పాలంటే అతని భావనలో జవహర్లాల్ ఒక వినూత్న భావ ప్రపంచానికి రూపకల్పన చేసి అందించాడు! ఒక రంగంలో కాదు, ఆలోచనకీ, ఆచరణకీ సంబంధించిన అనేక రంగాలలో ఆయన దేశానికి మార్గదర్శనం చేశాడు! దేనిని తాకితే దానిని ఉజ్వలింపచేశాడు! అదే సమయంలో, నెహ్రూలేని భారతదేశం భవిష్యత్తు గురించి కలవరపడిన ఆనంద్, గాంధీకి తను వారసుడైనట్టుగా తనకు తగిన వారసుని నెహ్రూ అందించకపోవడాన్ని తప్పు పట్టాడు.

భూసంస్కరణల అమలు నెహ్రూ ఆదేశమే. ఆనంద్ మంత్రిగా, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా భూసంస్కరణలను తలకెత్తుకున్నది కేవలం నెహ్రూ అనుయాయిగానూ, అభిమానిగానే కాదు నక్సల్బరీ ఉద్యమం విసిరిన సవాలుకు జవాబుగా కూడా! 'లోపలి మనిషి'లో నక్సల్ బరీ ఉద్యమం గురించిన పరిచయాన్నీ, దాని గురించి ముఖ్యమంత్రికి, ఆనంద్ కు మధ్య జరిగిన చర్చనూ పీవీగారు ఎంతో విపులంగా, నాటకీయంగా చిత్రించుకుంటూ వెడతారు. ముఖ్యమంత్రి భూసంస్కరణలను వెక్కిరిస్తే ఆనంద్ సమర్థిస్తాడు. నా ఉద్దేశంలో- నక్సల్ బరీ ఉద్యమమూ, దానిని ఎదుర్కోవడానికి మనం ఆచరణలో ఏమైనా చేయగలమా అని, ఆనంద్ ముఖతా పీవీ ప్రశ్నించుకోవడం, భూసంస్కరణల అమలుకు పూనుకోవడమే 752 పేజీల 'లోపలి మనిషి'లో ప్రధాన ఇతివృత్తం. ఆవిధంగా స్వాతంత్రోద్యమ తరాన్ని దాటి పీవీ మా తరం దగ్గరికి వచ్చేశారు, అలా మా తరానికి ఆయనకూ మధ్య ఒక 'మీటింగ్ పాయింట్' ఏర్పడింది.

ఇప్పుడు ఆయన శతజయంతి వేళ, ఈ దేశానికి ఆయన ఏమిచ్చారని ప్రశ్నించుకున్నప్పుడు బహుశా నా ఉద్దేశంలో దానికి జవాబు ఇలా ఉంటుంది: అధికారం దేనికి అనే ప్రశ్నవేసుకుని ఎవరికివారు ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరాన్ని ఆయన ప్రస్ఫుటంగా ముందుకు తెచ్చారు. లోతైన ఆలోచనతో, దార్శనికతతో ఆచరణను ఎలా మేళవించాలో చెప్పారు. రాజకీయ, పరిపాలనా రంగాలను అవసరమైనప్పుడల్లా సంస్కరించుకోవలసిన ఆవశ్యకతను బోధించారు. **(సమాప్తం)**

వ్యాసం

# తెలంగాణ భాష



డా॥ నలిమెల భాస్కర్

*(గత సంచిక తరువాయి)*

తెలంగాణ భాషకు నాద సౌందర్యాన్ని కల్గించడానికి ఈ పూర్ణానుస్వారమే గాక మరొక లక్షణం సైతం వున్నది. అది ద్విత్వాగమనం.

**b) ద్విత్వం:** ఒక హల్లును ద్విరుక్తం పల్కితే ద్విత్వం. అక్క, చెల్లి, మొదలైన మాటల్లో క్క, ల్లి లు ద్విత్వాలు. ఈ ద్విరుక్తాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ కనిపిస్తాయి. ఇది అంతటా వున్న సమాన లక్షణం. కానీ చిత్రం ఏమిటంటే తెలుగు భాష పదాలు కొన్ని తెలంగాణలో అదనంగా ద్విరుక్తం కావటం. ఉదాహరణకు 'మసి' పదం తీసుకోండి.

ఇది తెలంగాణలో 'మస్సి' అవుతున్నది. మసాల, గసగసాలు, అనగల మాట, దయగల తల్లి, ఆత్మ గల చెయ్యి, అనే పదాలూ పదబంధాలూ వరుసగా "మస్సాల, గస్సాలు, అనగల్ల మాట, దయగల్ల తల్లి, ఆత్మ గల్ల చెయ్యి" లుగా మారుతున్నాయి.

కొన్ని హల్లులను నొక్కి చెప్పడం వల్ల ( మస్సి, మస్సాల, గస్సాలులో 'స' ను, మిగిలిన అనగల్ల మాట వంటి పదాల్లో "ల"ను) ఊనికతో పల్కడం వల్ల ఆ పదాలకు శక్తి వస్తున్నది. ఈ ద్విత్వాలు ఉచ్చారంగా విధేయంగా మాత్రమే వచ్చి చేరాయను కోవటం పొరపాటే అవుతుంది. నాదాన్ని కల్గించడానికి వచ్చాయి. లబో దిబో మనడం (లబ్బ లబ్బ మొత్తుకున్నాడు) కాళ్ళు తట తటా తాటించడం (తట్ట తట్ట కాల్లు గొట్టుడు), బరా బరా గోకడం (బర్ర బర్ర గోకుడు), త్వర త్వరగా నడవడం (సర్ర సర్ర నడుసుడు), కిలుక్కున నవ్వడం (కిల్ల కిల్ల నవ్వుడు), కిసుక్కున నవ్వడం (కిస్స కిస్స నవ్వడం), గొర గొరా లాక్కుపోవడం (గొర్ర గొర్ర గుంజుకపోవుడు), తుపుక్కున ఉమియడం (తుప్ప తుప్ప ఊంచుడు), కొఱ్ఱి మీనులు (కొర్ర మట్టలు), మహా వైళం(మా ఎల్లెం), చొరగొట్టడం (సొర్ర గొట్టుడు), విచిత్రం (ఇచ్చంత్రం), అఱ (అర్ర), ఎఱ (ఎర్ర)...ఇట్లా వందలాది ద్విత్వ రూపాల్ని చూడవచ్చు.

పాపాయి కన్నాల్లు కలువ రేకుల్లు/ పాపాయి జుంపాలు పట్ట కచ్చుల్లు/ పాపాయి దంతాల మంచి ముత్యాలు/ పాపాయి చేతుల్లు పొట్ల కాయల్లు అనే పాటలోని కన్నుల్లు, రేకుల్లు, కుచ్చుల్లు, చేతుల్లు, పొట్ల కాయల్లోని చివరి ద్విత్వ లకారం ఎందుకొచ్చింది? పాడుకోవటానికి వీలుగా వచ్చింది. అట్లాగే "మా పాప మామల్లు మత్స్యావతారం/కూర్చున్న బావల్లు కూర్మావతారం/వరసైన బావల్లు వరహావతారం" పాటల్లోని ద్విరుక్త లకారము ఆ బాబతే! అదుగో.. అటువంటి అద్భుత నాదసౌందర్యావకాశ ద్విత్వాగమనం గమనంలోకి తీసుకోవడం లక్షణం.

**c) యతిమైత్రి:** తెలంగాణ భాషకు గొప్ప 'లయ' నూ, 'సంగీతాన్నీ', యోగ్యతనూ కల్గించింది యతిమైత్రి. ఈ యతిని యతి తెలంగాణ భాషకు సంబంధించిన ప్రత్యేక లక్షణం కాదు. ఇది తెలుగు భాషా లక్షణం. కన్నడానికి యతి లేదు. ( కన్నడక్కె యతి యిల్ల- కోణెక్క(ఎద్దు) యతి యిల్ల- అని కన్నడ సామెత) తెలుగు భాషా సహజ స్వభావం అయిన యతి తెలంగాణ భాషలో యిప్పటికీ గొప్పగా నిలిచివుంది.

తెట్టన తెల్లారుడు (భళ్ళున తెల్లవారడం), బెక్కన బెంగటిల్లుడు (బాగా బెంగ పెట్టుకోవడం), పట్టున గుండె పల్గుడు (గుండె పగిలి ఏడ్వడం) చెటాన చెంపదెబ్బ ఏసుడు (లెంపకాయ వేయడం), చెంప చెటిల్లుమని పించుడు (చెంప చెళ్ళు మనిపించడం), జబ్బలు జారేసుడు (మొహం వేళ్ళాడేసుకోవటం), పాలు పల్గుడు (పాలు విరగడం), జరం జారుడు (జ్వరం తగ్గడం), పిటాన పిరం( ధరలు మండిపోవటం), కాట కల్సుడు (దారి తప్పిపోవడం), కటాల్న ఊరంత కదులుడు (ఊరు ఊరంతా కదిలిపోవటం)... యిటువంటి పదబంధాల్లో

వాక్యాల్లో యతి నివాతి వుండి నాదానికి మూలమవుతున్నది. (బ్రాకెట్లలో యిచ్చినవి దాదాపు ఆధునిక ప్రమాణ భాష తాలూకువి). తెలంగాణ మాటల్లో ఎంత అవలీలగా యతి దొర్లుతున్నదో చూడవచ్చును. సామెతలు, జాతియాలు, నుడికారాలు, పాటలు, మాటలు... ఒక్కటేమిటి సమస్త భాషా వ్యవహారం యతితో వుంటుంది. "ఏం చెప్పమంటరు సారూ నా బాధ. ఇగ చెప్పుడు మొదలుపెడితే, కార్జాలు కాలిపోతై- గుండెలు కూలిపోతై". అంటుంటారు బాధితులు. కార్జాలు కాలడంతో , గుండెలు కూలడంలో యతి లేదూ! (యతి మైత్రి). 'పైనొక పలక క్రిందొక పలక/ పలకల నడుమ మెలికల పాము' ఇది. పై దవడా, కింది దవడా మధ్య వున్న నాలుకను వుద్దేశించిన పొడుపు కథ. ఈ "పొడుపు" ఎంత పొదుపుగా వుందో, ఎట్లా యతిమైత్రియుతంగా వుందో తెలంగాణలో చూద్దాం. పలుగు రాల్లల్ల పాము బొర్లాపడుతది. పలుగు రాళ్ళంటే తెల్లని దంతాలు. పాము నాలుక ఎంత చక్కటి ప్రహేళిక యిది! ఈ యతిని తెలంగాణీయులు తిట్లలోనూ మర్చిపోరు (మొకాన మొద్దాలు పెట్ట, చేతులకు జెట్ట పుట్ట, కడుపు కాలిపోను, కాడు గాలి పోను) - అల్లుడు వచ్చాడు, చొక్కా విప్పాడు. బావిలో దూకాడు" అనేది ఆధునిక ప్రమాణ భాషా పొడుపు కథ. తెలంగాణ లో యిది " బట్టలు యిప్పి బాయిల దూకుతడు". ఇంతే! యతిని యతిగా రావడం వింతే!! పదాల సంఖ్య కొంతే!!

**d) పదమధ్య అచ్చులోపం:** అపదాది అచ్చులు అంటే పదం మొదట్లోని అచ్చు కాకుండా పద మధ్యంలోని అచ్చు లోపించడం. ఆ తర్వాత రెండు హల్లులూ కల్సి సంయుక్తాక్షరంగా మారడం. ఇది ఉచ్చారణగా విధేయంగానూ, వేగోచ్చారణ కారణంగానూ కలిగే మార్పు. ఈ లక్షణం తెలుగుభాషలో నన్నయ నుండీ వుంది. తెలంగాణలో యిది ఎక్కువ. సూత్కం (సూతకం), జాత్కం (జాతకం), పాత్కం (పాతకం), దాప్కం (దాపకం), దోప్కం (దోపకం-దోపిడి), ఉన్క (ఉముక, ఉనుక, ఊక), ఎన్క (వెనుక), దన్క (దనుక)... ఇట్లా ఎన్ని వుదాహరణలో చూడవచ్చును. ఈ పదమధ్యా లోపం వల్ల కూడా తెలంగాణ భాషకు నాదమాధుర్యం చేకూరింది. ఈ నాద సౌందర్యాన్ని నిలువునా నింపుకున్న తెలంగాణ పాటలు తెలంగాణ ప్రత్యేకత. అందుకే తెలంగాణ ప్రాంతంలో జానపద గేయాల ఆలాపన ఎక్కువ. తెలంగాణ సాహిత్యంలో దేశి పద్ధతి మిక్కిలి. ఒక గద్దర్, గోరటి, అందెశ్రీ ప్రభృతుల పరంపర, నాద సంభరిత మైన పాటల తామరతంపర పరస్పరాధారితాలు - ఒకదాని కొకటి పరిపూరకాలు.

**2. అర్థవంతమైన భాష...**

తెలుగు భాష అర్థవంతమైనది. తెలుగులోని చాలా పదాలకు వ్యుత్పత్తి చెప్పటం వీలవుతున్నది. సి.పి. బ్రౌన్ కనునది కన్ను అనీ, వినినవి వీనులనీ, చేయునవి చేతులనీ, కదలునవి కాళ్ళు అనీ, కుడిచె అంటే తినే తాగే చేయి అనీ, ఆ చేతికి కాస్త ఎడంగా వున్న చేయి ఎడమ చేయి అనీ, తల మొండెం కాళ్ళూ చేతులకు నడుమభాగంలో వున్నది నడుము అనీ, పెళ్ళి తర్వాత తన తల్లి వంక వారినీ, ఆలి వంక వారినీ అల్లు బాడు అల్లుడు అనీ... యిలా చాలా పదాలకు వ్యుత్పత్తి చెప్పాడు. నిజమే మరి! కోడె ప్రాయంలో వున్న ఆలు కోడలు, వేరు పడదామని పోరు పెట్టే ఆలు ఏరాలు, మే మే అనునది మేక, కావు కావు మనునది కాకి, కూ కూ అని పాడేది కోకిల, పీ పీ అని పలికేది పీక..

ఈ విధంగా చాలా మాటలకు మూలాలు అన్వేషించగలం తెలుగులో, ఈ అర్థవంతమైన మూల పదాలకు తెలంగాణ భాషలో కొరతే లేదు...వెలితే లేదు..కొదవే రాదు. తల కింద మెత్తగా వుండటానికి పెట్టుకునే మెత్త( దిండు), చల్లగా వుండి చల్లదనాన్ని కలిగించే చల్ల(మజ్జిగ) , లోపల బోలుగా వుండే బోలు ప్యాలాలు (మరమరాలు), ఎర్రని రంగంలో వుండి చేపలు పట్టడానికి ఎరగా గాలానికి గుచ్చే ఎర్ర (వానపాము), మేరల మేరకు అంటే హద్దులూ కొలతల ప్రకారం గుడ్డలు కత్తిరించి కుట్టి యిచ్చే మేర (దర్జీ), పంటను వేసిందగ్గర్నించీ ఇల్లు చేరేదాకా కాపలా కాసే కాపు (రైతు), అంగాన్ని అంటే శరీరాన్ని అచ్ఛాదనం చేసే అంగి (చొక్కా), వేసుకునే టపుడూ, తీసివేసేటపుడూ లాగుతూ వేస్తూ తీసే లాగు (పంట్లాము), లోపల గుల్లగా, ఖాళీగా వుండే గుల్ల (గంప), గుండ్రంగా చిన్నగా వుండే గుండీ (బొత్తాము), గోళాకారంలోని గోలి (మాత్ర), పాము పడగ విప్పిన ఆకారంలోని ఆకులు (నిజానికిది కాండం) కల్గిన పాముపడిగె చెట్లు (నాగజెముడు).. యిట్లా వేలాది తెలంగాణ పదాలు అర్థవంతమైనవి. అంటే మూలం చెప్పగల వీలున్నవి. బ్రాకెట్ల లో యిచ్చిన పదాలు దాదాపు ఆధునిక ప్రమాణ భాషలోనివి.పై పదాల స్వరూప స్వభావాల్ని గమనిస్తే తెలంగాణ తెలుగు పదాల్లో ఎంతగా తెలుగుదనం, తెలుగుధనం వుందో కూడా తెలిసివస్తున్నది.

**3. ఆత్మీయతా పరిమళం...**

భాష సంస్కృతీస్ఫోరకం, ఆత్మీయతా ద్యోతకం, ప్రపంచంలోని ప్రతిభాషలోనూ, ఆ భాషా మర్యాదల్లోనూ, సభ్యతా సంస్కారాల లోనూ, భాషా వ్యవహారం లోనూ ఆత్మీయత తప్పనిసరిగా వుంటుంది.

ఈ ఆత్మీయతా ముద్ర కాలం యింతగా మారినా పల్లెటూళ్ళ తెలంగాణ భాష లో ప్రతి మాటలో కన్పిస్తున్నది. సంభాషణలు ముఖ్యంగా సంబోధనల్లో, పిలుపుల్లో యిది మిక్కిలి ప్రస్ఫుటమవుతున్నది. ఉదాహరణకు- "అన్నా ఎటు పోతున్నవే", "అవ్వా మంచిగున్నవా?", "తమ్మీ జర పైలం", "తాతా! ఏం పరాశికావే", "నాయినా, నా మొర ఏ దేవునికి ముడుతదో", "చెల్లే, బావ బతుకమ్మ పండుగకు పంపలేదానే" "మర్దలు పిల్లా, ఈ నడుమల జెర్ర నిగనిగ అయినవు గని". ఇటువంటి మాటతీరు తెలంగాణది. ఏ ప్రాంతం వాళ్ళు ఆ ప్రాంతం వాళ్ళ భాషలో పిలుచుకుంటే తొణకిసలాడే ఆత్మీయతా గంధం వేరు- నెలకొనే ఆప్యాయతా బంధం వేరు. ఒక ప్రాంతం వాళ్ళు మరో ప్రాంతం వాళ్ళ మాటతీరు లో వ్యవహరిస్తే ఆత్మీయతే కాకుండా ఆ ప్రాంత ఆత్మ సైతం లోపిస్తుంది. ఎవరి భాష వారికి తీపి. ఎవరి యాస వారికి గొప్ప. "అన్నా" అనే సంబోధనని తెలంగాణ

లో అన్నయ్యా అన్నారనుకోండి..అంతా అసహజం. చెల్లెను చెల్లీ అన్నా, తాతను తాతయ్యా అన్నా, నాయినను నాన్నా అన్నా, తమ్మీ అనే పిలుపును తమ్ముడూ అన్నా, అవ్వా అనే అందమైన మాటను అమ్మా అన్నా అంతా కృతకం. పైగా అన్న, తమ్మి, చెల్లె, తాత, అవ్వ మొదలైన నుడుల్లో ప్రాచీనత గుడి కట్టుకుని వుంది.

ఇంకా "ఎవని నెత్తురు వానికి కొట్టు కుంటది", "తోడపుట్టిన తోడు దొర్కది", నీ కడుపు సల్లగ వుండ, నీ కడుపున అంబలి పడ", మొదలైన నుడికారాల్లో ఎంత ఆత్మీయత నెలకొన్నదో చెప్పవలసిన పని లేదు.

**4) అందమైన భాష...**

జలుబూ, సర్ది కారణంగా ముక్కులోంచి చీమిడి కారుతుంటే "చీమిడి వచ్చింది" అని వ్యవహరిస్తే రోతగా వుంటుందని తెలంగాణ వాసులు "ముక్కు వచ్చింది" అంటారు. గవద బిల్లల వ్యాధిని "చెంపలు వచ్చినయి" అని అంటారు. గోరుచుట్టును జెట్టరోగం అని పల్కడానికే జంకుతారు. అంత బాధాకరమైన భయంకర వ్యాధి అనే అర్థం లో, కండ్ల కలకను " కండ్లు వచ్చినయి" అని వ్యవ హరిస్తారు. బహిర్భూమికి వెళ్లాడు అనే అర్థం లో చిత్రంగా , తెలంగాణలో అర్థగౌరవంతో "వాడు సుట్టాల మార్గం పోయిండు" అంటారు. ఇంకా "పాకిస్తాన్ కు పోయిండు" అనీ మాట్లాడుతారు. దేహశు ద్ధి చేశారు అంటే "వీపు సాపు చేసింద్రు" అనేస్తారు. ఇంకా "ఈపుల పాపయ్యను లేపింద్రు" అనీ వ్యవహరిస్తారు.

**అచ్చతెనుగుతనం**

తెలుగు భాషలో తత్సమాలు, తద్భవాలు, దేశ్యాలు అన్యదేశ్యాలున్నాయి, గ్రామాలూ వున్నాయి, కొందరు వ్యాకర్తలు అంగీకరించ కున్నా. తత్సమాలు అంటే సంస్కృత ప్రాకృత సమాలు. మరి అచ్చ తెనుగు అంటే? సంస్కృత సమాలు మినహా వున్న ప్రాకృత సమాలు, తద్భవాదులు. తెలంగాణ లో ఈ తెలుగుతనం ఎక్కువ.

తెలంగాణ అనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లోని పల్లెవాసుల పలుకుల్లో ఇది అధికం. తెలంగాణ యిక్కడి లక్ష్యం కనుక ఆ తెలుగుతనం పరిశీలనార్హం. ఆధునిక ప్రమాణ భాషలోని ఆత్మబంధువు తెలంగాణ లో "పానం అసోంటి సుట్టం" గా కనిపిస్తడు. అర్థాకలితో బాధపడుతున్నాడు అంటే "సగం కడ్పుకు తిన్నడు అంటున్నారు తెలంగాణలో. అర్ధరాత్రి తెలంగాణ లో చెరిసగం రాత్రిగా చీకట్లు చిమ్ముతున్నది. ఇంకా నడిజాము రాత్రిగా భయం గొల్పుతున్నది. మీదుమిక్కిలి "దొంగ రాత్రి"గా బెంగ కల్గిస్తున్నది. కేశాకేశీ కచకచా పోట్లాటలు తెలంగాణ లో "శికెల్ శికెల్ పట్టుకోని" కొట్టుకుంటున్నవి. బాల్యం, వృద్ధాప్యాలు, చిన్నతనం, ముసలితనంగా పరివర్తితం అవుతున్నవి. జ్ఞానం తెల్సిన తనంగానూ, అజ్ఞానం తెల్వనితనంగానూ, మిడిమిడి జ్ఞానం తెల్సీ తెల్వని తనంగానూ

మెత్త (దిండు)
ఎర్ర(వానపాము)
గుల్ల (గంప)
అంగి (చొక్క)
చల్ల (మజ్జిగ)
గోలి (మాత్ర)

తెలిసివస్తున్నది తెలంగాణలో.

ఈర్ష్య, ద్వేషం, కండ్లమంటతనం, కన్నెర్రతనం, ఓర్వుమల్లెగునం, ఓర్వలేని తనంగా రూపుదిద్దుకున్నది. అందం సక్క దనం, రామసక్కదనం అయ్యింది చక్కగా. చోరీ దొంగతనంగా మారిపోయింది.

**అన్యభాషా పదాలు...**

ఏ భాషలోనైనా యితర భాషా పదాల చేరిక అనివార్యం అవుతుంది. మన భాషావసర పరిపూర్తి కోసం గానీ, పాలక భాష ప్రభావం చేత గానీ, పాలిత భాషలు పాలక భాషల పదాలే గొప్పవి అనుకొన్న కారణం చేతగానీ, ఆధిపత్య భాషల అధికారం వల్లగానీ... అన్యభాషలు అన్ని భాషల్లోనూ చేరిపోతాయి. తెలంగాణ ప్రత్యేకత ఏమిటంటే అది ద్రావిడ భాష కనుక ఆ భాష పదాలూ, ముస్లిముల పాలన కారణంగా ఉర్దూ మాటలూ, తెలంగాణ భాష అంటే తెలుగు భాషే కాబట్టి తెలుగులోకి చేరిన సంస్కృతం పలుకులూ, ఆధునిక కాలపు ఆంగ్ల పదాలూ..యిట్లా అనేక భాషల మాటలు యిందులో చేరడం. ముఖ్యంగా ఉర్దూ పదాల చేర్పు ఇక్కడి ప్రత్యేకత.

మొత్తమ్మీద తెలుగు భాష లక్షణాలు చాలా వరకు తెలంగాణ తెలుగు లో వున్నాయన్నది సుస్పష్టం. ఈ లక్షణాలు తెలంగాణ భాషలోకి ఎక్కువగా వుండటానికి మరి కారణాలేమిటి? మధ్యయుగాల నుండి సంక్రమించిన రాజకీయార్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు తెలంగాణ నిన్నామొన్నటి వరకూ అనుభవించింది. ఆధునిక లక్షణాలు అంటే ఆధునిక విద్యా సౌకర్యాలు, ముద్రణా యంత్రాలు, పత్రికలు, గ్రంథాలయాలు, గ్రంథమాలలు మొదలైనవి బ్రిటిష్ ఆంధ్రతో పోల్చినపుడు తెలంగాణ లో చాలా ఆలస్యంగా కన్పించాయి. తద్వారా తెలంగాణ సమాజం నిదానంగా మార్పుకి గురి అయింది.

సమాజంలో అంతర్భాగమైన భాష సైతం నెమ్మదిగా కదలబారింది. తెలంగాణ చాలా కాలం వరకూ వెనుకబడిన ప్రాంతం.కాదు, వెనుకపడ వేసిన ప్రదేశం. సాధారణంగా వెనుకబడిన లేదా పడవేసిన సమాజాల్లో ఆచార వ్యవహారాలు, సభ్యతా సంప్రదాయాలు, సంస్కృతీ సాహిత్యాలు, భాషాదులు అంత తొందరగా మార్పుకు లోనుకావన్నది చారిత్రక యథార్థం. ఆదివాసీ సమూహాల్లో మార్పుకు గురి కాని పరిస్థితి మరీ ఎక్కువగా వుంటుంది. భాషా పరిశీలకులకు తెలంగాణ సీమలోని భాష అనేకమైన మాటల మాటున వున్న రహస్యాంశాల్ని అందిస్తుంది.

ఏతావత తెలంగాణ భాష అత్యంత ప్రాచీనమనీ, అది పూర్ణానుస్వారం, యతిమైత్రి, ద్విత్వాగమనం, పద మధ్య అచ్చు లోపాలతో నాదమాధుర్యాన్ని నిలుపుకుందనీ, అర్థవంతమైన భాష అనీ, అందమైన పలుకుతీరు వుంది అనీ, అచ్చ తెలుగుదనం తెలంగాణ భాషకు అదనం అనీ, అన్య భాషా ప్రభావం కూడా ఆ భాషా స్వభావం అనీ..యిట్లా మనం తెలంగాణ భాషకు లక్షణాలు చెప్పుకోవచ్చును.

**(సమాప్తం)**

# ఆల్ ది బెస్ట్ టు రామా చంద్రమౌళి @ కాళోజి అవార్డు 2020






తెలంగాణ ప్రభుత్వం ప్రతిభావంతులైన కవులకు దాశరధి, కాళోజి, అవార్డ్లను ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సంవత్సరం కాళోజి అవార్డు కు ఎన్నికైన కవి రామాచంద్రమౌళి. రామాచంద్రమౌళి శ్రీ కనకయ్య శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులకు 1948 సంవత్సరంలో జన్మించారు.విశేష మేమిటంటే ఆయన ఇంజనీరింగ్ పట్టబద్రుడు.

కవిగా విమర్శకులుగా, నవలాకారులుగా, కథకుడుగా నాటక కర్తగా అనువాదకుడుగా బహుముఖ ప్రజ్ఞశాలి రామాచంద్రమౌళి. ఒక సాహితీ వేత్తగా బహుముఖంగా కొనసాగుతూనే ఇంజనీరింగ్ పాఠ్య పుస్తకాలు రచించారు. అంతర్జాతీయ సాహిత్య సదస్సులలో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో ఆయన పాల్గొన్న సాహిత్య సదస్సు లు అసంఖ్యాకం.

నాజినామన్ సాహిత్య అవార్డ్, అంతర్జాతీయ జీవిత సాఫల్య పురస్కారం, ఆవంత్స సోమసుందర్ కవితా పురస్కారం, గుంటూరు శేషేంద్ర శర్మ కవితా పురస్కారం, లాంటి అవార్డులు ఆయన గెలుచుకొన్న వాటిలో కొన్ని మాత్రమె. బొమ్మరిల్లు, డబ్బు డబ్బు, కులాల కురుక్షేత్రం, గూటిలోని రామ చిలకలు, జేగంటలు మొదలైన సినిమాలకు కథ మాటలు సమకూర్చారు. ఆయన రాసిన ముప్పై రెండు నవలల్లో, శాప గ్రస్తులు చూరు నీళ్ళు, ప్రవాహం, శాంతి వనం, తెలిసి చేసిన తప్పు, అనే నవలలు పెర్కొదగినవి.

వివిధ సంకలనాలలో ప్రచురించబడ్డ ఆయన మూడు వందల నలభయ్ ఆరు కథలలో స్ఫూర్తి ప్రదాతలు, పొగమంచు,




ఒకసారి మరణం, కాలనాళిక లాంటివి పేర్కొనదగినవి. అట్లాగే దీప శిఖ, శిలలు వికసిస్తున్నాయ్, స్మృతి ధార, ఎటు ఆయన ప్రచురించిన కవితా సంపుటులలో కొన్ని. ఆయన విస్తారమైన సాహితీ సేవకు పులకరించిన తెలంగాణా ముఖ్యమంత్రి రామా చంద్రమౌళి కాళోజి అవార్డ్ కు సంపూర్ణంగా అర్హులు అని ప్రశంసించారు. ఆయన లోపలి ఖాళీ అనే కథలో ఆయనే చెప్పినట్టు ఒకవ్యక్తి హృదయం లోపలి మరోవ్యక్తి అత్మీయునిగా ప్రవేశం పొందాలంటే ఆ హృదయం లో నిజమైన ప్రేమ, చోటు ఖాళీ ఉండాలి అంటూ విశ్వ మానవునికి ఉండాల్సిన వైశాల్యత గురించి వాపోతారు. ఇలాంటి వైశాల్యత, కవితా ప్రతిభ ఆయనకు ప్రతిష్టాత్మకమైన కాళోజి అవార్డును తెచ్చి పెట్టింది.

రామాచంద్రమౌళి తనకు కాళోజి అవార్డ్ రావడం ఒకమరపు రాని అనుభూతి అంటారు. ఆయన మరిన్ని సాహితీ శిఖరాలని అధిరోహించాలని కోరుకుంటున్నది తంగేడు.

ఆల్ ది బెస్ట్.



వ్యాసం

# తెలంగాణ ఉద్యమ పాట - సిద్ధాంతీకరణ

**తెలంగాణ ఉద్యమంలో సాహిత్యం పాత్ర మరువలేనిది. అందునా రెక్కలు విచ్చుకున్న పాట ఉద్యమానికి ప్రేరణకర్తగా నిలిచింది. పాట ప్రశస్తిని వివరిస్తున్న కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత వ్యాసం మీకోసం...**



**డా॥ పసునూరి రవీందర్**
కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత

తెలంగాణ నేల మీద మనిషిని బతికిస్తున్న ఆక్సిజన్ పాటే. ఆ పాటే ఉద్యమానికి పోరుశంఖం ఊదుతూ ముందు నడిచింది. స్థానిక ప్రజల పోరాటాలు, ప్రపంచ ఉద్యమ అనుభవాలకు తోడు తెలంగాణ నేలకున్న నేపథ్యం, ప్రజల సాంస్కృతిక జీవన విధానం పోరాటాల పాటకు సజీవతను అందించాయి. తెలంగాణ ప్రజల శ్రమైక జీవనం పాటతో ముడిపడి ఉండడం వల్ల అనివార్యంగా పాట మాత్రమే వారిని ఆకట్టుకోగలిగింది. మౌఖిక సంప్రదాయ కాలం నుండి ఉన్న జానపద కళారూపాలకు పాటే మూలస్తంభంగా నిలిచి ఉండడం మరో కారణమైంది. తొలిదశ తెలంగాణ ఉద్యమానికి (1969) పెద్దగా సాంస్కృతిక పునాది లేదు. విద్యావంతుల నడుమ వంతుల వారి ఉద్యమం నడిచింది. అప్పుడున్న సృజనకారుల్లో కవులే ఎక్కువ మంది. కానీ, పాట శక్తిని గుర్తించి తెలంగాణ రాష్ట్ర కాంక్షను పాటలకు ఎక్కించినవాళ్లు వేళ్లమీదికే పరిమితం. కానీ ఈ పునాదే మలిదశ సమయానికి ఊహించని రీతిలో విస్తరించింది. తెలంగాణలో మాత్రమే కాకుండా తెలుగు సమాజంలో కనీవినీ ఎరుగనంత సాంస్కృతికోద్యమం గడిచిన రెండు దశాబ్దాల కాలంలో పురుడు పోసుకున్నది.

90వ దశకం ఉత్తరార్ధంలో తెలంగాణ జనసభ, తెలంగాణ సాంస్కృతిక వేదిక, తెలంగాణ జాతర, 2000 ల తర్వాత ధూంధాం వేదికలు ఏర్పడడం వల్ల పాట ప్రచారానికి అవకాశాలు ఏర్పడ్డాయి. అలా 90దశకంలో బెల్లి లలిత తెలంగాణ పాటను ప్రచారం చేస్తూ దారుణ హత్యకు గురైంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అనుభవాలను స్వీకరించి, మధ్యలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో మొదలైన నక్సలైట్ మూవ్ మెంట్ లో పాట పోషించిన పాత్రను గుర్తించి తెలంగాణ మలిదశ ఉద్యమం పాటకు కంచుకోటగా మారింది. వందల సంఖ్యలో పాటల సీడీలు, వేల సంఖ్యలో పాటలు, పదుల సంఖ్యలో పాటల సంకలనాలు, సంపుటాలు, ఊరూర ధూంధాం నిర్వహించే లెక్కలేనంత మంది కళాకారుల్ని తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మాత్రమే అందించగలిగింది. కాలానుగుణంగా అందివచ్చిన శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం పాట ప్రచారానికి బలంగా ఉ యోగపడింది. ఇట్లా తెలంగాణ పాట సరికొత్త రికార్డును నెలకొల్పి గత ఉద్యమ పాటలు సాధించిన ప్రయోజనపు హద్దులను చెరిపివేస్తున్నది. అందుకే ఈ **మలిదశ ఉద్యమ కాలం పాటకు స్వర్ణయుగం**. అనేక కొత్త కలాలకు, గళాలకు జన్మనిచ్చింది. పాటల ద్వారా, కోల్పోయిన చరిత్ర, సంస్కృతిని తిరిగి బ్రతికించుకునేందుకు తెలంగాణలో సాంస్కృతిక పునర్జీవనోద్యమం కొనసాగింది. సాంస్కృతిక చిత్రపటం నుదుటన తెలంగాణ ఉద్యమం కొత్త చరిత్రను లిఖించింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఒక వెల్లువలా విజృభించిన పోరాట పాటల పునాదికి కొన్ని ముఖ్య భావనలు కారణమని అర్థమవుతాయి. అలా తెలంగాణ ఉద్యమపాటకు గల సైద్ధాంతిక భూమికను ఈ క్రింది విధంగా రూపొందించుకోవచ్చు.

సామాజిక ఉద్యమాలకు కావల్సిన మద్దతును సాంస్కృతిక రంగమే కూడగడుతుంది. తెలంగాణ ఉద్యమాల్లో సాంస్కృతిక రంగానిది పెద్దపీట. ముఖ్యంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో అనేక కళారూపాలు ఉద్యమం కోసం పోరాట కళలుగా మలుచబడ్డాయి. పాట ప్రదర్శన కళగా విస్తరించింది. తెలంగాణకు చరిత్రలో జరిగిన అన్యాయాలను అర్థం చేయించే ఒక విజ్ఞానసాధనంగా పాట ఉపయోగపడింది. ఇప్పటిదాకా తెలంగాణ సమాజంలో కొనసాగిన ఉద్యమాలు ప్రస్తుత పాటకు ఒక దిశానిర్దేశం చేయగలిగాయి. పాటంటే విశాల ప్రజారాసులను విముక్తి కోసమేననే స్పృహను అందించాయి. రాజకీయంగా కొనసాగుతున్న ఒక ఉద్యమ లక్ష్యానికి అనుగుణంగా ప్రజలను సన్నద్ధం చేయడంలో పాట సఫలీ కృతమైంది. తెలంగాణ రాష్ట్రోద్యమంలో అనేక సంక్లిష్ట విషయాలు చర్చించబడ్డాయి. నీళ్ళు,

నిధులు, ఉద్యోగాలు, సహజవనరుల దోపిడి, ఆర్థిక దోపిడి వంటి అమూర్త భావనల పట్ల తెలంగాణ ప్రజలకు అవగాహన ఏర్పడడానికి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అందుకు కారణం ఇక్కడి ప్రజల్లో అభివృద్ధి కుంటుపడడంతో పాటు నిరక్షరాస్యత కూడా మరో పెద్ద సమస్య. దీంతో వర్ధమాన పరిణామాల పట్ల అవగాహన అంతంత మాత్రంగానే ఏర్పడిందనేది నిర్వివాదాంశం. అందువల్ల వారి చైతన్యపు స్థాయిని దృష్టిలో పెట్టుకొని, మేలుకొలిపే సాధనంగా మారింది ఉద్యమపాట. దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్గత వలసపాలన ప్రతిఫలనాలను తెలంగాణ పాట విడమరిచి చెప్పగలిగింది. అర్థం కానీ దోపిడిని, కనిపించని శత్రువును పట్టిచ్చింది పాటే.

తెలంగాణ ఉద్యమ పాటకు లక్ష్యం ప్రజా జాగృతం. అందువల్ల అనివార్యంగా అది ప్రజల చేతనే సృజించబడింది. ప్రజల చేత ప్రజల కొరకు సృజించబడిన చరిత్ర తెలంగాణ పాటది. ఇందుకు నిదర్శనమే తెలంగాణ ఉద్యమ పాట ప్రజల బాణీల్లో, ప్రజా సమస్యలనే వస్తువుగా స్వీకరించడం. ఉద్యమం కోసం గళం విప్పిన కళాకారులు రచయితలు ప్రజా పక్షపాత దృష్టిని కలిగి ఉండడం ఈ పాటల్లోని ఒక ఉమ్మడి సాధారణాంశం. అందువల్ల వారి పాటల్లో ప్రజల జీవితం, ప్రజల బాధలు, ఆ బాధలకు కారణమైన పాలకుల దోపిడి వంటి అంశాలు అనివార్యంగా వస్తువులుగా మారినయి.

తెలంగాణ ఉద్యమపాట లక్ష్యపూరితమైంది. తెలంగాణ విముక్తి జరిగి ప్రత్యేక రాష్ట్రం సాధించి, ఇక్కడ ప్రజల కలలు తీరేలా చేయడమే దాని పరమావధి. తెలంగాణను పాలించిన పాలకుల్లో అత్యధికభాగం ప్రాంతేతరులే కావడం కారణంగా పాలనంత ఏకపక్షంగా కొనసాగింది. అందువల్ల తెలంగాణకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరిగింది. ఈ అన్యాయాలను వివరించే రాజకీయ చైతన్యం ఇవాల్టి ప్రజా రచయితలది. పాట ద్వారా రాజకీయాలను బోధించడమనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సాంస్కృతిక రంగపు ప్రయోగం... సమగ్రంగా సఫలీకృతమయ్యింది. అధికార వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్న ప్రాంతేతరుల ఆధిపత్యాన్ని బద్దలుకొట్టడమే లక్ష్యంగా చేసుకున్న పాట, తెలంగాణ స్వయంపాలనను గానం చేసింది. మిగిలిన అస్తిత్వవాదాల లాగా కేవలం సమానత్వం, హక్కుల సాధింపు వంటి అంశాల వరకే పరిమితం కాకుండా అధికార మార్పిడి వంటి సమూలమైన మార్పులను తెలంగాణ పాట తన ఆకాంక్షగా మార్చుకుంది. ఆత్మగౌరవం, స్వయంపాలన లక్ష్యంగా తెలంగాణ పాట సృజించబడింది.

సాధారణంగా గేయసాహిత్యంలో ప్రధానంగా రెండు లక్షణాలుంటాయి. అవి ఒకటి అలరించడం. రెండవది ఆలోచింప జేయడం.

జానపద సాహిత్యంలో కూడా ఈ రెండు లక్షణాలుంటాయి. కానీ జానపదంలో అలరించడమనే గుణాన్ని మాత్రమే ఎక్కువగా ప్రచారం చేయడం కనిపిస్తుంది. తద్వారా



**నాటి తెలంగాణ ఉద్యమంలో 'అసైదుల్లా హారతి' పాటతో ఉర్రూతలూగించిన కోదారి శ్రీను**

జానపదానికి ఉన్న అర్థం కుదించబడింది. కానీ, తెలంగాణ ఉద్యమపాట ప్రధానంగా ఆలోచింప జేసే లక్షణం కలిగింది. ఎంతటి ఉత్సాహవంతమైన పాటైన అందులో అనివార్యంగా ఆలోచింపజేసే విషయాలే సృజించబడ్డాయి. ప్రజావిముక్తి కోసం కొనసాగుతున్న ఉద్యమంలో ప్రజాచైతన్యం కేంద్రంగా మాత్రమే సాహిత్యసృజన ఉంటుంది. తెలంగాణ పాటలో కూడా అలరించడం కంటే ఆలోచింప జేసే లక్షణమే ఎక్కువ. ఆరుదశాబ్దాల ప్రతిఫలనాలకు ప్రతిబింబమైన పాట సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక పరమైన ప్రజాసంబంధ విషయాలనే గానం చేసింది. తెలంగాణ ఉద్యమ గమనానికి తెలంగాణ పాట దిక్సూచిగా మారింది. ఆటుపోట్లు ఎదురైనపుడు ఆలోచన రేకెత్తించే విధంగా పాట సృజించబడింది. మారుమూల తెలంగాణ పల్లెలకు తెలంగాణ పాట విస్తరించి అక్కడి ప్రజలను చైతన్య పరిచింది. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని ప్రజల్లో చైతన్య బీజాలు నాటింది పాట. ప్రజావిముక్తి కోసం గానం చేయడమనే ప్రయోజనం తెలంగాణ పాటలో అంతర్లీనంగా కొనసాగే సూత్రం. ఈ సూత్రం మీద ఆధారపడ్డ పాట అలరించడం కంటే ఆలోచింపజేయడం కనిపిస్తుంది. కానీ, కొన్ని సందర్భాల్లో బూర్జువ పెట్టుబడిదారి అగ్రవర్ణాలు తెలంగాణ పాటను వ్యాపారదృష్టితో చూడడం వల్ల కొన్ని పాటలు ప్రజలను ఆకట్టుకోలేక పోయాయి. బలమైన తాత్వికపునాది కలిగిన విప్లవోద్యమానికి మార్క్సిజం, మావోయిజం సిద్ధాంతాలు. కానీ, తెలంగాణ ఉద్యమానికి అలాంటి నిర్దిష్ట సిద్ధాంతమేది లేకపోవడం కారణంగా పాట విశ్రాంత వర్గాల చేతిలో కొద్దిమేర బందీగా మారింది. ఎంటర్‌టైన్‌మెంట్ సాధనమైంది. కానీ, మెజారిటీ పాటలన్ని ఆలోచింపజేసే గుణం కలిగినవే. తెలంగాణ విముక్తిని గానం చేసినవే. కాబట్టి తెలంగాణ పాట ప్రయోజన పూరితమైంద నేది స్పష్టం అవుతున్నది.

తెలంగాణ పాటకు తెలంగాణ జీవితమే ప్రధానమైన ఆధారం. తెలంగాణ పాట తెలంగాణ జీవన విధ్వంసాన్ని కండ్లముందుంచడమే కాకుండా అందుకు గల కారణాలను కూడా వెలికి తీసింది. వివిధ ఉద్యమాల్లో కూడా ఈ పని కొంత జరిగినప్పటికీ తెలంగాణ ఉద్యమ సందర్భంలో మరింత సమగ్రమైంది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో మొదలు విప్లవ, దళితోద్యమాల వరకు తెలంగాణ జీవితాన్ని పాటల్లో చిత్రించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కానీ, అవి ఆయా ఉద్యమాల దృష్టికోణంతో చిత్రించినవే. కానీ, తెలంగాణ రాష్ట్రోద్యమంలో అదే ప్రజల జీవితాన్ని మరో కొత్త కోణంలో స్పృశించిన తీరు స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రజల జీవితాన్ని సమస్యల కోణం నుంచి మాత్రమే కాక, తెలంగాణ నేలకున్న తాత్విక పునాది నుంచి వైవిధ్యంగా లోతుల్లోకి వెళ్ళి పాటకవులు చిత్రించడం కనిపిస్తున్నది.

ప్రాదేశిక కేంద్రంగా సృజించబడడమే అందుకు ముఖ్య కారణం. ప్రాదేశిక సాహిత్యం ఒక ప్రాంత ప్రజల జీవితాన్ని, సంస్కృతిని అర్థం చేయిస్తది. అలాంటి సాహిత్య ప్రక్రియల్లో పాట మరింత బలంగా ప్రజా జీవితానికి అద్దం పట్టింది. జీవితాన్ని మాత్రమే కాకుండా ప్రజల యొక్క భావావేశాలు, ఆగ్రహాలు, దు:ఖాలు, స్పందనలు సమస్త భావనలను పాట పట్టుకోగలిగింది. విభిన్న రీతుల్లో గేయ రూపంగా మలచగలిగింది.

తెలంగాణ ప్రాంత చరిత్ర పూర్వయుగం నుంచి నేటి వరకు వివిధ రాజవంశీయుల పాలనలో మనుగడలో ఉంది. అందువల్ల ఆయా పాలకుల ప్రభావంతో పాటు వివిధ మతాల ప్రభావం ఇక్కడి ప్రజల్లో కనిపిస్తుంది. తద్వారా భిన్నత్వంలో ఏకత్వం అనే విశ్వజనీన భావన ఇక్కడ సజీవంగా ఉంది. ఈ అంశాన్ని ఆధారం చేసుకున్న తెలంగాణ వాగ్గేయ కారులు పాటల్లో ఆ భిన్న సంస్కృతిని ప్రాదేశిక కేంద్రంగా చిత్రించారు.

తెలంగాణ ప్రజలకు ప్రాదేశిక స్పృహ కలుగ డానికి ప్రాంతేతరుల ప్రత్యక్షపాలనే కారణం. పాలనాపరమైన సౌలభ్యాలను అందించడంతో పాటు పెద్ద మొత్తంలో తెలంగాణ వనరులను వినియోగించుకుంటున్నందుకు తెలంగాణకు అధిక నిధులు కేటాయించకపోగా కనీసం మిగిలిన ప్రాంతాలతో సమానమైన వాటాను ఏ రంగంలోను కేటాయించలేదు. ఈ అన్యాయాల మీద తిరుగుబాటు, నిరసనగా ప్రత్యేక తెలంగాణ డిమాండ్ ముందుకొచ్చింది. అందువల్ల ఏ పాటకైనా అనివార్యంగా ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ ముగింపుగా ఇవ్వడం ఉద్యమపాటలో ఉన్న సహజలక్షణం. పాలనకు, భౌగోళిక విధ్వంసానికి కారణాలను వెతికే పని పాట చేయగలిగింది. ఈ పని ప్రాదేశిక దృష్టితో చేసింది. ప్రాదేశికత అనేది కేవలం భౌగోళిక విషయాలకే పరిమితం చేస్తే దాని పరిధిని కుదించినట్లవుతుంది.

అందువల్ల ప్రాదేశికకోణంలో ఒక ప్రాంతంలోని ప్రజల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ చరిత్రనంతా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. సామాజిక శాస్త్రాల పరిశోధనల్లో ఇటువంటి అధ్యయనాలు ఇప్పటికే అనేకం జరిగాయి. మానవీయ శాస్త్రాల్లో చాలా పరిమితంగా జరిగాయి. తెలంగాణ గేయ సాహిత్యాన్ని ప్రాదేశిక కోణంలో రచించేటపుడు ఆయా రచయితలు ఈ విషయాలన్నింటి పైనా దృష్టి సారించడం జరిగింది. ఒక్కో రంగంపైన కొన్ని వందల పాటలు తెలంగాణ మలిదశ ఉద్యమ సందర్భంలో వెలువడ్డాయి. ఇట్లా కూలంకషంగా ఒక్కో రంగాన్ని ఎంపిక చేసుకోవడం వల్ల ఆయా రంగాల



ప్రజల జీవితంతో పాటు ప్రాదేశికత బలంగా చిత్రితమవుతుందనే సత్యం బహిర్గత మయ్యింది. కాబట్టి తెలంగాణ గేయసాహిత్యానికి తాత్వికపునాది ప్రాదేశిక కేంద్రమైందనే విషయం అర్థమవుతున్నది. తెలంగాణ గేయ సాహిత్యపు గాఢతను, సాంద్రతను అర్థ చేసుకోవాలంటే ప్రాదేశికత ఆధారంగా పరిశీలించడం ద్వార మాత్రమే సాధ్య పడుతుందని గమనించాలి.

విప్లవోద్యమం శ్రామిక విముక్తి గురించి, దళితోద్యమం దళితుల విముక్తి గురించి ఉద్యమించాయి. ఆ ఉద్యమాల్లో సృజించిన పాట కూడా ఆ కేంద్రంగానే వెలువడింది. కానీ, తెలంగాణ ఉద్యమ లక్ష్యంలో అణగారి పోయిన ప్రజలతో పాటు ఆధిపత్య కులాల సంక్షేమం కూడా దాగి ఉన్నది. విప్లవోద్యమానికి శత్రువు ఆధిపత్యవర్గానికి చెందిన పెట్టుబడిదారులు,

దొరలు భూస్వాములు. ఈ కారణంగా విప్లవోద్యమ గేయం వర్గశత్రువు నిర్మూలనను ఆకాంక్షిస్తుంది. ఆ దిశగా విశాల పీడిత ప్రజారాశులను సంఘటితపరిచి పోరుబాటన నడిపిస్తుంది. కానీ, తెలంగాణ ఉద్యమానికి ఉన్న తాత్విక భూమిక ఇందుకు భిన్నమైనది. ఆత్మగౌరవం, స్వయంపాలన, స్వావలంబన వంటి ప్రధానమైన భావనల పునాదిగా తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకున్నది.

కానీ, ఇది భౌగోళిక కేంద్రమైనది. తెలంగాణ ప్రాంతంలో ఆర్థికంగా బలపడిన వారితో పాటు అత్యంత పేదరికంతో బాధపడుతున్న వారిరువురి సమష్టి లక్ష్యం ఒక్కటే. అందువల్ల ఒక ప్రాంతేతర ఆధిపత్యాన్ని ఎదుర్కోవడం కోసం మరో ప్రాంతంలోని అన్ని వర్గాల వారు ఉమ్మడి సాధారణ లక్ష్యం కోసం ఒక్కటైన వైవిధ్యం కనిపిస్తుంది. అందువల్ల తెలంగాణ విముక్తి ఉద్యమం తెలంగాణ ప్రాంత విశాల ప్రజారాసుల కోసం ఉద్దేశించబడింది. ఈ నేపథ్యంలో వెలువడిన పాట ఆ విశాల ప్రజారాసుల చైతన్యం దిశగా విస్తరించింది. తెలం గాణ విముక్తి ఉద్యమ గీతం ఏదో ఒక్క వర్గం కోసం కాకుండా సామూహిక విముక్తిని గానం చేసింది.

అయిదున్నర దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాలను ఒక్కొక్కటిగా ఎండ గట్టింది పాట. జరిగిన అన్యాయాలను వస్తువుగా స్వీకరించిన తెలంగాణ పాట మరోవైపు ప్రాంత ఔన్నత్యాన్ని ఎలుగెత్తి

చాటింది. పోరాట పాట ప్రజలపక్షం వహించి వారి చైతన్యమే పరమావధిగా సృజించబడుతుంది. ప్రజారచయితలు ప్రజలనుంచి పుట్టుకురావడం వల్ల, అనివార్యంగా వారికి ప్రజాసమస్యల కేంద్రంగా పాట అల్లడమే ప్రథమ కర్తవ్యం అవుతుంది. ప్రజలనాడి తెలిసిన రచయితలు ఆయా సమూహాల స్థితిగతులకు కారణాలు వెతికే పనిని పాట రూపంలో ప్రయత్నిస్తారు. ఈ సందర్భంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన వాగ్గేయకారుడు వాటినే వస్తువుగా స్వీకరిస్తాడు. తెలంగాణ ప్రాంతం సమైక్య పాలనలో అనేక రంగాలలో తీవ్రంగా దగాపడ్డది. నీళ్ళు, నిధులు, ఉద్యోగాలు మాత్రమే కాక తెలంగాణ ప్రాంత భాషా సంస్కృతులు కూడా ధ్వంసమయ్యాయి. ఈ పరిస్థితులను సీమాంధ్ర ప్రభుత్వం గడిచిన అరవైయేండ్లలో కల్పించింది. ఏ జాతికైనా ఆత్మగౌరవం, స్వయం పాలన అనేవి పునాది అంశాలు. ఈ రెండు అంశాలు కోల్పోయిన జాతులు భౌతికంగా కనిపించినప్పటికి పతనదశలో ఉన్నాయని అర్థం. తెలంగాణ ప్రజలను ఈ స్థితిలోకి నెట్టివేసిన తీరుకు తెలంగాణ ఉద్యమం గీతం కన్నీరు పెట్టింది. మూలాలను అన్వేషిస్తూ కనుగొన్న నిజాలను ప్రజల ముందుంచింది. ప్రత్యేక రాష్ట్రం మాత్రమే దీనికి సరైన పరిష్కార మార్గంగా భావించింది. దగాపడ్డ తీరును వివరిస్తూ ప్రజలను చైతన్య పరిచిన పాట, ఆత్మగౌరవంతో స్వయంపాలన స్వావలంబన కోసం పోరాడవలసిన ఆవశ్య కతను సూచించింది. ఇట్లా తెలంగాణ విముక్తి గీతం.. వస్తువు ప్రజలనుంచే స్వీకరించి, వారిని ఉద్యమానికి సమాయత్తం చేసింది.

ప్రజల సాంస్కృతిక రూపమైన పాటలో వస్తువు మాత్రమే కాకుండా బాణి కూడా ప్రజల నుంచే స్వీకరించింది. తెలంగాణలో ఇప్పటి వరకు కొనసాగిన ఉద్యమాల్లో పాట పోషించిన పాత్రే ఇందుకు మాతృకగా మారింది. తెలంగాణ సాయుధ పోరాట కాలాని కంటే ముందునుంచే ప్రజల బాణీల్లో ప్రజల జీవితాన్ని వస్తువుగా స్వీకరించే సంప్రదాయాన్ని తెలంగాణ విముక్తోద్యమం కూడా కొనసాగించింది. ప్రజాసమస్యలను వస్తువుగా స్వీకరించడమే కాకుండా, బాణిని కూడా ప్రజల నుంచే స్వీకరించింది ఉద్యమపాట. తెలంగాణనేల సాంస్కృతిక చరిత్రలో జానపద గేయాలదే సింహభాగం. వివిధ ఆశ్రిత కులాలకు వాటిదైన జానపద కళారూపాలు ఉండడానికి తోడు ఆ కళారూపాల్లో పాట కథను నడిపించే ఒక చోదకశక్తిగా ఉంది. అందువల్ల వేల జానపద గేయాలు ఆయా కళారూపాల్లోని కథల్లో ఉండడం వల్ల తెలంగాణలో గేయప్రక్రియ ఇక్కడి ప్రజల ఆదరణను గెలుచుకోగలిగింది. ముఖ్యంగా ప్రజల జీవితంతో పెనవేసుకున్న బాణీల్లో పాటలు రాయడం వల్ల అవి సులభంగా ప్రజలను ఆకట్టుకోగలిగాయి. తెలంగాణ విముక్తి ఉద్యమంలో కూడా జానపద బాణీలే కీలక పాత్ర పోషించాయి. జానపద జీవితంలో నుంచి వచ్చిన వాగ్గేయకారులు ఉద్యమసందర్భంలో అనివార్యంగా ఆ బాణీల్లోనే పాటలు అల్లి ప్రజల వద్దకు చేర్చారు. ఇట్లా తెలంగాణ పోరాట పాట, వస్తువుతో పాటు బాణి కూడా ప్రజల నుంచే స్వీకరించింది. అందుకే ఇది ఈ గేయసాహిత్యం ప్రజాసాహిత్యంగా వర్ధిల్లింది.

> *ప్రజల భావోద్వేగాలకు తెలంగాణ పాట ఒక వ్యక్తీకరణరూపం. తెలంగాణ పాట ఏకకాలంలో గతంతో పాటు వర్తమానాన్ని బోధించింది. అంతటితో ఆగిపోకుండా భవిష్యత్తుకు కూడా దిశానిర్దేశం చేసింది.*

రాజకీయ చైతన్యం కలిగిన వాగ్గేయకారుడు తన రచనల్లో రాజకీయాలను బోధిస్తాడు. ప్రజల డిమాండ్ ను పాటల్లో నిక్షిప్తం చేసి ప్రజలకు అందిస్తాడు. ఉద్యమ లక్ష్యాన్ని చేరుకునేందుకు రాజకీయోద్యమానికి సమాంతరమైన సాంస్కృతికోద్యమం కూడా ఉండాలి. అప్పుడు మాత్రమే ఏ ఉద్యమమైన విజయవంతం అవుతుంది. తెలంగాణ ఉద్యమానికి బలమైన పునాదిని ఇచ్చింది సాంస్కృతిక రంగమే. వివిధ కళారూపాల సమ్మేళనమైన ధూంధాం ఆటపాటలు తెలంగాణ ఉద్యమాన్ని పదునెక్కించాయి. ఉద్యమం పతాకస్థాయి చేరినపుడు పాట ఆ వేడిని కాపాడడానికి ఇంధనంగా ఉపయోగపడింది. ప్రధానంగా ఉద్యమంలో భాగస్వాములైన ప్రజల్లో పాట కొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా ఆలోచింప జేసింది. తెలంగాణ జరిగిన అన్యాయాలను అర్థం చేయించి వారి అవగాహనను మరింత విస్తృతపరిచింది. అందువల్లనే తెలంగాణ ఉద్యమ గేయం, ఉద్యమించే ప్రజలకు గొంతుకగా నిలిచింది.

ప్రజల భావోద్వేగాలకు తెలంగాణ పాట ఒక వ్యక్తీకరణరూపం. తెలంగాణ పాట ఏకకాలంలో గతంతో పాటు వర్తమానాన్ని బోధించింది. అంతటితో ఆగిపోకుండా భవిష్యత్తుకు కూడా దిశానిర్దేశం చేసింది. చరిత్రలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను గురించి చెబుతూనే, తెలంగాణకు గల ఘనమైన చరిత్రను గుర్తుచేసింది. అదే సమయంలో వర్తమానంలో జరుగుతున్న అన్యాయాలతో పాటు ఉద్యమదశదిశలను నిర్దేశించింది. దీంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడాల్సిన ఆవశ్యకతను ప్రజలు గుర్తించారు. అందువల్ల తెలంగాణ పాట గతవర్తమాన, భవిష్యత్ కాలాల చారిత్రక చిత్రపటంగా భావించవచ్చు. చరిత్రలేకుండా వర్తమానం ఉండదు. వర్తమానం లేకుండా భవిష్యత్ నిలబడదనే సూత్రాన్ని తెలంగాణ పాట మరోసారి నిరూపించింది. చారిత్రక ఉద్యమంలో పాటకు ఈ విధమైన చూపు లేకుండా అది ఏ ప్రయోజనాన్ని సాధించలేదు.

ఆయా కాలాలకు సంబంధించిన సంఘటనలను మూల్యంకనం చేసిన ఉద్యమపాట, వివిధ రంగాలకు సంబంధించిన ప్రకంపనలను, పరిణామాలను కూడా చారిత్రకంగా నమోదు చేసింది. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక చరిత్రలను కూడా పాట ఏక కాలంలో రికార్డు చేసింది. అట్లా తెలంగాణ గేయసాహిత్యం

ప్రాదేశికమైన జీవితాన్ని, ఇక్కడి ప్రజల ఉద్యమ ఆకాంక్షల్ని బలంగా ప్రతిఫలించిందని అర్థమవుతున్నది. తెలంగాణ పాట ద్వారా ఉద్యమ సందర్భంలో రూపుదిద్దుకున్న సాంస్కృతిక చరిత్రను అర్థం చేసుకోవడానికి వీలుకలుగుతుంది. పాటలేని తెలంగాణ ఉద్యమాన్ని ఊహించలేం. పాటంటే తెలంగాణ, తెలంగాణ అంటే పాటే.

# అమాసలు అందలం ఎక్కితే...



జూపాక సుభద్ర

ఎనుకట ఎల్లమ్మలు
రాజ్యాలు ఏలినారని
ఢిల్లీని ఢీ కొట్టినారనీ
వన్నియార్లు వరుసబెట్టి పాడుతుంటే
చెవులు తేనెల కోనలు అయితయి
కండ్ల కంతల్ల పండుకున్న కలల కథనాలు
కదనాల పదాల పాడుతయి మన కండ్ల
ముందటనే కాన్షీరామ్ బహుజన హితాయ
బహుజన సుఖాయ  అంబేద్కరీయాయతో
ఎట్టి బిడ్డను అధికార
అందలాలెక్కించిన అద్భుతాలు
కాలం కండ్లల్ల 'మాయ' ని చరితలు,
పియ్యెత్తిన మోతలు,
పిడికెత్తిన సేతులు,
పీఠాలు ఎక్కాలే.
బూమికి చాతిచ్చి బువ్వ బండిచ్చినా
పుడిసెడు నేల లేని నెలువులు,
మోకాలు బంటి బురద వరదల్ల
నడుములిరిగే నాట్లు,
కోతల మోతలు,
ఎండ పనుల్ల అంగలారిసే
ఆకలి తట్టలు,
పట్నమంతా ఆకాశంలో చంద్రుని
పొందుకునే ఇంద్ర బవంతులనెగరేసినా
నీడలు నిలబడని తావులు,
రోడ్డు మొకమ్మీన పారే
రోత సొల్లును కసువుల్ని కడిగి
ఎత్తిపోసే సీపురు కట్టలు,
సఫాయి తట్టలు,
శిశిరాలు పూసే పునాసలు,
గ్రీష్మాలు మోసే అమాసలు,
పుట్టుక పునాదుల్లో
అంటరాని కంటకాలు,
దించబడి దీపాలార్పిన దిక్కులు,
కూటికి గుడ్డకు చదువుకు సంపదకు
ఆమడలకు తరమ బడిన అంత్యజులు,
దరిలేని దరువులు వలిగిన దప్పులు
వక్కలైన ముక్కు పుల్లల మూలాలు,
పలిగిన
గాజుల గాయాలు,
పిడికిళ్ళయి పీఠాలెక్కితే..,
యీ బూగోలాన్నే కాదు
ఏ గోళాన్నయినా శోకమ్ లేని
లోకంజేసే ఆశోకీయాలు

---

# బిడ్డ రాక!

**(బతుకమ్మ పండుగకు ఇంటికి వచ్చి కూతురును గురించిన ఒక తల్లి మనోగతం)**



దొర వేటి

ఆ.వె. 'వచ్చునమ్మ బిడ్డ బతుకమ్మ పండుగ'
కనుచు నొంటినిండ కనులుగాగ
యెదురు చూచు చుండె నెంతయొ ఆశతో
తలచుకొనుచు నిట్లు తల్లి మదిని...

ఉ. 'వస్తది చిట్టితల్లి బుధవారము, పండుగ ముందు రోజు పే
రుస్తది తీరుతీరుగ జరూరుగ నా బతుకమ్మతల్లినే
యేస్తది రోజురోజుకొక యింపును గూర్చెడి ముగ్గు వాకిటన్
మస్తు ఖుషీలు దెస్తది అమాయకురాలు గదమ్మ బిడ్డయే...

చ. 'కడుపున దుఃఖమున్న నది గన్పడనియ్యదు బిడ్డ, యెప్పుడే
మడిగిన నవ్వుతుంటది సమానము రాగల జాల రెవ్వరే
నుడుగును విన్న సంబురము నోచిన నోముల రూపు తల్లి! తా
నొడుపున పేద కాపురము నొద్దిక మీరగ దిద్దు కుంటదే...

కం. 'బతుకమ్మకు తాఁ జేసుక
బతుకమ్మకు మారురూపువై గనిపించే
బతుకులు అద్దము బిడ్డా!
బతుకంతా సుందరముగ వర్ధిల్లమ్మా ! '

చ. అని తన మన్సులోన దినమంతయు చింతలు చుండ బిడ్డ వ
చ్చెను గద సందమామ వలె, చెక్కిలి ముద్దిడి, అక్కునందు జే
ర్చిన తనువంత తల్లికి వచింపగ నేరని పుల్కరింత గ
ల్గెను, అమవాస ముందె వెలిగిందిగ వెన్నెల యన్న రీతిగా... !



# చేదుపాట



హిమజ

క్షమించండి
నేనిప్పుడు శైశవగీతాన్ని ఆలపించబోవడం లేదు
పిల్లలపై, పువ్వులపై
మెరుపు మెరిస్తే ,వాన కురిస్తే
ఆనందించే కూనలపై
ఈలలు వేస్తు  ఎగురుతుపోయే
పిట్టలగురించి పిల్లల గురించి
పాడబోవడం లేదు
నిజానికి మనమిపుడు
రేపటి వెలుతురు మొగ్గల్ని చిదిమేస్తున్న
స్మశానాల్లో బతుకుతున్నాం

ఆడపిల్లగా పుట్టడమే నేరమైన
బీడునేలపై గాలి పీలుస్తున్నాం
వికసిస్తున్న యవ్వనపుష్పాలను
కాలరాస్తున్న కత్తులవంతెనపై
కదలాడుతున్నాం
కళ్ళనిండా మెరిసే కలల్తో
అమాయకంగా రైళ్ళెక్కే
కౌమార సొగసుల్ని, కామాటిపురాకి
రవాణా చేసే రాస్తాల్లో
మొద్దుబారిన మనసుల్తో
నడుస్తున్నాం
కత్తిరింపుల్లేని పచ్చిబూతు తప్ప
మరో అర్థం లేని LED తెరలు
గుమ్మరించే వెకిలి వికారాల ముందు
నిస్సహాయులమై ,నిర్వికారంగా
కూర్చుంటున్నాం
నూరు రూపాయల నోటు
కడుపు నింపదేమోగానీ
కారుచౌక ఇంటర్నెట్టు డేటా
నీలిస్వప్నతరంగాలు రోజంతా చేసే
కలుషితప్రసారాలు మెదళ్ళలో
నింపుకుంటున్నాం
తల్లి పక్కలోని నెలల పసికందు
ఏ నేరం చేసిందిరా  దౌర్భాగ్యుడా?
కళ్ళైనా పూర్తిగా తెరవని పసికూన
నిన్నెలా రెచ్చగొట్టిందిరా మదమృగమా?
తాతవో, మామవో, అంకుల్ వో, అన్నవో
చిన్నాన్నవో, చివరికి నాన్నవో
నువ్వెవడివైనా కానీ -
నిన్ను  సంబోధించడానికి
మేమిప్పుడు సరికొత్త. నిఘంటువు
సిద్ధం చేసుకోవాలి
ఇప్పుడిక -
బాలింతరాలు సైతం
బరిసె చేతబట్టుకొని
పురిటిమంచానికి
కాపలా కాయాల్సిన
దౌర్భాగ్యకాలమొకటి  దాపురించింది !!

# గోగుపువ్వు - తాత

తెలంగాణ గ్రామీణ జీవితం అమాయకమైన బాల్యం కళ్ళకు కట్టినట్లు చూపించాడు పిన్నంశెట్టి కిషన్. ఆయన స్వీయానుభవం నుండి జాలు వారిన ఈ చిరు కథ అందరి అనుభవం తనదిగా చూపెడుతుంది. తంగెడు పాఠకుల కోసం...



కిషన్ పిన్నంశెట్టి

అది పొద్దుగూకే యాల్ల.

గోగుపువ్వసోంటి సూరీడు చీకటమ్మ చెంత చేర, పడమటింటికి దారివట్టిండు. ఇంటి మొకం పట్టిన పశువుల మందలు లేపిన దుమ్ము, గ్రౌండులో పిల్లల ఆటలకు రేగుతున్న దుమ్మూ ధూళి, మేఘాల్లా పసుపు పచ్చని రంగు ఏదో చిమ్ముకుంటున్నాయి.

"హోళి! హోళిల రంగ హోళి! చెమ్మకేలిల హోళి!...,"

"గోగూపూల దండ అటేత్తునా! మరి ఇటేత్తునా!...," అని ఆడోళ్ళు దుకాండ్ల పొంట పైసలు అడుక్కుంటా పాడే పాటల్ని, గాలి లీలగా పాడుకుంటూ దుమ్ముని, పశువుల రొచ్చు వాసనను, భుజాన మోసుకు తిరుగుతున్నది.

ఆ హోలీ పాటలు వినవడకపోతే ఆటల్లవడి, ఎల్లుండి హోళీ అన్న సంగతే మరిచిపోయేటోల్లం.

"అరేయ్! ఆపుండ్రి రా!"ని గట్టిగ 'కీక' వెట్టిన.

'ఏమయ్యిందోన'ని, ఆడే ఆట మద్దెల్నే ఆపేసి బాబ, చందు, శెఫిక్ నా సుట్టు జేరి "ఏమయిందిరా!" అన్నరు.

"ఎల్లుండి హోళీ! యాది మరసిండ్రా బే!" అన్న.

"అవున్రోయ్!" అన్నరు ఏకంగ.

బతుకమ్మ పండుగకు తంగేడు పూలు, గునుగ పూలు చేండ్ల పొంట పోయి కోసుకొచ్చుకున్నట్లు! తెల్లారితే హోళీ అనంగ, అయ్యాల రాతిరికే తెంపుకొచ్చిన గోగుపువ్వుకు పసుపు, నీళ్లు కలిపి, కుమ్మరి కుండల కాగ వెట్టాలె. లేకపోతే, కొనుక్కున్న రంగుల్తో ఆడాల్సి వత్తది.

ఇగ పుక్కటుకు దొరికే రంగులు సుత మస్తుగ ఉంటయి. వాడిన కందెన, ఇంజన్ ఆయిల్, గ్రీసు, మొఖానికి - బట్టలకు పూయడానికి. నెత్తికి సునేర్. అవి పుసినోడికి, పూయించుకున్నోడికి, కడుక్కునేటప్పుడు పెద్దలు కనవడ్తరు. దయ్యం లెక్క, ఓ పట్టాన వదలయి. ఇంకా, నెత్తి మీద కోడిగుడ్లు పగులగొట్టుడు, బురుదల బొర్లిచ్చుడు, ఇప్పుడిప్పుడే మొదలయితున్నయి ఊర్లల్ల.

మేం ఎవరం గటువంటి వాటి తోటి ఆడం. చేండ్లు -చెల్కల పొంటి పొయ్యి, గోగుపువ్వులు దెచ్చుకుని, ఉడ్కవెట్టి చేసుకున్న రంగుల్తోటి ఆడుకునే మజానే వేరు. మల్ల, పైసలకు పైసల్ దక్కుతయ్! పెయి ఖరాబు కాదు.

పువ్వు కోసం రేపటి పగటి పూట బడి ఎగగొట్టాలని ఖరారైనం. సార్లకు చెప్పి పోవాలంటే కడుపు నొత్తుంది, కాల్లు గుంజుతున్నయని కతలు అల్లాలె. ఒకసారి సెలవు చీటీ రాసియ్యమంటరు, లేకపోతే పెద్దసారు దగ్గరికి పొమ్మంటరు. అదో పెద్ద సోది. దానికంటే బడికి డుమ్మ గొట్టడమే నయం. కానీ ఇంట్ల తెలుస్తది. గందుకే పొద్దటి పూట పోయి, పగటీలి బువ్వ తినడానికి వచ్చి,ఇట్నుండి ఇటే పోవాలెనని ఫైస్లా అయినం.

"పుస్తకాలెట్ల మరి?" అడిగిండు అనుమానపు పురుగు బాబ.

"బడీలనే వెట్టాలె!" చందుగాడు, కొట్టినట్లే గదుమాయించిండు.

"మల్ల! తాళం ఉంటది కదా?" బాబ.

"సాయంకాలం బడి అయిపోయినంక, ప్రహరీ గోడదూకి పోయి తెచ్చుకోవాలె"నని సంజాయించిండు శెఫిక్.

"మరీ, గంతెత్తు గోడ ఎట్లా ఎక్కి దుంకుతవు బై!" అని ఆశ్చర్యపోతూ అడిగిండు బాబ.

"పెద్ద దర్వాజ పక్కపొంటి ప్రహారీ గోడ వానలకు కూలి లోపటి దిక్కు వొరిగింది..."అన్న.

బాబ తల ఊపుకుంటా, 'అవునవు' నన్నడు. మల్ల మాట్లాడకుంట, చందు వాని నోరు మూసిండు.

"అందుకని, లోపలికేల్లి బయిటికి, అల్కగ దుంకి రావచ్చు. పోయేప్పుడే కొంచెం కష్టం. నేను, చందు రెండు చేతులు జోడిచ్చి పట్టుకుంటే, ఓ కాలు చేతుల మీద వెట్టి - ఇంకోటి భుజం పైన యేసి, గోడమీదికి

ఎక్కుండ్రి మీరిద్దరు. లోపల భయపడ కుండా, ఒకనికొకడు తోడుంటరు'' అని వివరంగ చెప్పిన.

★ ★ ★

అనుకున్నట్లే, పువ్వుకోసం బయలెల్లినం. తొవ్వకు దగ్గరున్న పువ్వులు తెంపుకు పోయినట్లున్నరు. ఏడ్చి ఏడ్చి, ఎక్కిళ్ళు ఆగిన పోరగాండ్లోలే కళ దప్పినయి మోదుగ చెట్లు. వెతుక్కుంట వెతుక్కుంట లోపలికి పోయినం. చెట్లమీదికేల్లి తెంపి, సంచుల్ల నింపుకున్నం.

చందు "దూప అయితుంద''న్నడు.

మా అందరికి కూడా నాలిక పిడుచ కట్టుకుపోవట్టింది.

మా ఇంటి ముందర సర్కారు బాయి కండ్లల్ల కనవడ్డది. తవ్విచ్చిన డాక్టర్ సుబ్రహ్మణ్యం తాతయ్య యాదికొచ్చిండు. ఆయన నడుసుకుంటా దవాఖానకు పోతుంటే పిల్లలమంతా పోటీలు పడేటోల్లం, షేక్ హ్యాండ్ ఇవ్వడానికి. తాతయ్య ఎందుకు బాయి తవ్విచ్చిండో అప్పుడు అర్థమైంది. "అశోక చక్రవర్తి చెట్లు నాటించెను, రహదారులు నిర్మించెను'' అని సాంఘీక శాస్త్రములో చదువుకున్నది, నిజం చేసిండు. ఆ నీళ్లు, తాత మనసోలె, అయన పోసే దగ్గమందోలె, తియ్యంగ ఉంటయి. తొవ్వొంట పోయేటోళ్ల కడుపు నింపుడే కాదు, ఎండకాలంల ఊర్ల బావులు బోర్ల వడ్డప్పుడు అదే దిక్కయ్యేది. అది కాకుంటే ప్రతాప మృత్యుంజయం సారోల్ల బాయి,

ఎటుజూసినా, కానచ్చినకాడికి ఎండిపోయిన చెల్కలే. అటాయింకల పోతే పోతాలేమయిన కనవడకపోతయాని, ముందుకు నడిచినం.

తిరుగంగ తిరుగంగ, పచ్చంగ వరిపొలం కనిపించింది. దగ్గరికి పోతే మోట బాయి. కరెంటు మోటరుది కాదు. ఎవరూ లేరు. దిగుడు బాయి అయితే దిగేటోల్లం. అది కూడా కాదు. నీళ్ల హౌస్ గానీ గోళెం గాని లేవు. గోసకే వచ్చిందని సోచాయించినం. పొలంకు పారే నీళ్లు, కాల్వల అక్కడక్కడ ఆగివున్నయి. దోసిలి తోటి తాగితే మురికి అయితయి. ఉపాయం తోటి, పశువుల్లెక్క మూతివెట్టి తాగినం. పాణం లేచి వచ్చింది. తాగుతుంటె ముక్కులకు నీళ్లు పోయి, తుమ్మవట్టిండు శెఫిక్. ఆగం మనిషి.

దూప ఆరినంక, అనిపిచ్చవట్టింది నాకు. 'కొన్నే నీళ్లుంటే మాఅండ్ల మేం కొట్టుకునేటోల్లమా!? పానం మీదికి వస్తే ప్రాణస్నేహం నిలుస్తుందా!? నీళ్లు అసలే లేకపోతే పరిస్థితి ఏంటి?'

> **"గోగూపూల దండ అటేత్తునా! మరి ఇటేత్తునా!...," అని ఆడోళ్ళు దుకాండ్ల పొంట పైసలు అడుక్కుంటా పాడే పాటల్ని, గాలి లీలగా పాడుకుంటూ దుమ్మును, పశువుల రొచ్చు వాసనను, భుజాన మోసుకు తిరుగుతున్నది.**



గట్లనే, పొలంకాడ పారుకపు నీళ్లు తాగి ప్రాణాలు పోయే నెమళ్ళ గోస సుత యాదికి వచ్చింది. పొలాలకు పెట్టె యూరియా, ఇంద్రిన్ కలిసిన నీళ్లు తాగి, పానాలు విడిసేటియి. వాటి చావు, సినిమా బొమ్మంత పెద్దదై కనవడవట్టింది.

అనుమానంతో పెయ్యంత సల్ల సెముటలు వట్టినయి. జరంత సేపయితే గాని తెల్వదు, వాటి లెక్క మేం సచ్చుడో! బతుకుడో!!

★ ★ ★

గిదంతా వాళ్ళకి చెప్తే హైరానా వడ్తరని, జప జప నడువుమని తొందరవెట్టిన. రోడుమీద వచ్చిపడ్తే ఎవలన్నదవాఖానల షెరిక్ జేత్తరు. కోసంత దూరం నడువంగనే కట్టుకాలువ కానచ్చింది. ఎగపోసుకుంట, ఆడ కొంచెం సేపు కూసున్నం.

ఓ ఖాళీ కచ్చురం ఉరాంకెల వోతుంటే, "ఎక్కుతమని'' గోసగోసోలె అడిగిండు బాబ. తీట పోరగాండ్లు వుంటరని, చానా మంది ఎక్కిచ్చుకోరు. గీయన ఏమనుకున్నడో, మంచోడున్నట్లుంది 'సరే' అన్నడు.

కళ్ళు తిప్పుడు! కడుపుల దేవినట్లవుడు! ఏం? లేదు. అంటే, ఇగ సావమన్నట్లే! అప్పటి దాంక పడ్డ భయం పోయి, హుషారచ్చింది. నేను మదన పడ్డ సంగతంతా, పూసగుచ్చినట్లు చెప్పిన. అందరూ 'సైలెంట్!' అయ్యింద్రు. ఒక్కసారిగా వాళ్ళు నన్ను కావలిచ్చుకున్నారు.

మా కథంతా, మాట్లాడకుంట విన్న బండి అతను 'నవ్విండు.'

ఇంతట్ల, పోలీస్ స్టేషన్ రానే వచ్చింది. బండి లాలపల్లి దిక్కు వొతుంటే మేం ఆడ్నేదిగి, ఆయనకు 'టాటా' చెప్పినం.

నాలుగు అడుగులు నడువంగనే సర్కారు బాయి పావురంగ పల్కరిచ్చింది. మాకు తెల్వకుండనే మా కాళ్ళు బావి కాడికి వోయినయి. 'చానొద్దులకు అమ్మను జూసిన పిలగాండ్ల లెక్క' అనిపించవట్టింది. బావి సుట్టూత తిరిగి, తాతను తలుసుకుంట కట్టు రౌతు లకు మొక్కినం. మురిపెంగా ముద్దిచ్చు కున్నం. బొక్కెన తోటి నీళ్లు చేదుకుని, కాళ్ళు - మొకం కడుక్కొని కడుపార తాగినం.

# మోదుగు పూలు నవలలో నాటి తెలంగాణ



డా॥ కాంచన పల్లి

నాటి నవలా రచయితలలో ప్రధానం గా పేర్కొదగిన రచయిత దాశరథి రంగాచార్య ఆయన కలం జాలువార్చిన నవల మోదుగు పూలు.

అసఫ్ జాహి వంశం లో చివరివాడైన ఉస్మాన్ అలీ ఖాన్ 1911 నుండి 1948 వరకు నిరంకుశం గా రాజ్యం పాలించాడు. నిజాం రాష్ట్ర విస్తీర్ణం 82 వేల చదరపు మైళ్ళు. రాష్ట్ర వ్యాపితం గా ఉన్న 1167 జాగీర్ల వైశాల్యం 11000 చదరపు మైళ్ళు నిజాం బంధువులకు చెందిన పాయె గాళ్ళ విస్తీర్ణం 3262 చదరపు మైళ్ళు. నైజం నవాబును తలదన్నిన నిరకుశత్వం జాగీర్లది.

అలాంటి ఒక జాగీర్దార్ జాగీర్ లో జరిగిన కథ ఇది. రచయిత ఈ నవలకు మోదుగు పూలు అని పేరు పెట్టడం లోనే గొప్ప ఔచిత్యం ఉంది.

మోదుగు పూలు అడవిలో ఉంటాయి. ఎర్రగా ఉంటాయి. ఈ పూలను విప్లవానికి సంకేతించారు దాశరథి రంగాచార్య. దాశరథి ద్వయానికి ఈ పూలు చాలా ఇష్టం.

మహాకవి దాశరథి కృష్ణమాచార్య (ఈ రచయితకు అన్నయ్య) మోదుగు పూలను “పూచిన మోదుగున్ పువుల పుక్కిటినుండి వసంత రాజు, రక్తాచమనంబు సేయు సమయంబిది, అని కవిత్వీకరిస్తాడు.

నవలలో మౌలికమైన కథాంశం ఇది.

రఘు అభ్యుదయ భావాలు గల నవయువకుడు. హైదరాబాద్ లో చదువు ముగిస్తాడు. తన ఊరికి ఆంగ్ల దిన పత్రిక తో వస్తాడు. దినపత్రిక చేతిలో కనబడడమే ప్రభుత్వం దృష్టిలో పెద్ద నేరం. పోలీస్ అమీన్ ఎదురుపడి రఘుని చెంపదెబ్బ వేస్తాడు. సహనం, తార్కికాలోచన రఘు సొత్తు. అతనిలో ఆలోచన మొదలవుతుంది. పరిస్థితుల ఆకళింపు పెరుగుతుంది. ప్రత్యమ్నాయం స్ఫురిస్తుంది. ఉద్యమం వైపు నడుస్తాడు. అతనిది అహింసా మార్గం. రఘు ఉద్యమానికి నగేశ్ తోడ్పడుతాడు. కాని నగేశ్




ది హింసా మార్గం. ఇద్దరిలో చాలా సార్లు అభిప్రాయ భేదం కలుగుతుంది. అయినా ఇద్దరూ కలిసే పని చేస్తారు. రఘు మేనమామ వీరయ్య, అతన్ని బాల్యం నుండి ఆరాధించే మరదలు జానకి కూడా ఉద్యమానికి తోడ్పడుతాడు. రఘు విముక్త రాష్ట్రం లోనే ఆమెను పెళ్ళాడుతానని చెబుతాడు. షావుకారు వెంకయ్య కూతురు రుక్మిణి. ఆమె నగేశ్ ని ప్రేమిస్తుంది. నగేశ్ కూడా ఆమెకి మనసు ఇస్తాడు.

అధికారుల దౌర్జన్యాలు, ప్రజల కష్టాలు చూసి రఘు కదలి పోతాడు. ప్రజలకు అధికారులు విధించే శిక్షలు చాలా భయం కరంగా ఉంటాయి. స్త్రీ లకు రక్షణ లేదు. ఏ అధికారి కన్నైనా ఏ స్త్రీ పైన పడిందో అంతే సంగతి. ఎటువంటి శిక్షనైనా నోరు మూసు కొని అనుభవించడమే ప్రజలపని. వాళ్ళతో వెట్టి చాకిరి చేయించుకోవడం అయిన దానికి కానిదానికి కోపగించుకోవడం, కట్టు కొయ్యలకు కట్టి కొట్టడం, ఎండలో నిలబెట్టి వీపు మీద బండలు ఎక్కించడం, మనిషిని గుర్రానికి కట్టి ఈడ్చుకు పోవడం, దూలానికి తలకిందులు గా వేలాడ దీయడం లాంటి శిక్షలన్నీ అధికారుల వేడుకలు. చివరికి ఈ దుర్మార్గాలన్నీ చూసి విచలితుడైన రఘు హింసా మార్గం తొక్కుతాడు. తహసీల్ దార్ కొడుకు రషీద్ రజాకార్ల నాయకుడు. అతడు

రుక్మిణి ని మాన భంగం చేస్తాడు. రుక్మిణి ఆత్మ హత్య చేసుకుంటుంది. రషీద్ జానకి ఇంటిపై అర్ధ రాత్రి దాడి చేసి చెరచ ప్రయత్నం చేస్తాడు. జానకి తనను మాన భంగం చేయ ప్రయత్నించిన రషీద్ ను కత్తి తో పొడిచి చంపుతుంది. చివరికి ప్రజల తిరుగు బాటు జరుగుతుంది. ఇంత సీరియస్ కథను దాశరథి రంగాచార్య ఆకర్షణీయమైన శైలితో పాఠక ప్రియంగా రచించాడు. అలతి వాక్యాలతో పఠిత ను తన తో తీసుకెడతాడు. ఆయన చిత్రించిన నాటి తెలంగాణ జీవన సంస్కృతి కనుల ముందు కదలాడుతుంది.

ఆ గ్రామంలో ప్రతాపరుద్రుని పాలన నాటి జ్ఞాపకాలు ఎన్నో ఉన్నట్టు రచయిత పేర్కొంటాడు. వేయి స్తంభాల గుడికి నమూనా లాంటి శిధిల దేవాలయాలు అక్కడ ఉన్నాయి. సముద్రాల్లాంటి మహాతటాకాలు ఉన్నాయి. ఒక దృశ్యం లో ఒక పల్లె మనిషి ని అమీన్ సాబ్ తనకు కోళ్ళు ఎందుకివ్వవని బెదిరిస్తాడు. ఆ మనిషి చెప్పిన సమాధానం "యాడ మిగిలినయ్ కాల్మొకుత, ఊరి బయటనే పోలీసాయనొకటి గుంజుకున్నడు, తాహసీల్దార్ దొర బంగ్లా ముందు జవాన్ ఒకటి పట్టుకున్నడు, బుట్టకోడి గుంజుకొన్నడు, కాల్మొక్త, కాలు కడుపులు పట్టుకొని బుట్ట తెచ్చుకొన్న బాంచెను, మల్ల తెచ్చిన పుడిచ్చుకుంట, గులాపోన్ని, మూడు కోడిపిల్లలు తెస్తిని, మూడు గుంజుకొనిరి, ఎం జేయమంటరు? ఒక్క పల్లె వాసి నిర్మల హృదయం, నిసర్గ భాష, అతని దైన్యం, మన కళ్ళముందు పెడతాడు రచయిత. అనేక కులాల జీవన విధానం కథాసంవిదానానికి ఏ మాత్రం ఆటంకం లేకుండా కొనసాగుతాడు రచయిత.

తెలంగాణ ప్రజాజీవితం లో పీరీల పండుగ ఒక గొప్ప అనుభవం. హిందూ ముస్లింల ఐక్యతకు అదొక గొప్ప నిదర్శనం. పండుగకు సంబంధించిన ఐతిహ్యం ముస్లిమ్ ల దే అయినా హిందువులు చాలా ఎక్కువగా పాల్గొంటారు. హసన్ సోదరులు యాజిద్ దౌర్జన్యానికి బలి అవుతారు. వారు బలి అయింది మొహరం నెలలోనే. అది మహమ్మదీయులకు అందునా షియాలకు పవిత్ర మాసం.



దాశరథి రంగాచార్య

తాషా మార్ఫా మ్రోగుతుంది. ఆశుర్ ఖానా లోన బయట జన సమర్దం ఎక్కువగా ఉంది. ముల్లా వచ్చాడు. అతడు కట్టుకున్నది ధోవతి. వేసుకున్నది కమీజు. నెత్తిన కుచ్చు టోపీ వుంది. పెట్టెలోంచి పీరీలను తీసేముందు చేత్తో వెనుక గోచీ లాగేశాడు. తాశామార్ఫ్ జోరు గా సాగింది. పీరీలను పీట మీద నిలబెట్టాడు. బట్టలు కట్టాడు. వీటి పక్కన నెమలి ఈకెల కట్టలు పెట్టాడు. అగ్ని గుండం చుట్టూ తిరుగుతూ "హసన్ హుసేన్ లిద్దరూ అన్నదమ్ములంటా. అంటూ వారి కథను పాట లో చెబుతున్నాడు.

నవల లో పీరీల పండుగ ఓ భాగం గా కనిపిస్తుంది. అట్లాగే మంగలి వృత్తి, వీళ్ళు సమ్మె చేస్తే తాహసీల్దార్ బతుకే స్తంభిస్తుంది. ఊరంతా నిర్వీర్య మౌతుంది. మంగలులకు సమ్మె చేసే చైతన్యం రఘు, నరేశ్ లనుండి లభిస్తుంది. ఈ సంఘటనల వల్ల కుల వృత్తులు సమాజ జీవన పునాదులు అని అన్యాపదేశం చేస్తాడు రచయిత. వీళ్ళు క్షురకర్మ చేయడమే కాదు, వైద్యాలు చేయడం, బెణుకులు సరి చేయడం, వాయిద్యాలు వాయించడం, లాంటి పనులన్నీటి లోనా సిద్ధహస్తులే. మంగళ్ళు, చాకల్లు, కమ్మర్లు, కుమ్మర్లు, గ్రామజీవితం లో అతి ముఖ్యమైన స్తంభాలు. అందుకే మడులిచ్చి, మాన్యాలిచ్చి, వాళ్ళను ఊరిలోకి తెచ్చి పెట్టుకున్నారు ఆ కాలం లోని గ్రామ నిర్మాతలు. ఇక కోయ సంస్కృతి, జీవన విధానం, వివాహ పద్ధతి, ఆచారాలు ఒక చలన చిత్రం లాగా మన ముందుంచుతాడు రచయిత. ఈయన స్వయం గా అడవికి వెళ్లి వాళ్ళ జీవితాన్ని పరిశీలించి చిత్రించిన అంశాలు ఇవి.

సింగి, సింగడి ప్రేమ తండ్రి కొడుకు సింగని కోసం పెట్ట (సింగిని వేటాడడం) తరువాత పిల్ల, పిల్లగాని తరపు వాళ్లకు యుద్ధం (ఉట్టుట్టి) తరువాత రాజీ, పెళ్లి, కోయ గూడెం విందులు వినోదాలు, ఇప్పసారా, నెమలి మాసం తో సహా వివిధ రకాలైన మంసాహారాలు, సింగని తల్లి మరణించి దేవత కావడం, దేవతకు జంతు బలి, ఇట్లా కోయెల ప్రసవం, వివాహం, మరణం. లాంటి అనివార్యమైన జీవన గతులలో జరిగే ఆచారాలు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తాయి. అల్లాంటి కోయల, ఒడేరల శ్రామిక జీవన సౌందర్యం, తాహసీల్దార్, ఆమెన్, గిరిదావర్, వాళ్ళమీద చేసే దౌర్జన్యం, చివరికి రఘు నగేశ్ ల ప్రభావం తో వాళ్ళు తిరుగబడిన తీరు పాఠకులను కదలిస్తుంది.

ఊరిలో కలరా వ్యాపించినపుడు ఊరి వాళ్ళ నమ్మకాలు, బైండ్ల వాళ్ళ పాటలు, తరువాత దున్నను బలి ఇవ్వడం, లాంటి వన్నీ ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆ కాలంలోని గ్రామాల్లోని విశ్వాసాలు కళ్ళముందు కదలాడుతాయి. వర్షం రావడానికి హిందువులు, ముస్లిం లు చేసే పూజలు, కప్పతల్లి ఆటలు, అందులోను అంతరంగికమైన బేధాలు, వెరసి మానవుని మనస్తత్వాన్ని పరోక్షం గా చూపిస్తాడు రచయిత. చివరికి గిరిదావరి మాంత్రికుని మాటల ప్రభావంతో ధనాశతో నరబలి కూడా చేయిస్తాడు.

పేద ప్రజల బాధలు, ఆకలి ఇట్లా ఉంటే ధనవంతుల ముస్లిం పాలకుల విలాసాలకు కొదవే లేదు. భోజనం లో పది రకాల మాంసాహారాలు, అయిదు రకాల కూరగాయాలు, పచ్చళ్ళు, పెరుగు వెన్న, మీగడ, హల్వాలు (తహసీల్దార్) వాళ్ళ భోజనాలు. సమాజంలోని ఈ రకమైన అంతరాలే విప్లవానికి, తిరుగు బాటుకి దారి తీశాయి.

ఇన్ని రోజులు గడచినా ఈ నవల ఇప్పటికీ ప్రాసంగికంగా ఉన్నదంటే రచయిత సామాజికకోణం తో శిల్ప దృష్టి మేళవించడమే.

కవిత

# గెలుద్దాం.. రా...



ఘనపురం దేవేందర్

ఎప్పుడు వస్తుందో
తెలియనిదే యుద్ధం
పరిస్థితులను ఎదురీది
చేరేదే విజయం
విమర్శలన్నీ
ప్రయాణం మధ్యలో
రాలే చినుకులు
తడిచానని యోచించేలోపే
కరిగిపోయే మరకలు
విజయమంటే
వ్యూహాలనుజి
కత్తిపదునులెక్క
అమలు పరచడం
విజయమంటే
ప్రత్యర్థి వ్యూహాలను
గంభీరంగా ఛేదించడం
విజయమంటే
త్యాగాల యాగాలకు
లభించేవరం
విజయమంటే
నష్టాలనుజి
తగ్గిస్తూ
చేరే తీరం
విజయమంటే
ధైర్యాల జాడలనను
సృజిస్తూ
సాగె పయనం
విజయమంటే
ఆత్మతృప్తిని
కలిగించే ఔషధం
విజయమంటే
ప్రత్యర్థి మెప్పును
పొందే రాజసం
విజయమంటే
విప్లవాలు, ఉద్యమాలు
ఆదర్శంగా చూసే
విమల నిఘంటువు
విజయమంటే
సామూహిక బృందగానం
విజయమంటే
ఓంకారం వంటి సాహిత్యం
విజయమంటే
నేనే కాదు... నువ్వేకాదు...
మనమంతా గెలవడం

# శుభ సాయంత్రం..!!



సైదాచారి మందోజ్

రవి మెల్లగా నిద్రలోకి జారుతుండు
ప్రకృతి అంత ఒక్కసారిగా చల్లబడింది
గువ్వపిల్లలు మెల్లగా ఆకాశ విహారం
చేస్తూ గూటిలోకి పోయి సేదతీరే
కాయకష్టం చేసిన కూలీ సద్ది,
మూటతో అలిసి వెనుతిరిగి
ఇంటికి పయనం అవుతుండు...
పశువులా కాపరి గట్టు కాడ పశువులను
పాకశాలకు తోలుకపోతుండు....
పైరు సేను పచ్చగా ముస్తాబు అయ్యి
చల్లగా ఊగుతుంది....
రైతు మట్టి గంధం పూసుకొని
సెమట సెంటు సుక్కతో
సక్కగా నవ్వుతుండు
రైతు రాజు వెన్నుతునక అంటూ
గొప్పగా మురుస్తుండు
శుభసాయంత్రం ఆహ్వానం పలికి
రావి గట్కా గొంతులో పోసి
ఇంటికి పయనం అయ్యే... !!

- అక్షరకావ్యశ్రీ

# దండ కడియమై వచ్చిన తగుళ్ళ గోపాల్

తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటినుండి తెలుగు సాహిత్యం సుసంపన్నంగా కొనసా గుతోంది. రాను రాను ఎవరి అస్తిత్వాన్ని వారు ప్రకటించడం, ఎవరికి వారు ఒక కొత్త గొంతుకతో పలకడం, ఆ క్రమంలో నూతన పద బంధాలు, పదాలు, కొత్త కొత్త ఆవిష్కరణలకు దారి చూపుతు న్నవి. ఈ వాతావరణంలో ఆరోగ్యంగా కనులు తెరచిన నవయువ కవి తగుళ్ళ గోపాల్.

తగుళ్ళ ఇటీవల వెలువరించిన కవితా సంపుటి దండ కడియం చిత్రమేమిటంటే చాలా రోజులు మాగి మాగి సాధన చేసి చేసి కవులు ఒక పరిణతమైన అభివ్యక్తిని పొందుతారు. రొటీన్ నుంచి బయట పడాలని చూస్తారు. తనకంటూ ఒక శైలిని, వ్యక్తిని నిర్మించుకుంటారు. తగుళ్ళ గోపాల్ అట్లాంటి ఘర్షణ ఎంత పొందాడో కాని, ఎంత ఒత్తిడిని అనుభవించి చాడో కాని, ఎకాఎకిన రొటీన్ కి భిన్నమైన కవిత్వంతో సాహితీ రంగంలో అడుగు పెడుతున్నాడు.




ఎర్రమన్ను కు వోయిన అక్క
నింపుకున్న ఎర్రమన్ను తట్టలో
నిమ్మళంగ కూసొని నవ్వే
తంగేడు పువ్వు పల్లె
వరుసలు గలుపుకుంటూ
గుండెల్ని అల్లుకుపోయే
ప్రతి మనిషి
నడుస్తున్న మట్టి కుండే.

తంగేడు పూవుకు పల్లెకు అభేదం చెప్పడం, మనిషిని నడుస్తున్న మట్టి కుండే అనడం, ఇట్లా ఈ కవిలో ఇంకిపోయిన ఎందరో పాత, కొత్త కవుల భాష, అలం కారిత సరికొత్తగా పుష్పించడం చూస్తాం.

కూలి తల్లి పొద్దున్నే లేచి వాకిలమ్మకు తానం చేయిస్తుందట, కనుకున్న బిడ్డల కోసం పొద్దున మోసే చుట్ట బట్టౌతుందట.

చుట్ట బట్ట అనేది తలపై బరువును మోయడానికి ఉపయోగ పడే చుట్టన బట్ట. ఈ నాగరిక ప్రపంచానికి తెలియని ఒకానొక ఉపశమన సాధనం.ఇక్కడ కూలి ఒక చుట్ట బట్ట దేనికౌతుంది? పొద్దును మోయడానికి, పొద్దును మోయడం అనేది ఆమె కాలాన్నంతా తన పిల్లల కోసం ఎట్లా ఉపయోగిస్తుందో బలంగా తెలిపే ఒక సారస్యమైన ప్రతీక. తగుళ్ళ గోపాల్ కవిత్వాన్ని ఇట్లా విశ్లేషించుకుంటూ పోతే ప్రతి పద్యం ఒక వ్యాసమే అవుతుంది.

తగుళ్ళ గోపాల్ దండకడియాన్ని ప్రేమతో స్పృశిద్దాం. అతన్ని మరింత నూతనంగా వికసించమని కోరుకుందాం.

# నేలపై నడిచే విమానానికి స్వాగతం




వాసర చెట్టు జయంతి తనకంటూ ఒక ప్రత్యేక అభివ్యక్తిని ఏర్పరచుకున్న కవయిత్రి. వ్యక్తీకరణలో మార్దవాన్ని నైశిత్యాన్ని ఏక కాలంలో సాధించింది. ఆమె ప్రతి వాక్యం జీవితానుభవాన్ని స్పృశించేదే. ఎవరూ సాధారణంగా చూడలేని, అనుభవించలేని అంశాలెన్నో ఆమె కవితానేత్రంతో చూడగలుగుతుంది.

అటు జీవితానుభవం ఇటు విస్తృత కవితా పఠనం వల్ల వచ్చిన వాక్యాలలో మానవత సాధారణీకరణం అవుతుంది. మనిషి స్వకీయ అనుభవాలను ఆమె వాక్యాలలో చూసుకోగలుగుతుంది.

పడిలేచిన కెరటాన్నడుగు
పడినపుడు కలిగే బాధ చెబుతుంది
పడినా లేచే దారిని చూపిస్తుంది

అన్న వాక్యాలలో ఉన్న జిగి, అనుభవం ఇస్తున్న స్ఫూర్తి, అని ఇట్టే అర్థమౌతుంది.

ఆమె రాసిన 'నేల విమానం' టైటిల్ కవితే తీసుకుందాం.

గంటకు పది పైసలిచ్చి
కిరాయి సైకిలు మీద
తర్ఫీదు పొందిన జ్ఞాపకం...
తొవ్వల ముండ్లు గుచ్చుకొని
టైర్లల్ల గాలిపోతే
జహంగీర్ అంకుల్ కి
పది పైసలిస్తే
ప్రాణం పోసెటోడు...

కవితలో ఎలాంటి భేషజం కనిపించదు. నిర్మాణం చాలా సరళంగా సాగిపోతుంది. తాతీలు, పొంటి, కైంచి, కళ్ళెం కావలి, లాంటి తెలంగాణ పదాలు నిశ్శబ్దంగా ఒదిగి పోయాయి. 'మా ఇంటి అరుగులు', 'అంటరాని గది దొర్లే', 'చక్రం' మొదలైన కవితలన్నీ తెలంగాణ స్థానీయతతో ఈ కవయిత్రి పొందిన మమేకాన్ని తెలియజేసేవి. నిరలంకార సౌందర్య సాధనతో ఈ కవయిత్రి తనకంటూ ప్రత్యేక శైలిని నిర్మించుకొన్నారు.

వాసర చెట్టు జయంతిని కవితా లోకంలోకి సాదరంగా స్వాగతిద్దాం. ఆమె నుంచి మరింత గొప్ప నిర్మాణంతో వెలిగిపోయే కవితల కోసం ఆశ పడదాం.

ముఖాముఖి

# సమర సాహితీ సముద్రం



**ఉద్యమం, కవిత్వం రెండింటినీ కలిపి సాగిన సుదీర్ఘ బాట నందిని సిధారెడ్డి. ఎన్ని ఇజాలను చూసినా తన తండ్రి నేర్పిన దారిలో తనను తాను మలుచుకున్న ముక్కుసూటి వ్యక్తిత్వం. అనేక భావజాలాల సంస్థలు 'వేచి చూద్దాం' ధోరణితో ఉన్నప్పుడే సిధారెడ్డి గారి సారథ్యంలోని మంజీర రచయితల సంఘం తెలంగాణకు మద్దతుగా తీర్మానం చేసిన తొలి సాహితీ సంస్థ. నిర్బంధాల నీడల నుండి ప్రపంచ తెలుగు మహాసభల వెలుగుల దాకా సాగిన వారి అవిరామ సాహితీ ప్రయాణం ఎందరికో స్ఫూర్తి. తెలంగాణ ఉద్యమంలో కవులు కళాకారులను ఏకం చేసిన ఉద్యమ నినాదం నందిని సిధారెడ్డి గారితో రంగు నవీన్ ఆచారి ఈ పక్షం ముఖాముఖి.**

**నమస్తే సార్.**

నమస్తే.

**సార్ అందరూ అడిగే ప్రశ్నే.. మీ పేరు సిధారెడ్డి ఎలా ఐంది?**

నా అసలు పేరు నర్రా సిద్దారెడ్డి. ఐతే ఇదే పేరుతో మా ఊర్లో ముగ్గురు ఉండే వాళ్ళు. ఇదే పేరు ఇదే ఇంటి పేరు. నాతో పాటు చదివే ఇంకో ఆయన కూడా ఇదే పేరుతో ఉన్నడు. నర్రా చిన్న సిద్దారెడ్డి, నర్రా పెద్ద సిద్దారెడ్డి అని ఇట్లా రకరకాలుగా పిలిచేవాళ్ళు ఊర్ల అందరు. ఈ ప్రాబ్లం లేకుండా ఉండాలని నేను ముందు నంది తిమ్మన ప్రభావంతో నంది సిద్దారెడ్డి అనుకున్నా. అనుకొని మా సిద్దిపేట్‌లో ఉమాపతి పద్మనాభశర్మ అని పండితుడు ఉండేవారు. నాకు కవిత్వంలో కొంత మార్గదర్శనం చేసేది చిన్నతనంలో. ఆయనకు చెప్పిన ఇట్ల అనుకుంటున్న అండి అని. ఆయన చూసి "నంది" శబ్దం అన్నది ఇంకా పూర్తి కాలేదు. అసంపూర్తిగ ఉంది. "ని" పెడితే సరిపోతుంది అని "నందిని" చేసాడు. నందిని సిద్దారెడ్డి ఐంది. ఈ సిద్దారెడ్డి సిధారెడ్డి కావడానికి ఇంకో చిన్న కథ ఉంది. కవి పఠాభి కి, కాంగ్రెస్ నాయకులు భోగరాజు పట్టాభి సీతారామయ్యకు ఇదే సమస్య వచ్చినపుడు పట్టాభిసీతారామయ్యకు కాంగ్రెస్‌లో పదవులు వచ్చినప్పుడల్లా అందరూ కవి పఠాభికి శుభాకాంక్షలు చెప్పేవారట. అట్లా "పట్టాభిని కాదు నేను పఠాభిని" అని ప్రకటించి పేరు మార్చుకున్నడు. ఆ ప్రభావంతో నేను కూడా నా పేరు సిధారెడ్డి గా మార్చుకున్న.

**మీ బాల్యం ఎట్ల గడచింది, మీ సాహిత్యానికి తొలి ప్రేరణ ఏమిటి?**

నేను వచ్చింది గ్రామ ప్రాంతం నుండి. మా ఊరు బందారం. మెదక్ జిల్లా కొండపాక మండలం. మా ఊర్లో జానపద సంస్కృతి ఎక్కువగా కనిపించేది. నిజానికి మా కుటుంబంలో చదువుకున్నవారెవరూ లేరు. కానీ మా బాపు రైతు. కొంచెం ధిక్కారం ఎక్కువ. ఈ నేచర్ తోని అప్పటి రజాకార్ల సమస్య మీద తిరగబడ్డడు. కమ్యూనిస్టు పార్టీలో కార్డు హోల్డర్. అట్ల గ్రామ రక్షక దళం ఏర్పాటు చేసి ఒక పది గ్రామాలకు కాపలాగా ఉండేవాళ్లు. ఒక గుర్రం మీద నాటు తుపాకితో తిరిగే వాడంట. నా చిన్నతనంలో ఇంట్లో దూలంకు గుర్రం మీద వాడే జీను ఉంటుండె. అట్ల కమ్యూనిస్టు పార్టీల పాటలు పాడే అలవాటు తనకు ఎక్కువ. సాయంత్రాల్లో సరదాకి ఊర్లో వాళ్ల మీద పాటలు కట్టి పాడే అలవాటుండె. అట్ల నాకు పాటల మీద ఒక ఆసక్తి ఏర్పడ్డది. పొద్దున నాలుగు ఐదు గంటలకు బాల సంతుల గంటల చప్పుడుతో లేస్తె రాత్రెప్పుడో శారదాకాండ్ల బుర్ర కథతోనో, ఒగ్గు కథతోనో దినం ముగిసేది. శనివారం శనివారం ఊర్ల భజన ఐతుండె గుడి దగ్గర. పోతుంటి. ఇదంతా ఒక ప్రేరణగా ఉండేది.

**కవిగా సుదీర్ఘంగా సాగిన ప్రస్థానం మీది. ఈ దిశగా మీ అడుగులు ఎక్కడ మొదలైనాయి?**

ఐతే నేను మొదట రాసింది మాత్రం పాటలు కాదు. పద్యాలు రాసిన. మా ఊర్లో ఐదవ తరగతి వరకే ఉండె. ఆరు నుండి మా పక్క ఊరు వెల్కటూరుకు వెళ్తుంటిమి. అట్ల ఎనిమిదో తరగతిలో కరుణశ్రీ పద్యాలు "బీదపూజ" పేరుతో పాఠం గూడా ఉండేది. ఇది బాగా ప్రభావితం చేసింది. రాయాలని

ఉంటుండె కాని చంధస్సు తెలువదు. ఊర్కే పద్యంలో ఎన్ని అక్షరాలు ఉంటయో లెక్కపెట్టుకొని ఇరవయ్యో ఇరవై ఒకటో అక్షరాలవి నాలుగు లైన్లు రాసి అదే పద్యం అనుకునే వాళ్లం. తర్వాత తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు అష్టకాల నరసింహరామ శర్మ అని కవి, అవధాని మాకు తెలుగు టీచర్‌గా వచ్చిండు. రావడం రావడమే తాను రాసిన "శిథిల విపంచి" అనే పద్యాల పుస్తకం తెచ్చి మా అందరికి ఇచ్చిండు. అందులోని పద్యాలు కూడా నన్ను చాలా ఆకర్షించినయి. చంధస్సు తెలుసుకొని యతులు, గణాలు, ప్రాసలు అన్ని తెలుసుకొని రాయడం ప్రారంభించిన. అట్ల కొమురవెల్లి మల్లన్న శతకం రాసిన. ఏ దేవుడిమీద ఎవరూ రాయరో ఆ దేవుడి మీద రాద్దామనుకున్న రాసిన. కాని దాన్ని అచ్చు వేయడమెట్లనో తెలియదు. ఎవరికి ఇవ్వాలో తెలియదు. మా ఊరి షావుకారు దగ్గరికి వేగంగా వెళ్లి చేతులో పెట్టి ఇంటికి ఉరుకొచ్చిన. మూడు నాలుగు రోజుల తర్వాత ఆయన కలిసి అడిగిండు ఎందుకు నాకు ఇచ్చినవ్ అని. చెప్పిన మీరు అచ్చు వేయిస్తరని ఇచ్చిన అన్న. ఊర్లో అందరి దగ్గర పైసలు తీస్కొని వేద్దామని ఆయన అన్నాడు కని నాకు అట్ల ఆసక్తి లేకుండింది. అదే సమయంలో వచన కవిత్వాన్ని నాకు పరిచయం చేసింది మళ్లీ మా గురువు అష్టకాల నరసింహరామ శర్మనే. తర్వాత మా ఊరి పంచాయతీకి లైబ్రెరీ కోసమని మూడు వందల పుస్తకాలు వచ్చినయ్. స్వతహాగ ఉన్న ఆసక్తితో అవన్ని చదివేసిన. దీంట్లో తాళ్లూరి నాగేశ్వర్ రావు గారు రాసిన 'మాఊరి కథలు' అనే పుస్తకం ఉండె. దీంట్లో మిఠాయి పంపకం అనే కథ ఉండె. ఈ కథలో స్వతంత్ర దినం నాడు ఉదయం ఒక ఊళ్లో బడి పిల్లలు అందరు ప్రభాతభేరి లో పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ర్యాలీ గా వెళ్తుంటారు. ఇట్ల నినాదాలిస్తూ వెళ్లడం నచ్చి అదే ఊళ్లో ఒక పశువులు కాసే పిల్లవాడు వాళ్ల ర్యాలీలో చేరి వాళ్లతో పాటు నినాదాలిస్తూ ఊరంతా తిరిగుతాడు, చివరికి ర్యాలీ బడికి చేరుతది. జెండా ఎగరేయడం కాగానే పిల్లలను వారి వారి తరగతి గదుల్లోకి పంపుతారు స్వీట్లు ఇవ్వడానికి. ఈ పిల్లవాడిని ఏ తరగతి గదిలోకి పోనియ్యరు. అట్ల ఆ అబ్బాయికి మిఠాయి దొరకదు. అప్పుడు చిన్నతనాన అర్థం కాలేదు కాని తర్వాత అర్థమయింది ఏందంటే స్వతంత్రం కూడా కొన్ని వర్గాలకే అందింది అని ఆ పిల్లవాడి ధ్వని అని. అది చాలా కదిలించింది. అందుకే దాన్ని నాటకంగా రాసిన. కొమురవెల్లి శతకం, ఈ నాటకం నా తొలి రచనలు.

**1969 ఉద్యమంలో మీరు పాఠశాల విద్యార్థిగా ఉన్నరు. అందులో భాగమవడం ఎట్లా జరిగింది?**

ఒక్క మా ఊరనే కాదు ప్రతీ ఊర్ల అందరు విద్యార్థులు భాగమైండ్రు దాంట్లో. కంప్లీట్ గా బడులన్ని బంద్ ఉండె. అప్పట్లో విద్యాసంస్థల్లో విద్యార్థి ఎన్నికలుండె. ఎక్కడైనా ఏ ఊర్లో అయిన ఉద్యమంలో పాల్గొనకుంటే అక్కడి విద్యార్థి నాయకుడికి పోస్టుల్లో పసుపు, కుంకుమ, గాజులు, ఒక రైక బట్ట పంపేవారు. ఉద్యమంలో పాల్గొనకపోవడం అంటే అట్ల చేసేవాళ్ళు. రోజు ఎక్కడో ఒక దగ్గర ధర్నా చేస్తుంటిమి సాయంత్రం ఎప్పుడో ఇంటికి వస్తుంటిమి. మా ఊళ్లో రెండే రేడియోలు ఉండె. బయటి విషయాలు ఏం తెలియాలన్న అదొక్కటే పద్ధతి. ఒక రేడియో పోలీస్ పటేల్ ఇంట్లో ఉంటె రెండోది అవుసుల రామాచారి వాళ్ల ఇంట్లో ఉండె. పోలీసు పటేల్ ఇంటికి ఎవరూ పోయేటోళ్లు కాదు. అందుకని రోజూ సాయంత్రం ఆరుంపావుకు వార్తలు వినేటందుకు వాళ్లింటికి పోయేది. ఇట్ల ఒక నెల కాంగనే మా బాపు తెలుసుకున్నడు రోజు ఏడికి పోతున్న అని. అపుడు మా బాపు కూడా రేడియో కొని తెచ్చిండు సిద్దిపేట నుండి. అదే సమయంలో మగ్దూం చనిపోవడం, ఆ సంతాప కార్యక్రమాల్లో సినారే తమ స్నేహాన్ని గుర్తు చేసుకొని కవిత చదవడం ఆ రేడియో జ్ఞాపకాల్లో ముఖ్యమైనవి నాకు.

> **నేను ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చేనాటికి అది విద్యార్థి ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కాలం. అన్ని వామపక్ష సంఘాలతో సన్నిహితంగా ఉన్నప్పటికీ ఎందులోనూ సభ్యుడిగా చేరలే. వారి సభలు సమావేశాలు అన్ని అటెండ్ అవుతుంటి కాని సభ్యుడిగా చేరలే. కవిత్వమే నాకు ప్రధానంగా ఉంటుండె. మా బాపు ప్రభావంతో కార్యకర్తృత్వం అంటే ఇష్టమే ఉంటుండె కాని కవిత్వం మీదనే ఎక్కువ దృష్టి.**

**మీ డిగ్రీ చదువు బీఎస్సి గా మొదలై బీఏగా ఎట్లా పూర్తైంది? అలాగే మీ తొలి ప్రచురణ సందర్భం?**

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఎస్సీలో చేరిన. మొదటి రెండు సంవత్సరాలు కవితలు రాస్తూ, కలం స్నేహంతో కాలం గడిచింది. అప్పుడు అక్కడ నవ సాహితి సంస్థ డిగ్రీ ఫైనల్ ఇయర్ లోని గులాబీల మల్లారెడ్డి, సరిపల్లి కృష్ణారెడ్డిలు నడిపేవారు. వారితో కవిత్వ పరిచయాలు ఉండేవి. వారి చదువు పూర్తై వెళ్లిపోయిన తర్వాత ఆ బాధ్యత నేను చూసిన. అట్లనే అదే సమయంలో నేను, కందుకూరి శ్రీరాములు, కర్నాల బాలరాజు కలిసి "దివిటీ" పేరుతో మినీ కవితల సంకలనం వేసినం. ఈ సందర్భంగనే శివారెడ్డిని కలిసిన. ఆ పుస్తకం హైదరాబాద్‌లో అచ్చుకు ఇచ్చినం. ఆ పని మీద వచ్చి మూడు రోజులు ఇక్కన్నే ఉండాల్సి వచ్చింది. ఎక్కడ ఉండాలో తెలియదు. రెడ్డి హాస్టల్ అరుగు మీద పడుకుంటే అక్కడి నుండి లేపితే వచ్చి అక్కడే ఒక చెట్టు కింద పడుకున్న. అట్ల మూడు రోజులైతే గడిపిన కాని అన్నం తినలే. అప్పట్లో ఐదు పైసలో పది పైసలో చాయ్ ఉండే. అది తాగుతూ ఉన్న. దివిటీ ఆవిష్కరణకు శివారెడ్డి ఐతే బాగుంటదని బెడిద రాజేశ్వర్ చెప్తే వెతుక్కుంటూ జాంబాగ్‌లో వివీ కాలేజ్ పోయిన. ఆయన అక్కడ లెక్చరర్‌గా ఉండె. నన్ను చూడంగనే ఏంది ఇట్ల ఉన్నవ్ ఏమన్న తిన్నవ అన్నడు. ఇట్ల పుస్తకం ఆవిష్కరణ కోసం వచ్చిన అనంగానే లేదు ముందు ఏమన్న తిను అని తీస్కపోయి దోశ తినిపిచ్చిండు. అదే మొదటిసారి కలవడం ఆయనను. కాని తల్లి

హృదయం శివారెడ్డిది. ఇదంత అయినంక పుస్తకం చూపించిన. తప్పకుండా వస్త అని చెప్పి దేవీప్రియ కూడా వస్తడు అని చెప్పిండు. అట్ల మా తొలి సంకలనం ఆవిష్కరణకు మొదటిసారి శివారెడ్డి, దేవీప్రియలు సిద్దిపేట రావడం జరిగింది. ఆనాటి మా సభలో ఈ పుస్తక సమీక్షలో మా గణిత గురువు చుక్కా రామయ్య గారు కూడా ఒక సమీక్ష చేసారు. ఆ సంవత్సరం కవితలు, సాహిత్య సభలు ఇవన్ని ఎక్కువై చదువుమీద దృష్టి తగ్గింది. అట్ల పార్ట్ వన్ లో లాంగ్వేజెస్ పాస్ అయిన కానీ పార్ట్ టూ లో సబ్జెక్టులు అన్నీ ఫెయిలైన. తెలుగు మీదా ఎక్కువ ఆసక్తి కాబట్టి మళ్లీ బీఏ తెలుగులో ఎక్స్ టర్నల్ కట్టి చదివి పాస్ అయిన. ఓయూలో ఎంఏ తెలుగు చదవాలన్న కోరిక బలంగా ఉండే.

**ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నప్పటి సాహితీ సోపతులు, వారి ప్రభావం మీ పైన ఎలా ఉంది?**

నేను ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చేనాటికి అది విద్యార్థి ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కాలం. అన్ని వామపక్ష సంఘాలతో సన్నిహితంగా ఉన్నప్పటికీ ఎందులోనూ సభ్యుడిగా చేరలే. వారి సభలు సమావేశాలు అన్ని అటెండ్ అవుతుంటి కాని సభ్యుడిగా చేరలే. కవిత్వమే నాకు ప్రధానంగా ఉంటుండె. మా బాపు ప్రభావంతో కార్యకర్తృత్వం అంటే ఇష్టమే ఉంటుండె కాని కవిత్వం మీదనే ఎక్కువ దృష్టి. అందరితో కవిత్వ చర్చలు జరిపేవాడిని. ద్వారకా సర్కిల్ దగ్గర శివారెడ్డి రోజూ సాయంత్రాలు జరిపిన చర్చలు ఇప్పటికీ తాజాగా అనిపిస్తయ్ నాకు. అట్లనే సినారెతో తరచుగా కలిసే వాడ్ని. కొన్ని సార్లు శివారెడ్డిని తీసుకొని రమ్మని చెప్పేది తను. అదే సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడం లో నేను ముఖ్యంగా ఉన్న. అట్ల కవిత్వాన్ని శ్వాసిస్తూ సాగిన రోజుల్లోనే ఉద్యోగ పరీక్షలు రాసిన. డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ రెండు రాస్తే ముందు డిగ్రీ లెక్చరర్ ఫలితాలు వచ్చినై. మెదక్ లో వెళ్లి జాయిన్ కావలసి వచ్చింది. ఇదే మాట నారాయణరెడ్డి గారిని కలిసి చెప్పిన. ఆయన ఏట్ల ఉంటవయ్యా అక్కడ అన్నడు. నేనన్న అదెంది సార్ మెదక్ ఊరు కాదా అన్న. కవిత్వం ఉండదు కదనయ్యా అన్నడు. మనం తయారు చేద్దాం సార్ అన్నా. అన్నట్టే మెదక్ లో చేరిన పది రోజులకే మెదక్ స్టడీ సర్కిల్ పెట్టినం.

**మంజీర రచయితల సంఘం ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులేమిటి? మరసం సాహితీ సేవ ఎలా జరిగింది?**

మెదక్ స్టడీ సర్కిల్ నుండి మంచి కార్యక్రమాలు జరిగాయి. ఇది ఒక పట్టణానికి పరిమితం కావొద్దు అని చాలామంది మిత్రులు చెప్పడంతో జిల్లా స్థాయి సంస్థ ఏర్పాటు చేసి జిల్లాలో పారే నది పేరుతో

> **నేను మొదట రాసింది మాత్రం పాటలు కాదు. పద్యాలు రాసిన. మా ఊర్లో ఐదవ తరగతి వరకే ఉండే. ఆరు నుండి మా పక్క ఊరు వెల్కటూరుకు వెళ్తుంటిమి. అట్ల ఎనిమిదో తరగతిలో కరుణశ్రీ పద్యాలు "బీదపూజ" పేరుతో పాఠం గూడా ఉండేది. ఇది బాగా ప్రభావితం చేసింది. రాయాలని ఉంటుండె కాని చంధస్సు తెలువదు. ఊర్కే పద్యంలో ఎన్ని అక్షరాలు ఉంటయో లెక్కపెట్టుకొని ఇరవయ్యో ఇరవై ఒకటో అక్షరాలవి నాలుగు లైన్లు రాసి అదే పద్యం అనుకునే వాళ్లం.**

మంజీర రచయితల సంఘం ఏర్పాటు చేసినం. వందలమందిని కవులుగా తిర్చిదిద్దింది "మరసం". పేరుకు జిల్లా సంఘమైనా అన్ని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై పని చేసినం. అన్ని జిల్లాల నుండి కవులు తరచుగా సభలకు వచ్చేవారు. ఎందరో ప్రముఖ కవులను మా మరసం సభల్లో అతిథులుగా పిలిచినం. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి మద్దతుగా 1996లోనే తీర్మానం చేసిన తొలి సాహితీ సంస్థ మరసం. కార్యక్రమాలలో దేవిప్రసాద్, దేశపతి శ్రీనివాస్, విరహత్ అలి, రసమయి బాలకిషన్ వీళ్లంతా కలిసే వాళ్లు. అట్లనే తెలంగాణ ఉద్యమానికి దగ్గరగా పని చేస్తున్న క్రమంలో భువనగిరి, ఘట్కేసర్ తదితర ప్రాంతాల్లో సభల్లో పాల్గొన్న నేను. ఎప్పుడైతే ఉద్యమం మీద అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ముఠాల పేరుతో కోబ్రాల పేరుతో దాడులు మొదలు పెట్టిందో అదే సమయం లో కేసీఆర్ గారు పార్టీ పెట్టడం అన్నది ఇక్కడి తెలంగాణ ఉద్యమ సంస్థలకు, ప్రజాస్వామిక వాదులకు ధైర్యాన్నిచ్చింది.

**తెలంగాణ రచయితల వేదిక ఏర్పాటు ఎలా జరిగింది? తెలంగాణ ఉద్యమంలో తెరవే పాత్ర?**

కె చంద్రశేఖర్ రావు మా సిద్దిపేట ప్రాంత నాయకుడు కావడంతో సహజంగానే నాకు కొంత సాన్నిహిత్యం ఎక్కువ ఉండేది. అనంతర కాలంలో మలి దశ ఉద్యమంలో కవులు కళాకారులను ఉద్యమానికి దన్నుగా



నిలపాల్సిన అవసరం ఏర్పడ్డది. అది గుర్తించే 2001లో మంజీర రచయితల సంఘం సభల్లోనే తెలంగాణ రచయితల వేదికకు పునాదులు పడ్డాయి. ఇదే క్రమంలో కరీంనగర్ లో ఆవిర్భావం జరగగా వరంగల్ లో తొలి సభలు జరిగాయి. తర్వాత నల్గొండ, హైదరాబాదులలో సభలు పెట్టినం. ఇగ అక్కడినుండి అన్ని తెలంగాణ జిల్లాల్లో సభలు నిర్వహించడం, పెద్ద యెత్తున, మేం ఊహించిన దానికన్నా ఎక్కువగా కవులు రచయితలు పాల్గొనడం జరిగింది. అదొక సాంస్కృతిక ప్రస్థానం. తెలంగాణ ఉద్యమ ఘట్టాల్లో అడుగడుగునా తెరవే అట్లా భాగమైంది.

**తెలంగాణ జాగృతి ఏర్పాటుతో తెలంగాణ ఉద్యమానికి, తెలంగాణ సమాజానికి మంచి మేలు చేకూరింది. సంస్థ నిర్వహించిన అనేక కార్యక్రమాలకు కవితగారు నన్ను ఆహ్వానించారు. ప్రధానంగా బతుకమ్మ కార్యక్రమాల్లో ఇక్కడే కాక బహ్రైన్, కువైట్, యూకే వంటి చోట్లకు వారితో పాటు హాజరయ్యాను. అట్లనే జాగృతి జిల్లాల్లో నిర్వహించిన కవి సమ్మేళనాల్లో చాలాచోట్ల పాల్గొన్నాను. వేలాది కవులు ఇందులో పాల్గొన్నారు. సంస్కృతిక అంశాలలో, చరిత్ర, సాహిత్యం వంటి అంశాలలో జాగృతి నిర్విరామ కృషిని అభినందిస్తున్నా.**

**రచయితల వేదిక తర్వాత తెలంగాణ ఉద్యమంలో మీ పాత్ర ఎలా ఉంది?**

2007 అనంతర కాలంలో అనివార్యమైన పరిస్థితుల్లో తెలంగాణ రచయితల వేదికను వదిలి పెట్టవలసి వచ్చినా ఉద్యమంలో మాత్రం క్రియాశీలకంగా ఉన్నాను. తెలంగాణ వాదమే అంశంగా తెరాస ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లిన 2008 ఉపఎన్నికల సందర్భంలో ఐనా, కేసీఆర్ ఆమరణ దీక్ష సందర్భంలో ఐనా, జేఏసీ ప్రకటన, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం వంటి చారిత్రాత్మక ఉద్యమ ఘట్టాల్లో భాగం అయిన. ఇదే కాదు దాదాపు ఉద్యమ కాలంలోని ప్రతీ కీలక సందర్భంలో కేసీఆర్ గారితో వ్యూహ రచన సమయాల్లో ఉన్నా. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాష్ట్ర పునర్నిర్మాణంలో కవులు, రచయితల పాత్ర ఉండాలన్న ఉద్దేశ్యంతో తెలంగాణ రచయితల సంఘం ఏర్పరచి తెలంగాణ వ్యాప్తంగా సాహితీకారులకు ఒక వేదికపైకి తీసుకొచ్చినం. నాళేశ్వరం శంకర్, వి. శంకర్ వంటి మిత్రులు ప్రస్తుతం ఆ పనులు చూస్తున్నరు.

**తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం ఏర్పడ్డ తెలంగాణ సాహిత్య అకాడమీకి మీరు తొలి అధ్యక్షులుగా ఉన్నారు. సాహిత్య అకాడమీ నుండి జరిగిన సాహితీ సేవ, తెలుగు మహాసభల్లో మీ పాత్ర చెప్పండి?**

ఇక తెలంగాణ సీఎం కేసీఆర్ గారితో నాది ప్రత్యేకమైన అనుబంధం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జరిగిన అనేక చర్చల్లో ఈ రాష్ట్రంలో సాంస్కృతిక పరంగా చేయవలసిన అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించినం. కొద్ది కాలంలోనే తెలంగాణ సాహిత్య అకాడమీకి తొలి అధ్యక్షుడిగా నా నియామకం జరిగింది. ఇక్కడ అకాడమీ కొత్తదే, రాష్ట్రమూ కొత్తదే. మరోవైపు సంస్కృతికంగా తీవ్ర వివక్షను, విస్మరణను చూసిన నేల కాబట్టి అకాడమీ బాధ్యత ఇంకా పెరిగింది. ముఖ్యమంత్రి గారు ఎంతో నమ్మకంతో అకాడమీ ఏర్పరిచారో మేమూ అంత శ్రమించినం. రెండున్నరేళ్ల కాలంలోనే దాదాపు 120 అమూల్యమైన గ్రంథాలు తీసుకు రావడం జరిగింది. అట్లనే పునాస త్రైమాసిక సాహితీ పత్రికను ప్రారంభించాము. "కావ్య పరిమళం" పేరుతో 12 నెలలపాటు 12 అధునిక, ప్రాచీన కావ్యాలపై ప్రసంగాలు నిర్వహించి ఆ మొత్తం ప్రసంగ పరంపరను ఒక పుస్తకంగా ప్రచురించినం. ఇక ముఖ్యమంత్రి గారి ఆలోచనతో ప్రభుత్వం నిర్వహించిన తెలుగు మహాసభలు ఒక చరిత్ర. ఈ మహాసభలకు తెలంగాణ సాహిత్య అకాడమీకి సారథ్య బాధ్యతలు అప్పచెప్పడం అనేది నా పదవీ కాలంలో అత్యంత తృప్తినిచ్చేటటువంటి అంశం. ఇందుకు సీఎం కేసీఆర్ గారికి కృతజ్ఞతలు. దేశ విదేశాలనుండి ప్రతీ రోజు వేలాది ప్రతినిధులు రావడం భాషను ఒక వేడుకగా జరుపుకోవడం, జాతీయ నాయకులు వేడుకల్లో పాల్గొనడం తెలుగుకు ఒక ప్రపంచ స్థాయి గౌరవాన్ని తెచ్చిపెట్టిన సభలవి. మహాసభల అనంతరం ఒక ప్రత్యేక సంచికను సాహిత్య అకాడమీ నుండి తీసుకు రావడం జరిగింది.

**తెలంగాణ జాగృతితో మీ అనుబంధం చెప్పండి?**

తెలంగాణ జాగృతి ఏర్పాటుతో తెలంగాణ ఉద్యమానికి, తెలంగాణ సమాజానికి మంచి మేలు చేకూరింది. సంస్థ నిర్వహించిన అనేక కార్యక్రమాలకు కవిత గారు నన్ను ఆహ్వానించారు. ప్రధానంగా బతుకమ్మ కార్యక్రమాల్లో ఇక్కడే కాక బహ్రైన్, కువైట్, యూకే వంటి చోట్లకు వారితో పాటు హాజరయ్యాను. అట్లనే జాగృతి జిల్లాల్లో నిర్వహించిన కవి సమ్మేళనాల్లో చాలాచోట్ల పాల్గొన్నాను. వేలాది కవులు ఇందులో పాల్గొన్నారు. సాంస్కృతిక అంశాలలో, చరిత్ర, సాహిత్యం వంటి అంశాలలో జాగృతి నిర్విరామ కృషిని అభినందిస్తున్నా. ఈ దిశగా మరింత పని జాగృతి నుండి జరగాలన్నది నా ఆకాంక్ష.

**సార్, తంగేడు సాహిత్య పత్రిక చూసారా? మీ అభిప్రాయం చెప్పండి?**

చాలా సంతోషకరమైన విషయం ఇది. ఒక సాహితీ పత్రిక జాగృతి నుండి తీసుకు రావాలి అన్నది కవిత గారు ఎప్పటినుండో అనుకుంటున్న విషయం. నాతో కూడా అనేక మార్లు ఈ విషయమై చర్చించారు. ఈ బతుకమ్మ సందర్భంగా వచ్చిన తొలి సంచిక అందింది. మంచి అంశాలతో, నాణ్యమైన ముద్రణతో ఒక సాహితీ పత్రిక రావడం అన్నది మంచి పరిణామం. పాత కొత్తల కలయికతో వచ్చిన తొలి సంచిక చాలా బాగుంది. ఆధునిక రచనలకు ప్రాధాన్యత కొంత పెంచితే బాగుంటుందనే నా అభిప్రాయం. తెలుగు సాహిత్య వికాసంలో "తంగేడు" ప్రభావ శీలమైన భాగస్వామి కావాలని కోరుకుంటున్నా.

# ఆస్కార్ అవార్డ్ విజేత 2020




**చిత్రం:పారసైట్, దర్శకుడు : బోంగ్ జూన్ హో, భాష : కొరియన్**

ఉత్తమ చిత్రంగా ఎంపికైన పారాసైట్ (కొరియన్ చిత్రం) ఏకంగా నాలుగు ఆస్కార్ అవార్డులని సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి గాను ఉత్తమ డైరెక్టర్ అవార్డ్ కూడా దక్కడం విశేషం.

మొదటినుండి ఎన్నో ఊహాగానాలతో పోటీలో నిలిచిన పారాసైట్ అనే ఈ దక్షిణ కొరియా చిత్రం మానవ సంభందాల్లో ఉన్న మంచి, చెడులను రెండింటిని ఈ సినిమా ఆవిష్కరిస్తుంది. మధ్య తరగతి జీవితాలు ఎంత దుర్భరమో..దాని నుండి బయిటపడటానికి ఎంత కష్టపడతారో, ఎంతకు తెగిస్తారో చూపెడుతుంది. అదే సమయంలో అందుకోసం చేసే పనులు... ఏ విధంగా ఇరుకున పెడతాయో స్పష్టంగా చూపించారు. ఈ పాత్రల్లో మనని మనం చూసుకోగలుగుతాం. వాళ్ల చేసింది తప్పు అయినా మనకు వారిపై కోపం రాకుండా సానుభూతి పెరుగుతుంది. అయ్యో.. వీళ్ల ఈ సమస్య నుంచి ఎలోగోలా బయిటపడితే చాలు అని ప్రార్థించాలనిపిస్తుంది. ఆ విధమైన ఎమోషన్స్ తో సినిమాని తీర్చిదిద్దాడు దర్శకుడు బోంగ్ జూన్ హో. ఈ చిత్రంలో వినోదంతో పాటు భావోద్వేగాలకు పట్టం కడుతూ ఆస్కార్ అవార్డుల పంట పండించారు.

# ఫిలింఫేర్ అవార్డుల్లో గల్లీ బాయ్




**చిత్రం : గల్లీ బాయ్(2020) దర్శకురాలు : జోయ అక్తర్ భాష : హింది**

గల్లీ గ్యాంగ్ అనే ర్యాప్ బృందాన్ని నిర్వహిస్తున్న ముంబాయ్ వాసులు డివైన్, నేజీల నిజ జీవిత అనుభవాల స్ఫూర్తితో జోయ తెరకిక్కించిన చిత్రమే గల్లీ బాయ్. ఈ చిత్రం ఫిలింఫేర్‌లో గత రికార్డులను తిరగరాస్తూ ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకులు, ఉత్తమ స్క్రీన్ ప్లేతో పాటు మొత్తం 13 అవార్డులను సొంతం చేసుకుంది.

ధారవి మురికి వాడాలో పుట్టి పెరిగిన ఒక పేదింటి యువకుడి కథే గల్లీ బాయ్ మురాద్(రణవీర్ సింగ్) ఒక డ్రైవర్ కొడుకుగా మనకు పరిచయం అవుతాడు. అప్పుడే యువతకు పరిచయమైన ర్యాప్ సంగీతం నేర్చుకోవాలి అనే తపనతో చదువు కూడా పక్కన పెట్టి తనకు తెలిసిన విషయాల పై ర్యాప్ చేస్తుంటాడు తన తండ్రి మాత్రం తన కొడుకు బాగా చదివి మంచి ఉద్యోగం పొందాలి అని కోరుకుంటుంటే తను మాత్రం ర్యాప్ సింగర్ అవ్వాలని ఆరాట పడుతుంటాడు. తన ప్రయాణంలో అనుక్షణం తనకు తోడుగా ఉంటూ తన ప్రతిభను గుర్తించి మురాద్ ప్రేయసిగా సఫీనా (అలియా భట్) ప్రేక్షకులను ఆకట్టుకునేలా నటించింది.

ఎవరు తనకు సహకరించకున్న “అప్నా టైం ఆయేగా” అంటూ తన ర్యాప్ ని కొనసాగిస్తున్న సమయంలో అతనికి ర్యాపర్ షేర్ (సిద్ధాంత్) పరిచయం అవుతాడు ఇక్కడితో తన కథ మలుపు తిరగడం అలాగే ర్యాపర్ షేర్, మురాద్ ప్రతిభను గుర్తించి ర్యాప్ చేయడంలో మెలుకువలు నేర్పడంతో నూతనమైన ర్యాపర్‌గా గల్లీ బాయ్ అవతరిస్తాడు.

దర్శకురాలు జోయ అక్తర్ కష్టాల్లో ఉండి సాధించాలనే పట్టుదలతో ప్రయత్నించే ప్రతిఒక్కరికి స్ఫూర్తిగా ఒక మాములు కథాంశం ఎన్నుకొని అద్భుతమైన స్క్రీన్ ప్లేతో ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేయడంలో విజయం సాధించారు. ముంబాయి మురికివాడల్లో పుట్టిన మురాద్ లాంటి ఒక పాత్రకి రణవీర్ సింగ్‌ని ఎన్నుకోవడం ఆ పాత్రను ప్రతి ఒక్కరు తమకు తెలిసిన కుర్రాడు అనేలా మలచడంలో జోయ విజయం సాధించారు.

# తెలంగాణ సారస్వత పరిషత్ ప్రచురణ
# 'వచన కవిత్వం- వస్తు శిల్పాలు' గ్రంథం ఆవిష్కరణ




తెలంగాణ సారస్వత పరిషత్ ప్రచురణ 'వచన కవిత్వం- వస్తు శిల్పాలు' కల్చరల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గ్రంథం ఆవిష్కరించారు. ఎడమ నుండి కుడికి శిఖామణి, మామిడి హరికృష్ణ, ఎల్లూరి శివారెడ్డి, రామారావు, కాంచనపల్లి గో.రా. జె. చెన్నయ్య.

## తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఉపద్రవ గాథ "అనిమేష" ఆవిష్కరణ




నాళేశ్వరం శంకర్, నందిని సిద్ధారెడ్డి, వి. శంకర్ తదితరులు

## విశ్వనాథ సృష్టి - ఆచార్య సుప్రసన్న దృష్టి

అక్షరార్చన భారత భారతి వాక్జ్యోతి సమూహం పక్షాన నిర్వహించిన సాహిత్య కార్యక్రమం 'విశ్వనాథ సృష్టి - ఆచార్య సుప్రసన్న దృష్టి అనే అంశంపై డా గంగ్ర లక్ష్మణరావు ప్రసంగించారు. రామాయణ కల్పవృక్షం లో శ్రీవిద్యా రహస్యాన్ని నిక్షిప్తం చేసినట్లు సుప్రసన్న గారు రసరాజధానిలో నిరూపించారని, సీతను ఆదిపరాశక్తిగా ధ్వనింపజేశారని వివరించారు. విశ్వనాథకు సన్నిహితంగా ఉన్న సుప్రసన్న తాత్విక కోణంలో వివేచించారని తెలిపారు. యోగ లక్షణాలు, మొదలైనవి ఇతరకావ్యాల్లో తెలిపినవాటిని లక్ష్మణరావు సోదాహరణంగా వివరించారు. గిరిజామనోహరబాబు, నాగిళ్ళ రామశాస్త్రి, కుందావఝుల కృష్ణమూర్తి , పాలకుర్తి శ్యామలానంద ప్రసాద్, హన్మంత రావు, వఝుల రంగాచార్య, అనంతకృష్ణ మొదలైనవారు పాల్గొన్నారు.

# కనుల నిండుగ... బతుకమ్మ పండుగ...



















# ‘తెలంగాణ జాగృతి’ ఆధ్వర్యంలో వివిధ దేశాలలో బతుకమ్మ సంబరాలు















## చైనాలో కవితా యాత్ర

డా॥ ఎన్. గోపి
అభవ ప్రచురణలు,
హైదరాబాద్
వెల- రూ: 150
ఫోన్: 9391028496



## రామ కృష్ణ యుధిష్ఠర చరితము

ఆచార్య వి. నిత్యనందరావు
వెల- రూ: 50
ఫోన్ 04029703142



## అవని (ప్రకృతి తత్వం)

జయరాజు
ప్రతులకు:
ప్రజాశక్తి బుక్ హౌజ్
విశాలాంధ్ర బుక్ హౌజ్
వెల- రూ: 500
ఫోన్ 9866160035



## కాళోజీ యాది

ప్రచురణ:
తెలంగాణ జాగృతి
ప్రతులకు: తెలంగాణ భవన్,
బంజారాహిల్స్
ఫోన్. 9676096614




## 'విభక్తి ప్రపత్తి'- ఉదాహరణ కావ్యము

మరుమాముల దత్తాత్రేయ
శర్మ
శ్రీరామ సిద్ధాంతి ప్రచురణలు
హైదరాబాద్
వెల: రూ. 50
9441039146



## మబ్బుల మాటు

డా॥ కూర్మాచలం
శంకర స్వామి
వెల- రూ: 100
9390828188



## నాంపల్లి నరసింహస్వామి శతకము

శ్రీ కృష్ణ లీలలు
అడ్లూరి జనార్ధన్ రాజు
విద్యా నగరము,
కరీంనగర్
ఫోన్ : 9515913206



## ఊరి దస్తూరి

తెలంగాణ సాంస్కృతిక చిత్ర
అన్నవరం దేవేందర్
ఎండూరి రాజేశ్వరి
ప్లాట్ నం. 406
మారుతీ హెవెన్స్
భగత్ నగర్, కరీంనగర్
ఫోన్ : 9440763479




## పుస్తకపాణీ! - శతకము

మరుమాముల దత్తాత్రేయ శర్మ
శ్రీరామ సిద్ధాంతి ప్రచురణలు
హైదరాబాద్
వెల: రూ. 50
9441039146




## ప్రపంచీకరోనా

డా.ఎన్ గోపీ
అభవ్ ప్రచురణలు
హైదరాబాద్
వెల: రూ. 100
9848254745

## పచ్చబడ్డ తెలంగాణ

